www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
బుధవారం
31-07-2024
సంపుటి : 01 । సంచిక : 88 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




వయనాడ్ లో మహా విపత్తు.. నాలుగే.. నాలుగు గంటల్లో ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టింది.. కొండ చరియలు భారీగా విరిగిపడ్డాయి.. చూస్తుండగానే మూడు ప్రాంతాలు కనుమరుగైపోయాయి.. వరద ప్రవాహం పోటెత్తడంతో వందలాది ఇళ్లు నామరూపాల్లేకుండా కొట్టుకుపోయాయి. వందలాది మంది ప్రజలు గల్లంతయ్యారు. 125 మంది దుర్మరణం చెందారు. శిథిలాల కింద ఇంకా వందలాది మంది చిక్కుకు పోయారు.. కేరళకు వెంటనే సాయం అందించాలని లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ కోరారు. జాతీయ విపత్తుగా ప్రకటించాలని రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యురాలు జెబీ హిషామ్ డిమాండ్ చేశారు. ప్రధాని ఆదేశాలతో కేంద్రమంత్రి జార్జికురియన్ కేరళకు వెళ్లారు. మృతుల కుటుంబాలకు రెండు లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. కేరళలో సహాయక చర్యల కోసం ఐదుకోట్ల రూపాయలను విడుదల చేస్తున్నట్లు తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రకటించారు.

# వయనాడ్‌లో విలయం

## కొండచరియలు విరిగిపడి 125మంది దుర్మరణం

అంతకంతకూ పెరుగుతున్న మృతుల సంఖ్య

600 మంది కార్మికులు గల్లంతు

కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్

11



# ఒలింపిక్స్‌లో మనుచరిత్ర

రెండు కాంస్యాలు సాధించిన తొలి అథ్లెట్‌గా రికార్డు

**సరబ్‌జోత్‌సింగ్‌తో కలిసి రెండో పతకం**



భగవద్గీతే తనకు ప్రేరణ అని చెప్పిన భారత అథ్లెట్ మనుభాకర్ ఒలింపిక్స్‌లో మరో కాంస్య పతకం సాధించి చరిత్ర సృష్టించింది. స్వాతంత్ర్యం తర్వాత ఒక ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన అథ్లెట్‌గా నిలచింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ కేటగిరీలో భారత షూటర్ మను భాకర్- సరబ్ జోత్ సింగ్ జోడీ.. కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. సరబ్ జోత్ సింగ్ కూడా పడి లేచిన కెరటంలా కోల్పోయిన చోటే తిరిగి సగర్వంగా విజేతగా నిలిచాడు.రైతు కుటుంబంలో పుట్టి ఎయిర్ పిస్టల్‌పై ఆసక్తితో ఒలింపిక్స్ పతకం సాధించే వరకు పోరాటపటిమ కొనసాగించాడు. మనుభాకర్ ఒలింపిక్స్‌లో తొలి పతకం సాధించి మూడు రోజులు గడవక ముందే మరో పతకం తెచ్చిపెట్టడంతో యావత్ దేశం గర్వపడుతోంది. 'షూటర్లు మరోసారి మనల్ని గర్వించేలా చేశారంటూ ప్రధాని కొనియాడారు. రాష్ట్రపతి అభినందనలు తెలిపారు. (వివరాలు 11లో)



# రైతులకు ఇది నిజమైన స్వేచ్ఛ

## వారి సంతోషం చూస్తుంటే నా జన్మ ధన్యమైంది: సీఎం

- రుణమాఫీ రెండో విడత నిధుల విడుదల
- లక్షన్నర లోపు రుణాల మాఫీ
- 6.4 లక్షల మంది రైతులకు రూ.6,190 కోట్లు జమ
- 12 రోజుల్లోనే 12 వేల కోట్లు విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



**విశ్వంభర, హైదరాబాద్:** ఆగస్టు నెలలోనే దేశానికి స్వాతంత్రం వచ్చిందని ఈ ఏడాది ఆగస్టులోనే తెలంగాణలోని రైతులందరూ రుణ విముక్తులవుతున్నారని, రెండు లక్షల రుణ భారం తీరి నిజమైన స్వేచ్ఛను పొందుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ జులై, ఆగస్టు నెలలు దేశ చరిత్రలోనే మిగతా2లో...

## బీఆర్ఎస్ ఘర్ వాపసీ షురూ!

- తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు
- సొంత గూటికి చేరిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి
- ఆయన బాటలోనే మరో ముగ్గురు ఎమ్మెల్యేలు వస్తున్నారని లీకులు
- మేం కాంగ్రెస్ లోనే ఉంటామంటున్న కాలే యాదయ్య, తెల్లం వెంకట్రావు



2

## కులగణనపై లోక్ సభలో రగడ

- అనురాగ్ ఠాకూర్ వ్యాఖ్యలతో తీవ్ర గందరగోళం
- తన కులం ఏదో తెలియని వ్యక్తి కులగణన గురించి మాట్లాడడం విడ్డూరమన్న ఠాకూర్
- తనను సభలో ఎన్నిసార్లు అవమానించినా బాధపడనన్న రాహుల్



2

విద్యుత్ విచారణ కమిషన్ ఛైర్మన్ గా

## జస్టిస్ మదన్ భీంరావు లోకూర్



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ విచారణ కమిషన్ ఛైర్మన్ గా జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ నియమించింది. గత ప్రభుత్వం హయాంలో విద్యుత్ శాఖలో జరిగిన అవినీతి, అక్రమ ఒప్పందాలపై విచారణ చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ విచారణ కమిషన్ ను నియమించింది. ఈ విద్యుత్ విచారణ కమిషన్ కు మిగతా2లో...

ఫార్మా సిటీ భూములు తిరిగి

## రైతులకు ఇచ్చేస్తారా?

- రూ. 16 వేల కోట్లతో మూసీ బ్యూటిఫికేషన్ కు సిద్ధం చేశాం. లక్షా 50 వేల కోట్లు ఎందుకు?
- ఎస్ఆర్డీపీ ప్రాజెక్ట్ ల పనులను కొనసాగించాలి: కేటీఆర్



2

## కాంగ్రెస్ ప్రభుత్వమని మీరనుకుంటున్నారు

- తెలంగాణ ప్రభుత్వం అని నేను అనుకుంటున్నాను
- ఈ ప్రభుత్వం మనందరిది..
- నిజాయతీగా గెలవాలనుకున్నా అందుకే ఇన్నాళ్లు పట్టింది



2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 94 | రిటైల్ ₹ 116 |
| స్కిన్ ₹ 168 | స్కిన్ లెస్ ₹ 191 |



# తెలంగాణలో కీచక పర్వం

## కదులుతున్న బస్సులో మహిళపై అత్యాచారం

**హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై స్నేహితుడి అఘాయిత్యం**

**విశ్వంభర,నిర్మల్, హైదరాబాద్:** మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. మహిళలను ఒంటరిగా చూస్తే చాలు, వారిపై దౌర్జన్యాలకు, అత్యాచారాలకు కొందరు కీచకులు పాల్పడుతున్నారు. ఈ నేరాలను అరికట్టేందుకు సర్కార్ కఠిన చర్యలు తీసుకుంటున్నా, నేరాలు మాత్రం ఆగడం లేదు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో రెండు వేర్వేరు చోట్ల మిగతా2లో...

## పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

**విశ్వంభర, సున్నిపెంట :** కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం ఉధృతంగా చేరుతోంది. దీంతో అధికారులు ప్రాజెక్టు మూడు గేట్లను 10 అడుగుల మేర గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరద నీరు పోటెత్తుంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్ట్ 10 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 10 గేట్లను 10 అడుగుల మేర ఎత్తారు. శ్రీశైలం ప్రాజెక్టులోకి 3,79,822 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 3,32,447 క్యూసెక్కుల ఔట్ ఫ్లో కొనసాగుతోంది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 883.9 అడుగులకు చేరుకున్నది.



# ఆశాల ఆందోళన

## వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసన

**ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం.. ఎక్కడికక్కడ అరెస్టులు**




**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ కోఠిలోని వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం ముందు మంగళవారం ఆశాకార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. పోలీసులు కార్యాలయం లోపలికి అనుమతించకపోవడంతో రహదారిపై బైఠాయించారు. ట్రాఫిక్ కు ఇబ్బంది కలగడంతో పోలీసులు వారిని ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. పోలీసులకు, మిగతా2లో...

# ప్రపంచ పెట్టుబడిదారుల చూపు భారత్ వైపు: మోదీ

**విశ్వంభర, ఢిల్లీ:** ప్రపంచ పెట్టుబడిదారులందరి చూపు ఇప్పుడు భారత్ వైపే ఉందని ప్రధాని మోదీ అన్నారు. భారత పారిశ్రామిక రంగం ఈ సువర్ణావకాశాన్ని అందిపుచ్చుకొని 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాకారం చేయడంలో తమవంతు పాత్రను పోషించాలని పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌పై సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో 'వికసిత భారత్ దిశగా ప్రస్థానం' అంశంపై మోదీ ప్రసంగించారు. ''మా ప్రభుత్వానికి ఎలాంటి రాజకీయ ఎజెండా ఉండదు. ప్రతీ నిర్ణయాన్ని దేశ ప్రయోజనాలే పరమావధిగా తీసుకుంటాం. నేషన్ ఫస్ట్ పాలసీతో ముందుకు సాగుతాం'' అని స్పష్టం చేశారు. ''భారత ఆర్థిక వ్యవస్థ 8 శాతం వృద్ధితో పురోగమిస్తోంది. ప్రస్తుతం ఐదో అతిపెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్, మూడో స్థానానికి చేరే రోజులు ఎంతో దూరంలో లేవు. నా ప్రస్తుత మూడో టర్మ్‌లోనే ఇది జరిగినా జరగొచ్చు'' అని మోదీ అన్నారు.2014కు ముందు యూపీఏ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా ఉందని చూపేందుకు బడ్జెట్‌లో భారీ ప్రకటనలు గుప్పించేదని, క్షేత్రస్థాయిలో వాటి అమలును పట్టించుకోలేదని అన్నారు.పథకాలను పూర్తి చేసేందుకు గత ప్రభుత్వాలు శ్రద్ధ కనబరచలేదని దుయ్యబట్టారు.గత పదేండ్లుగా తాము ఆ పరిస్థితిని మార్చివేశామని ప్రధాని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే తాము రైల్వే బడ్జెట్‌ను 8 రెట్లు పెంచామని, హైవేల బడ్జెట్‌ను 8 రెట్లు, వ్యవసాయ బడ్జెట్‌ను 4 రెట్లు పెంచామని తెలిపారు. రక్షణ బడ్జెట్‌ను రెండింతలు పైగా పెంచామని చెప్పుకొచ్చారు. యూపీఏ హయాంలో లక్షలాది కోట్ల రూపాయల విలువైన అవినీతి కుంభకోణాలు వెలుగుచూసిన విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. తాము శ్వేతపత్రం రూపంలో దేశ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్ని దేశ ప్రజల ముందుంచామని చెప్పారు. మనం ఎక్కడ ఉన్నామనేదానిపై చర్చ జరగాలని చెప్పారు.భారత పరిశ్రమలను నూతన శిఖరాలకు చేర్చామని తెలిపారు. దేశ అభివృద్ధికి మూలధన వ్యయం కీలకమని 2004లో యూపీఏ తొలి బడ్జెట్‌లో మూలధన వ్యయం కేవలం రూ. 90,000 కోట్లు కాగా, ఇప్పుడు తమ ప్రభుత్వం రూ. 11 లక్షల కోట్లు పైగా మూలధన వ్యయం వెచ్చిస్తోందని ఈ నిధులతో దేశంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇవాళ మనం వికసిత్ భారత్ దిశగా పయనిస్తున్నామని, ఈ మార్పు కేవలం సెంటిమెంట్లతో రాలేదని, ఆత్మవిశ్వాసంతోనే ఇది సాధ్యమైందని అన్నారు. ప్రపంచంలో మనం ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగామని, భారత్ త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# విద్యుత్ విచారణ కమిషన్ ఛైర్మన్‌గా జస్టిస్ మదన్ భీంరావు లోకూర్

(మొదటి పేజీ తరువాయి)

ఛైర్మన్ గా జస్టిస్ నర్సింహా రెడ్డి ఉన్నారు. అయితే అయన మాజీ సీఎం కేసీఆర్ ను విచారణ పిలిచారు. అయితే కేసీఆర్ విచారణకు వెళ్లలేదు.కేసీఆర్ సుప్రీం కోర్టుకు వెళ్లారు. కేసీఆర్ వేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. కేసీఆర్ తరపున ముకుల్ రోహత్గి, తెలంగాణ ప్రభుత్వం తరపున సిద్ధార్థ లూథ్రా, కమిషన్ తరపున గోపాల్‌శంకర్ నారాయణన్ వాదించారు. విచారణ పూర్తి కాకముందే జస్టిస్ నరసింహా రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేయడాన్ని కేసీఆర్ తరుపు న్యాయవాదులు సుప్రీం దృష్టికి తీసుకెళ్లారు. ఇరు పక్షల వాదన విన్న దేశ అత్యున్నత న్యాయస్థానం నరసింహా రెడ్డి తప్పించాలని స్పష్టం చేసింది.అయితే విద్యుత్ కమిషన్ విచారణ చేసుకోవచ్చని తేల్చి చెప్పింది. దీంతో జస్టిస్ నరసింహా రెడ్డి కమిషన్ ఛైర్మన్ పదవీకి రాజీనామా చేశారు. దీంతో ఖాళీగా ఉన్న విద్యుత్ విచారణ కమిషన్ కు ఛైర్మన్ ను నియమించారు. ఇందుకు సంబంధించి మంగళవారం విద్యుత్ విచారణ కమిషన్ కొత్త ఛైర్మన్ గా జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మదన్ బీ లోకూర్ ఉమ్మడి ఏపీలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేశారు.ఆయన 1977లో ఢిల్లీ యూనివర్సిటీ నుంచి ఎల్.ఎల్.బి. డిగ్రీ పొందారు. ఆయన సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టుల్లో న్యాయవాదిగా విధులు నిర్వహించారు. సివిల్, క్రిమినల్, రాజ్యాంగ, రెవెన్యూ, సేవల చట్టాల్లో ఆయనకు చాలా అనుభవం ఉంది. లోకూరు అదనపు సొలిసిటర్ జనరల్‌గా కూడా పని చేశారు. 1999 జులై 5న ఢిల్లీ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

# తెలంగాణలో కీచక పర్వం

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన మరో రెండు దారుణాలు బాధితుల ఫిర్యాదులతో వెలుగుచూశాయి.

**కదులుతున్న బస్సులో మహిళపై అత్యాచారం..**

కదులుతున్న బస్సులో మహిళపై డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. నిర్మల్ జిల్లా నుంచి ప్రకాశం వెళుతున్న మహిళపై ఆఘాయిత్యం జరిగింది. నోట్లో గుడ్డలు కుక్కి డ్రైవర్ తనపై అత్యాచారం చేశాడని డయల్ 100 ద్వారా బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మేడ్చల్ సమీపంలో బస్సు ఉండగా మహిళ ఫిర్యాదుతో, అప్రమత్తమైన సిటీ పోలీస్. హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన బస్సు కోసం గాలింపు చర్యలు చేపట్టి, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోకి రాగానే బస్సును చేజ్ చేసి పట్టుకున్నారు. కాగా డ్రైవర్ కృష్ణ పరారీలో ఉన్నట్లు సీఐ రాజేందర్ తెలిపారు. మరో డ్రైవర్ సిద్దయ్యను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు వివరించారు.ఈఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సిఐ తెలిపారు. ఈటనతో తీవ్ర షాక్ కు గురైన బాధితురాలిని వైద్యపరీక్షల కోసం ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు.

**సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై స్నేహితుల అఘాయిత్యం..**

హైదరాబాద్‌లో మరో దారుణ ఘటన సైతం చోటుచేసుకుంది. ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై స్నేహితుడు అత్యాచారం చేసిన ఉదంతం బాధితురాలి ఫిర్యాదుతో బయటపడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తన ఫ్రెండ్స్‌తో కలిసి ఓ హోటల్‌కు వెళ్లారు. అప్పటికే బాధితురాలు మత్తులో ఉండటంతో కొంత సమయం అనంతరం స్పృహ వచ్చిన వెంటనే చిన్ననాటి స్నేహితుడితో పాటు మరో వ్యక్తి రూమ్‌లో ఉండగా బాధితురాలు భయాందోళనకు గురైనట్లు వివరించారు. దాంతో ఆమె అరవడంతో హోటల్ సిబ్బంది రూమ్‌కు వెళ్లడంతో అక్కడ ఉన్న ఇద్దరు పరారయ్యారు. వెంటనే బాధితురాలు తన స్నేహితులకు విషయం తెలపడంతో హోటల్ సిబ్బంది, బాధితురాలిని స్థానికంగా ఉన్న హాస్పిటల్‌కు తరలించి వైద్యం అందించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న వనస్థలిపురం పోలీసులు పరారీలో ఉన్న ఇద్దరు కొరకు సీసీ కెమెరాలలో నిక్షిప్తమైన దృశ్యాల ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేసినట్లు తెలిపారు.

# ఆశాల ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

ఆశా కార్యకర్తలకు తీవ్ర వాగ్వాదం, తోపులాట జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. వేతనం రూ.18వేలు ఇవ్వాలని.. 15 రోజుల సమ్మెలో ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీలను అమలు చేయాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తల ఆందోళనకు బీజేపీ మహిళా మోర్చా మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా తెలంగాణ బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పా రెడ్డి మాట్లాడుతూ.. గత రెండు నెలలుగా ఇవ్వని పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఆశావర్కర్ల జీతం రూ. 9 వేల నుంచి 18 వేలకు పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు జీతాల పెంపు హామీ నెరవేర్చలేదని ఇకనైనా ఆశావర్కర్ల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు.

# ఫార్మా సిటీ భూములు తిరిగి రైతులకు ఇచ్చేస్తారా?

- రూ. 16 వేల కోట్లతో మూసీ బ్యూటిఫికేషన్ కు అంతా సిద్ధం చేశాం. లక్షా 50 వేల కోట్లు ఎందుకు?
- హైదరాబాద్ లో ఎస్ఆర్డీపీ ప్రాజెక్ట్ ల పనులను కొనసాగించాలి
- శాసన సభలో పద్దులపై చర్చ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్ లో ఫార్మా సిటీని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తే ఈ ప్రభుత్వం దాన్ని ముందుకు కొనసాగించటం లేదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మా సిటీ కోసం ముచ్చర్ల సహా పలు గ్రామాల్లో దాదాపు 12 వేల ఎకరాల భూమి సేకరించామన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ ను రద్దు చేసినట్లు పలుమార్లు ప్రకటించిందని గుర్తు చేశారు. మరి ప్రాజెక్ట్ ను రద్దు చేస్తే రైతులకు వారి భూములను ఎప్పుడు తిరిగి ఇచ్చేస్తారో చెప్పాలన్నారు. గతంలో కాంగ్రెస్ నేతలు కోదండరెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు, సీఎం రేవంత్ రెడ్డి ఫార్మా సిటీ భూములు తిరిగి రైతులకు ఇచ్చేస్తామని ప్రకటించారని కేటీఆర్ గుర్తు చేశారు. ఒక వేళ ఫార్మాసిటీని రద్దు చేస్తే రైతులకు భూములు ఎప్పుడు తిరిగి ఇస్తారో చెప్పాలని శాసనసభలో పద్దులపై జరిగిన చర్చలో కేటీఆర్ పేర్కొన్నారు.

**మూసీపై డీపీఆర్‌ను బయటపెట్టాలి**

అదే విధంగా మూసీ సుందరీకరణకు సంబంధించి ఖర్చు భారీగా పెంచేయటంపై కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ సుందరీకరణలో కీలకమైన సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్ పనులను వందశాతం తమ ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. మూసీ బ్యూటిఫికేషన్ కు రూ. 16 వేల కోట్లతో మా ప్రభుత్వమే డిజైన్ లు కూడా పూర్తి చేసిందని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. "కానీ ఈ ప్రభుత్వం మూసీ బ్యూటిఫికేషన్ కోసం ఒక్క సారి రూ. 50 వేల కోట్లు అంటోంది. పర్యాటక శాఖ మంత్రి రూ. 75 వేల కోట్లు అంటారు. ఇటీవల గోపన్ పల్లి లో ముఖ్యమంత్రి ఏకంగా లక్షా 50 వేల కోట్ల రూపాయలు అంటారు. అసలు 16 వేల కోట్లతో ఈస్ట్, వెస్ట్ ఎక్స్ ప్రెస్ హై వే తో పాటు మూసీ బ్యూటిఫికేషన్ పూర్తి చేసేందుకు మేం అన్ని సిద్ధం చేశాం. మరి ఈ ప్రభుత్వం వచ్చాక ఖర్చు రూ. లక్షా 50 వేల కోట్లకు ఎందుకు పెరిగిందో ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి" అని కోరారు..

**హెచ్ ఎండీఏకు ఆ నిధులు ఏమూలకు?**

హైదరాబాద్ లో ఎస్ఆర్డీపీ, ఎస్ఎన్డీపీ ప్రాజెక్ట్ లలో భాగంగా పనులు పూర్తిగా నిలిచిపోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎనిమిది నెలలుగా ఫ్లై ఓవర్లు, బ్రిడ్జిల నిర్మాణం ఆపేశారన్నారు. బిల్లులు చెల్లించకపోవటం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని, వెంటనే బిల్లులు చెల్లించి పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎలివేటేడ్ కారిడార్లు కూడా పూర్తి చేస్తామని ఘనంగా ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నా హెచ్ ఎం డీ ఏకు ఈ బడ్జెట్ లో కేవలం రూ. 700 మాత్రమే కేటాయించిందన్నారు. రూ. 5 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టులు ఎలా పూర్తి చేస్తారో ప్రజలకు చెప్పాలని శాసన సభలో మంత్రి కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

దీనికి సంబంధించి భట్టి తమ వద్ద డీపీఆర్ కూడా ఉందని చెప్పారని...ఉంటే ఆ డీపీఆర్ ను ప్రజల ముందు ఉంచాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వమని మీరనుకుంటున్నారు

- తెలంగాణ ప్రభుత్వం అని నేను అనుకుంటున్నాను

**విశ్వంభర, హైదరాబాద్:** "ఇది కాంగ్రెస్ ప్రభుత్వమని మీరు అనుకుంటే నేను నా ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుకుంటున్నా" నని బీజేపీ కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. అసెంబ్లీలో పద్దులపై చర్చ సందర్భముగా ఆయన మాట్లాడుతూ ఈరోజు ప్రభుత్వం రుణమాఫీ చేశారని, ఏ పార్టీ అయినా మంచిని మంచిగా అంగీకరించాలన్నారు. రుణమాఫీని తాను స్వాగతిస్తున్నానన్నారు. ప్రభుత్వంలో మనమంతా సభ్యులమేనని గుర్తుంచుకోవాలన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వమని కొందరు అనుకుంటే తాను మాత్రం తెలంగాణ ప్రభుత్వంగా భావిస్తున్నానన్నారు.ఈ ప్రభుత్వం మనందరిదని, ప్రభుత్వం చేసే కార్యక్రమాలలో పార్టీలకతీతంగా మనం కూడా ఉండాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలలో రాహుల్ గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ ఫొటోలు పెడితే మనం పోకపోవచ్చునని... కానీ మన ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి ఫొటోలు ఉన్నాయన్నారు. కాబట్టి ఇది రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమంగానే భావిస్తున్నామన్నారు. మీరు కూడా (కాంగ్రెస్ ప్రభుత్వం) అలాగే ఆలోచించాలన్నారు.

**నిజాయతీగా గెలవాలనుకున్నా... అందుకే ఇన్నాళ్లు పట్టింది**

సభ నడిచేటప్పుడు సీనియర్లు తమలాంటి వారికి మార్గదర్శకంగా ఉండాలని కోరుకుంటున్నానని కాటిపల్లి అన్నారు. శాసనసభ వ్యవహారాల మంత్రిని తాను కోరేది ఒక్కటేనని... అన్నా, రేపటికి మనం మార్గదర్శకంగా ఉందామన్నారు. 'కొత్తగా వచ్చావు.. మారకపోతావా.. మేం చూడకపోతామా అని ఎవరైనా అనుకుంటారేమో... కానీ నేను మారే వ్యక్తిని కాదు' అన్నారు. తాను రాజకీయాలకు కొత్త కాదని, గతంలో జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కూడా పని చేశానని తెలిపారు. కానీ నిజాయతీగా గెలవాలనే కారణంతో తాను సభకు రావడానికి ఇన్నాళ్లు పట్టిందన్నారు. వంకర తోవలో గెలవాలనుకుంటే తాను ఎప్పుడో (సభకు) వచ్చేవాడినన్నారు. అయినా సభ్యులు ఇక్కడకు వచ్చాక మారుతున్నారా? అర్థం కావడం లేదన్నారు. ప్రజలతో మాట్లాడినప్పుడు సీరియస్ నెస్ కనిపిస్తుందని, కానీ ఇక్కడకు వచ్చే సరికి సీరియస్‌నెస్ ఉండదా? అన్నది అర్థం కావడం లేదన్నారు. అసెంబ్లీ ఎప్పుడూ మర్యాదపూర్వకంగా నడవాలన్నారు. ఓ సభ్యుడు మాట్లాడినప్పుడు 119 మంది సభ్యులు వినాలన్నారు. మనం మాట్లాడింది 119 మంది ఎమ్మెల్యేల ద్వారా తెలంగాణ ప్రజలకు చేరుతుందన్నారు. కానీ 10 గంటలకు అసెంబ్లీ ప్రారంభమైతే 12 గంటలకు టీ బ్రేక్ ఇస్తారని, కానీ నిత్యం సభకు వచ్చేవాళ్లు వస్తుంటారు... పోయేవాళ్లు పోతుంటారని, చూస్తుంటే కాలేజీలో ఇంటర్ పిల్లలను చూసినట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. టీచర్ అటు చూసేసరికి ఒకరు వెనుక డోర్ నుంచి వెనక్కి జారుకుంటున్నట్లుగా సభలో కనిపిస్తోందన్నారు. తాను ఎవరినీ అవమానించడం లేదని... చట్టసభలు అంటే తనకు గౌరవం ఉందన్నారు. ఇదే చట్టసభల్లో అందరం చాలా గౌరవంగా ఉండాలన్నారు. కక్షలు, ద్వేషంతో ఉండాలని తాను కోరుకోవడం లేదన్నారు. కానీ మంచిని మంచిగా... చెడును చెడుగా చెప్పాలన్నారు. తిట్టుకోవడం ఎంత సేపు... బయట నేను వేసినంత సెటైర్లు ఎవరూ వేయరని, కానీ సభలో అలా చేయనన్నారు. తాను ఇప్పటి వరకు సభ గురించి తప్పుగా మాట్లాడలేదన్నారు.

# రైతులకు ఇది నిజమైన స్వేచ్ఛ

(మొదటి పేజీ తరువాయి)

లిఖించదగ్గవని అభివర్ణించారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా.. మంగళవారం మధ్యాహ్నం అసెంబ్లీ ప్రాంగణం నుంచే రైతు రుణమాఫీ రెండోవిడత నిధుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, కౌన్సిల్ ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో పాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలందరి సమక్షంలో పలువురు రైతులకు చెక్కులు పంపిణీ చేసి సంబురాలు నిర్వహించారు. ఇదే వేదిక నుంచి రెండో విడతగా రాష్ట్రంలో లక్షన్నర లోపు పంట రుణాలున్న రైతులందరి రుణాలను మాఫీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. మొత్తం 6.40 లక్షల మంది రైతుల రుణ ఖాతాల్లో రూ.6,190 కోట్లు జమ చేస్తున్నామని చెప్పారు. రుణవిముక్తి పొందిన లక్షలాది రైతులు తమ ఇండ్లలో పండుగ చేసుకుంటుంటే తమ జన్మ ధన్యమైందని అన్నారు. కేవలం 12 రోజుల్లోనే రూ.12 వేల కోట్ల రుణం మాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వం చిత్తశుద్ధికి అద్దం పట్టిందని అన్నారు. రైతుల సంక్షేమ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధిని ఎవరూ శంకించలేరని, తమ ప్రభుత్వ ప్రణాళికలను ఎవరూ ప్రశ్నించలేరంటూ సవాలు విసిరారు. ఏకకాలంలో రూ.31 వేల కోట్లు కేటాయించి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ దేశ చరిత్రలోనే కొత్త రికార్డు సృష్టించిందని అన్నారు. స్వతంత్ర భారతంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కూడా ఇంత పెద్ద మొత్తంలో రైతు రుణమాఫీ చేయలేదని అన్నారు. సాధారణంగా ఎన్నికలు వచ్చినప్పుడే కొన్ని పార్టీల నేతలకు రైతులు గుర్తుకు వస్తారని సీఎం అన్నారు. కానీ ఇప్పుడేం ఎన్నికలల్లేవని, ఓట్లు లేవని.. రాజకీయ ప్రయోజనాలు కాదు.. తమకు రైతుల ప్రయోజనాలే ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. వ్యవసాయం దండుగ కాదు.. పండుగ చేసి చూపిస్తామని 2022 మే 6వ తేదీన కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్ చేసిందని సీఎం గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులు సంతోషంగా ఉండాలని అధికారంలో చేపట్టిన ఎనిమిది నెలల్లోనే రైతు రుణమాఫీ అమలు చేశామని చెప్పారు.

దేశంలో కొన్ని కార్పొరేట్ సంస్థలు బ్యాంకుల నుంచి అప్పులు తీసుకొని, దివాలా తీసినట్లు మోసం చేశాయని అన్నారు. గడిచిన పదేండ్లలో బ్యాంకులకు దాదాపు రూ. 14 లక్షల కోట్లు ఎగవేశాయని అన్నారు. పది మందికి అన్నం పెట్టే రైతులు మాత్రం పంట దిగుబడి రాక, గిట్టుబాటు ధర లేక అప్పులు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఆత్మ గౌరవం దెబ్బతిని కొందరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డ విషాద ఘటనలు చోటు చేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే రైతుల కుటుంబాల్లో విషాదం ఉండకుండా ఆనందం నింపాలని రూ.రెండు లక్షల రైతు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.

గత ప్రభుత్వం రూ.లక్ష రైతు రుణమాఫీ కూడా సరిగ్గా చేయలేక పోయిందని, మొదటి సారి అధికారంలో ఉన్నపుడు నాలుగు విడతల్లో మాఫీ చేస్తే.. రైతులు తమ అప్పుకు మించి మిత్తీలు కట్టాల్సిన పరిస్థితి వచ్చిందని గుర్తు చేశారు. రెండో సారి అదే హామీతో అధికారంలో వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.19 వేల కోట్లు ఇస్తామని చెప్పి, రూ.12 వేల కోట్లు విడుదల చేసిందని అన్నారు. దాదాపు రూ.7 వేల కోట్లు రైతులకు రుణ మాఫీ చేయకుండా ఎగవేసిందని అన్నారు. అప్పుల్లో కూరుకుపోయిన తెలంగాణ ప్రభుత్వం ఎలా రుణమాఫీ చేస్తుందని కొందరు తమను అవహేళన చేశారని అన్నారు. శాపనార్థాలు పెట్టారని గుర్తు చేశారు. కానీ తమ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు నెలలోగా రుణమాఫీకి ప్రణాళిక ప్రకారం నిధులను సమీకరించిందని చెప్పారు. ఇది తమ ప్రభుత్వం చిత్తశుద్ధి, నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి దేశంలోనే హరిత విప్లవం తీసుకు వచ్చారని, జైజవాన్, జై కిసాన్ నినాదాలతో దేశ భద్రత, ఆహార భద్రతకు అనాడు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిచ్చిందని గుర్తు చేశారు. రైతులకు మేలు చేసేందుకే భాక్రానంగల్ నుంచి నాగార్జునసాగర్ ప్రాజెక్టులు నిర్మించిందని, పేద రైతులకు తక్కువ వడ్డీలకు రుణాలు ఇచ్చేందుకు ఇందిరమ్మ బ్యాంకుల జాతీయికరణ చేసిందని, , సోనియా గాంధీ నేతృత్వంలోని మన్ మోహన్ సింగ్ ప్రభుత్వం ఆహార భద్రత చట్టం తెచ్చిందని, రూ.72 వేల కోట్ల రుణాలు మాఫీ చేసి రైతులను ఆదుకుందని గుర్తు చేశారు. విత్తనాలు, ఎరువుల సబ్సిడీ, ఉచిత విద్యుత్తు, పంటల బీమా, మద్దతు ధరలను అందించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. అప్పుడు .. ఇప్పుడు ఎప్పుడూ కాంగ్రెస్ రైతు పక్షపాతి అని గుర్తు చేశారు.ఇచ్చిన మాట ప్రకారం నెల రోజుల్లోనే లక్షన్నర లోపు రైతు రుణాలను మాఫీ చేశామని, అగస్టులోగా రూ.2లక్షల రుణమాఫీ పూర్తి చేసి రైతులను రుణ విముక్తులను చేస్తామని భరోసా ఇచ్చారు.

గత ప్రభుత్వం అప్పుల పాల్జేసి తెలంగాణను తాకట్టు పెట్టిందని ముఖ్యమంత్రి అన్నారు. తాకట్టు నుంచి తెలంగాణను విడిపించి, రుణాల భారం తగ్గించేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం చేసిన రూ.7 లక్షల కోట్ల అప్పులకు తమ ప్రభుత్వం ఈ ఎనిమిది నెలల్లో రూ.43 వేల కోట్లు కిస్తీలు చెల్లించిందని చెప్పారు. కేవలం 12 రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ.12 వేల కోట్లకుపైగా నిధులు జమ చేసిన ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, ఆర్థిక శాఖ అధికారుల బృందానికి ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అటు రైతు రుణమాఫీతో పాటు ఆరు గ్యారంటీల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్య శ్రీ, 200 యూనిట్ల లోపు ఉచిత గృహ విద్యుత్తు, రూ.500కు గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేసి చిత్తశుద్ధి చాటుకున్నామని అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలతో పాటు సీపీఐ, బీజేపీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. పార్టీలకు అతీతంగా ఈ వేడుకలో పాలుపంచుకున్న నేతలందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

# బీఆర్ఎస్ ఘర్ వాపసీ షురూ!


**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి . ఇన్ని రోజులేమో.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరిగా కాంగ్రెస్ కండువా కప్పుకుంటూ గులాబీ బాస్ కేసీఆర్‌కు షాకుల మీద షాకులు ఇచ్చిన విషయం తెలిసిందే. కాగా.. ఎండలు తగ్గిపోయి వానలు మొదలైనట్టుగా.. తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలు మెల్లిగా ఇంటి బాట పడుతున్నట్టు సూచనలు అందుతున్నాయి. ఇటీవలే కాంగ్రెస్ కండువా కప్పుకొన్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి.. ఈరోజు తిరిగి సొంత గూటికి చేరుకోవటం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే.. బండ్ల బాటలోనే మరో ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా మళ్లీ హస్తం దోస్తీకి కటీఫ్ చెప్పి బీఆర్ఎస్ కారు ఎక్కేందుకు సిద్ధంగా ఉన్నట్టు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీలో చేరిన కృష్ణమోహన్ రెడ్డి.. కొన్ని రోజుల్లోనే మనసు మార్చుకుని.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో తిరిగి గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఇక బండ్ల ఎపిసోడ్‌తో.. కొత్త ప్రచారం తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ మొదలుపెట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌కు కౌంటర్‌గా.. బీఆర్ఎస్ పార్టీ ఘర్ వాపసీకి తెరలేపినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే బండ్లతో పాటు మరో ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా తిరిగి గులాబీ గూటికి చేరుకోనున్నారంటూ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ వార్తలకు ఇదిగో సాక్ష్యం అంటూ.. ఓ ఫొటోను కూడా బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. బీఆర్ఎస్ ఘర్ వాపసీ కార్యక్రమంలో భాగంగా.. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు , చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, తిరిగి సొంత గూటికి వచ్చేందుకు నిర్ణయించుకున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. అయితే.. ఈ క్రమంలోనే.. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు.. లాబీలో బీఆర్ఎస్ మాజీ మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డితో కూర్చున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో పాటు ఈ విషయాన్ని బీఆర్ఎస్‌లోని అగ్ర నేతలు కూడా ధ్రువీకరిస్తుండటంతో.. ఘర్ వాపసీ వార్తలకు బలం చేకూరుతోంది.

**కాంగ్రెస్‌లోనే కొనసాగుతాం.. బీఆర్ఎస్‌పై ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కాలే యాదయ్య ఫైర్**

కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లోకి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య వెళ్తారని ప్రచారం జరిగింది. ఈ విషయాన్ని ఇద్దరు ఎమ్మెల్యేలు తీవ్రంగా ఖండించారు. తాము కాంగ్రెస్‌లోనే కొనసాగుతామని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు అసెంబ్లీ మీడియా పాయింట్‌లో తెల్లం వెంకట్రావు చిట్ చాట్ లో మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో కొందరు అల్ప సంతోషులు ఉన్నారని విమర్శించారు. తన ఫొటో తీసి పార్టీ మారుతారని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. చాలా మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ మంత్రుల ఛాంబర్లకు వచ్చి కలుస్తున్నారు.. వారంతా పార్టీ మారేవారేనా అని ప్రశ్నించారు. తాను పార్టీ మారే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌తోనే తన ప్రయాణమని తెల్లం వెంకట్రావ్ తేల్చిచెప్పేశారు

# కులగణనపై లోక్ సభలో రగడ

**విశ్వంభర, ఢిల్లీ:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు వాడివేడిగా కొనసాగుతున్నాయి. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ , కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ మధ్య మంగళవారం తీవ్ర వాగ్వాదం జరిగింది. రాహుల్‌గాంధీని ఉద్దేశించి లోక్‌సభలో కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ తన కులం ఏదో తెలియని వ్యక్తి కులగణన గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో రాజీవ్‌గాంధీ పార్లమెంట్ లోనే ఓబీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించారని అన్నారు. దళితులు , ఓబీసీలపై కాంగ్రెస్ నేతలు కపటప్రేమ చూపిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్. కులగణన పేరుతో రాహుల్‌గాంధీ రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. దళితులు , ఓబీసీలపై కాంగ్రెస్ నేతలు



కపటప్రేమ చూపిస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్. కులగణన పేరుతో రాహుల్‌గాంధీ రాజకీయం చేస్తున్నారని విమర్శించారు.తనను సభలో ఎన్నిసార్లు అవమానించినా బాధపడనని , తప్పకుండా కులగణన అమలు చేసి చూపిస్తామన్నారు రాహుల్‌గాంధీ. అయినప్పటికి తనకు అనురాగ్‌ఠాకూర్ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. అనురాగ్‌ఠాకూర్ వ్యాఖ్యలతో సభలో తీవ్ర గందరగోళం చెలరేగింది. విపక్ష సభ్యులు కేంద్రమంత్రి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సాక్షిగా అయితే తాను రాహుల్‌గాంధీ పేరును సభలో ప్రస్తావించలేదన్నారు అనురాగ్‌ఠాకూర్. తన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు ఎందుకు ఉలిక్కిపడుతున్నారని ప్రశ్నించారు. మరోవైపు అగ్నిపథ్ పథకంపై కూడా సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అఖిలేశ్‌యాదవ్‌తో కూడా అనురాగ్‌ఠాకూర్‌కు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.

# యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

## పట్టించుకోని మున్సిపల్ అధికారులు



**విశ్వంభర, ఘట్కేసర్ :** దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టు కోవాలి అనే సామెత ఘట్కేసర్ మున్సిపాలిటీ కి కరెక్టుగా సరిపోతుంది. ఘట్కేసర్ మున్సిపాలిటీ పదో వార్డులో ఎలాంటి పర్మిషన్ లేకుండా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తో స్థానిక కౌన్సిలర్లకు అండగా నిలుస్తున్నారని స్థానిక ప్ర జలు అనుకుంటున్నారు. అక్రమ ఇంటి నిర్మాణాల యజమానుల ముందు కౌన్సిలర్లు గద్దల్లా వాలి సెటిల్మెంట్ చేసుకుంటున్నారు. పూర్తి స్థాయి టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడం, ఘట్కేసర్ మున్సిపల్ కమీషనర్ ఉన్నా ఆఫీస్ కే పరిమితం అవడం టౌన్ ప్లానింగ్ సిబ్బంది చైర్మన్ కనుసన్నల్లో పనిచేస్తుండడంతో అక్రమనిర్మాణాలకు అడ్డుక ట్ట పడడంలేదు. రెసిడెన్షియల్ అనుమతులు పొందిన ని ర్మాణదారులు మున్సిపల్ చట్టాన్ని గాలికి వదిలేసి ఇంటి నిర్మాణదారులు కౌన్సిలర్లును నమ్ముకుని అక్రమ కట్టడాలు యదేచ్చగా కొనసాగిస్తున్నారు. కమర్షియల్ నిర్మాణాలు కొనసాగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బందే చుట్టపు చూపుగా వచ్చి తూతూ మంత్రంగా కౌన్సిలర్లతో కుమ్ముక్కై యాక్షన్ పేకప్ అన్నట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు అనుకుంటున్నారు.



## బ్రెయిన్ స్ట్రోక్‌తో బీజేపీ నాయకుడు మృతి

**విశ్వంభర, చైతన్యపురి :** బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు పసుపుల హరిబాబు బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాచం ఫౌండేషన్ చైర్మన్, వి3 న్యూస్ ఛానల్, విశ్వంభర దినపత్రిక అధినేత డాక్టర్ కాచం సత్యనారాయణ చైతన్యపురిలో హరిబాబు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హరిబాబు కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ ఏదైనా అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలతో ఆయనకు మంచి సంబంధాలు ఉండేవని అన్నారు. అందర్నీ కలుపుకొని పోయో మనస్తత్వం కలవాడని అన్నారు. మహేందర్ యాదవ్, తదితరులు నివాళులర్పించారు.

# సైబర్ నేరాలపై అవగాహన



**విశ్వంభర, హుజూర్‌నగర్ :** మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మఠంపల్లి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఆనంద్ నాయక్ సైబర్ నేరాలపైన, గంజాయి, డ్రగ్స్ మత్తుమందులపై, పోలీసు కళాభృందంతో ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏఎస్ఐ ఆనంద్ నాయక్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అధ్వర్యంలో సైబర్ నేరాలపై, గంజాయి డ్రగ్స్ మత్తు మందులు, గుట్కాపై పటిష్ఠంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో చదువుకునే విద్యార్థులు, యువతి యువకులు ఇంటర్నెట్ ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దని, బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డ్ వివరాలు, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలపవద్దన్నారు. ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దని. మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దు అని కోరారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. అలాగే వేధింపులపై 100 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నెంబర్లు, సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దన్నారు. వ్యక్తిగత ఫోటోలను డీపీ లుగా పెట్టుకోవద్దని చెప్పారు. మొబైల్ యాప్ లలో వచ్చేటువంటి అనవసరమైన బ్లూ లింకులను క్లిక్ చెయ్యొద్దు అని తెలిపారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దు అన్నారు. గంజాయి మత్తు మందులకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే తప్పకుండా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడపవద్దని, ట్రాఫిక్ రూల్స్ ను అతిక్రమించొద్దు అని అన్నారు. యువత లోన్ యాప్ లకు దూరంగా ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాలకు రక్షణగా బలమైన పాస్వర్డు పెట్టుకోవాలని అన్నారు. అనంతరం పోలీసు కళాబృందం వారు చక్కటి సాంస్కృతిక, పాటలతో గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ గోవిందు, కానిస్టేబుల్ రవీందర్, హెూంగార్డు శోభన్, కళాబృదం ఇంచార్జ్ యల్లయ్య, గోపి, గురులింగం, క్రిష్ణ, చారి, నాగర్జున గ్రామ ప్రజానీకం పాల్గొన్నారు.



## ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని కాపాడిన లేక్ పోలీసులు

**విశ్వంభర, కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎల్.ఎం.డీ. డ్యాంలో దూకి ఆత్మహత్యకు పాల్పడబోయిన అశోక్ నగర్ కు చెందిన మాదూరి రవీందర్ (51)ను లేక్ అవుట్ పోస్టు పోలీసులు కాపాడారు. సోమవారం అర్ధరాత్రి డాం కట్టపై గస్తీలో ఉన్న లేక్ అవుట్ పోస్టు పోలీసులు కానిస్టేబుల్ సారయ్య , లేక్ ఎస్సై అర్షం సురేష్ కు మాదూరి రవీందర్ డ్యాంపై అనుమానాస్పదంగా కనిపించాడు. కాపాడరని ఒక ప్రకటనలో తెలిపారు. డ్యాంలోకి దూకేందుకు ప్రయత్నించగా గస్తీలో ఉన్న లేక్ అవుట్ పోస్టు పోలీసులు కాపాడారు. అనంతరం ఆత్మహత్యకు పాల్పడుటకు కారణం తెలుసుకోగా కుటుంబ ఆర్థిక ఇబ్బందులున్నాయని తెలిపాదని అన్నారు. అతనికి కరీంనగర్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ జె సరిలాల్ ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించామని తెలిపారు.

## సీఎం చేతుల మీదుగా చెక్కు అందుకున్న మహిళా రైతు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ చెక్కును యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన మహిళ రైతు చెరుకు శోభ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా 1,50,000 రూపాయల చెక్కును అందుకున్నారు. ఈ సందర్భంగా చెరుకు శోభ మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులకు, శాసన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఏకకాలంలో రెండు లక్షల రూపాయాల రుణమాఫీ ప్రకటించి రైతును రాజును చేస్తున్న ఈ ప్రజా ప్రభుత్వానికి ఆత్మకూరు(ఎం) మండల రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.



## లయన్స్ క్లబ్ కుషాయిగూడ ఆధ్వర్యంలో

# అంధ విద్యార్థులకు చేయూత



**విశ్వంభర, ఏఎస్‌రావ్‌నగర్ :** ఏఎస్‌రావ్‌నగర్ డివిజన్‌కి చెందిన నవీన్, పూజిత నేత్ర విద్యాలయ జూనియర్ కళాశాలలో చదువుతున్నారు. వారిద్దరికీ కంటి చూపు లేని కారణంగా విద్యార్థులకు కుషాయిగూడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 20 వేల రూపాయల చెక్కును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఏఎస్‌రావ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారికి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ కుషాయిగూడ వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ మాజీ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి కుమార స్వామి, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రవి శంకర్ రాజు, కార్యదర్శి ఎంఎస్ పిల్లయి తదితరులు పాల్గొన్నారు.






విశ్వంభర V3 NEWS

# సినీ వినీలాకాశంలో హాస్యపు హరివిల్లు అల్లు

## జూలై 31...అల్లు రామలింగయ్య వర్ధంతి




**తెలుగు సినిమాకు దొరికిన అపురూపమైన కళాకారుడు అల్లు రామలింగయ్య. ప్రతిపాత్ర తనకే స్వంతమా అనే రీతితో నటించి నవ్వించిన సాటిలేని మేటి నటుడు ఆయన. నిజానికి హాస్యానికి ఆయన సిసలు చిరునామాగా మారారు. అయినా ఏ పాత్రలోకైనా పరకాయప్రవేశం చేసి మెప్పించారు. హాస్యాన్ని పండించారు. ఆకారంతో పనేమి? నవ్వించడమే నా అసలు పని అని నవ్వుకే నడకలు నేర్ప గలిగిన హాస్య నట దిగ్గజం అల్లు. రేలంగి తరువాత 'పద్మశ్రీ' అందుకున్న హాస్యనటుడుగా చరిత్ర సృష్టించారు. హోమియోపతి డాక్టర్‌గా పలు సేవాకార్యక్రమాలు అందించారు. తెలుగు సినీ పరిశ్రమలో నటుడిగా ఎంత బిజీగా వున్నా వైద్య వృత్తిని మాత్రం వదల్లేదు. వీలైనప్పుడు నటీనటులకు కూడా తన వైద్యాన్ని అందించారు. నిర్మాతగా మారి గీతా ఆర్ట్స్ బ్యానర్ స్థాపించి అనేక సూపర్‌హిట్ సినిమాలు అందించారు. ఆయన నాటి స్వతంత్ర పోరాటంలో భాగస్వామిగా, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు కూడా వెళ్లారు.**

అల్లు రామలింగయ్య (అక్టోబర్ 1, 1922 - జూలై 31, 2004) నటునిగా, వైద్యుడిగా, స్వాతంత్ర్య సమరయోధునిగా, లోతైన తత్వవేత్తగా, నిర్మాతగా, ఎందరికో మార్గదర్శకుడిగా, గురువుగా విభిన్న సేవలు అందించారు. ఆయన కుమారుడు అల్లు అరవింద్ సినీ నిర్మాతగా రాణిస్తున్నారు. అల్లుడు, మెగా స్టార్ చిరంజీవి సినీ పరిశ్రమలో తనదైన ముద్రవేశారు. మనవళ్లు చరణ్, అర్జున్, శిరీష్ లు సినీ పరిశ్రమలో రాణించడం విశేషం.

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో 1922 అక్టోబర్ 1న అల్లు రామలింగయ్య జన్మించారు. పాలకొల్లులో ఉన్న క్షీర రామలింగేశ్వర స్వామి గుర్తుగా తల్లిదండ్రులు రామలింగయ్య అని పేరు పెట్టుకున్నారు. అల్లు చదువులో పెద్దగా రాణించ లేదు. ఆకతాయిగా తిరుగుతూ అందరినీ అనుకరిస్తూ నవ్వించేవారు. ఇదే క్రమంతో నాటకాల్లో నటించాలనే ఉత్సాహం పెరిగింది. ఊళ్లోకి ఎవరు నాటకాల వాళ్ళు వచ్చినా వారి వెంటే తిరుగుతూ ఉండేవారు. వాళ్లతో స్నేహం చేయడం, ఏదైనా చిన్న వేషం ఇమ్మని అడగడం నిత్యకృత్యంగా చేసుకున్నారు.

ఓ సారి వారి ఊళ్లో 'భక్త ప్రహ్లాద' నాటకం చూస్తుండగా.. బృహస్పతి వేషం వేస్తున్న బాలుడు బాగా చేయడం లేదనిపించి...ఇంట్లోంచి బియ్యం దొంగతనం చేసి, వాటిని అమ్మి నాటక కాంట్రాక్టరుకు మూడు రూపాయలు ఎదురిచ్చి ఆ వేషం తనే వేసిన తపన ఉన్న కళాకారుడే అల్లు. నాటకానుభవం పెద్దగా లేకున్నా కొద్దిపాటి నటనావగాహనతో తన వేషం మెప్పించారు. అలా మొదలైంది అల్లు నట జీవితం.

అల్లు నాటకాల్లో నటిస్తూనే, తన సామాజిక బాధ్యతను గుర్తెరిగి గాంధీజీ పిలుపు నందుకుని క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు కెళ్లారు. జైలులో కూడా తోటివారిని పోగేసుకుని నాటకాలాడే వారు. మరోవైపు అంటరానితనంపై పోరు సలిపారు.

అల్లు నాటాకాలు చూసిన గరికపాటి రాజారావు చిత్రసీమలో తొలిసారిగా 1952లో పుట్టిల్లు చిత్రంలో కూడు-గుడ్డ శాస్త్రి తరహా పాత్రను అల్లుచే వేయించారు. ఆ తరువాత హెచ్.ఎం.రెడ్డి వద్దంటే డబ్బులో అవకాశం వచ్చింది.

పుట్టిల్లు చిత్రం నిర్మాణ కాలంలో తన భార్య, నలుగురు పిల్లలతో మద్రాసుకు మకాం మార్చారు. అల్లు తన కుటుంబాన్ని పోషించేందుకు చాలా కష్టాలు పడ్డారు. మరోవైపు హోమియో వైద్యం నేర్చుకున్న అల్లు ఏమాత్రం తీరిక దొరికినా ఉచిత వైద్యసేవ లందించేవారు. ప్రారంభంలో ఎన్నో అవాంతరాలు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో చిత్రసీమలో నిలదొక్కుకున్నారు. అల్లు హాస్యపు జల్లునేకాదు కామెడీ విలనిజాన్ని కూడా రక్తి కట్టించాడు.

రామలింగయ్యలో ఉన్న నటుడ్ని అద్భుతంగా వాడుకున్న దర్శకుల్లో విశ్వనాథ్ ఒకరు. మొదట్లో కామెడీ వేషాలే చేసినా...నెమ్మదిగా కామెడీ విలనీ కూడా చేయడం ప్రారంభించారు. ఓ జమానాలో విలన్ వెనకాల ఉండే ఓ తరహా గుంటనక్క లాంటి పాత్రలో అల్లు రామలింగయ్య ఎక్కువగా కనిపించేవారు. రామలింగయ్యలో చిన్నతనం నుంచి ఓ మిమిక్రీ కళాకారుడు ఉన్నారు. ఈ కళను ఆయన చాలా పదిలంగా కాపాడుకుంటూనే వచ్చారు.

అల్లు రామలింగయ్య నిర్మాతగా గీతా ఆర్ట్స్ బ్యానర్ నెలకొల్పి బంట్రోతు భార్య, దేవుడే దిగివస్తే, బంగారు పతకం చిత్రాలను నిర్మించారు. చాలాకాలం తర్వాత అల్లు 90 దశకంలో డబ్బు భలే జబ్బు చిత్రం తీసారు.

ముత్యాల ముగ్గు సినిమా చిత్రీకరణకు ముందు కుమారుడు ఆకస్మికంగా మరణించినా బాధను మనసులో అణుచుకుని షూటింగ్‌లో పాల్గొన్నారు అల్లు. సుమారు 1030 సినిమాల్లో కామెడీ విలనీ, క్యారెక్టర్ పాత్రలు చేశారు. 1116 చిత్రాల్లో నటించాలనే కోరిక అతనుకు తీరలేదు. అల్లు అభినయించిన చాలా పాటలకు బాలు గళం సరిగా సరి పోయింది. మనుషులంతా ఒక్కటే చిత్రంలో ముత్యాలూ వస్తావా ...అడిగిందీ ఇస్తావా అనే పాట అప్పట్లో సూపర్ హిట్.

యాభై ఏళ్ల పాటు సినిమాల్లో నవ్వుతూ నవ్విస్తూ యావత్ తెలుగు ప్రజానీకాన్ని అలరించిన అల్లును వరించిన సన్మానాలు, గౌరవాలు, అవార్డులు అసంఖ్యాకమైనవి. భారత ప్రభుత్వం 1990లో ' పద్మశ్రీ ' అవార్డుతో గౌరవించింది. రేలంగి తరువాత ' పద్మశ్రీ' అందుకున్న హాస్యనటుడు అల్లునే. 2001 వ సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యున్నత ' రఘుపతి వెంకయ్య ' అవార్డు ఇచ్చింది. పాలకొల్లులో ఆయన విగ్రహం నెలకొల్పారు. 2013లో భారత చలనచిత్ర పరిశ్రమ వందేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంలో విడుదలయిన 50 తపాలా బిళ్లలలో ఒకటి అల్లు రామలింగయ్య జ్ఞాపకార్థం విడుదలయింది. పాలకొల్లులో ఆయన విగ్రహం నెలకొల్పారు.

అల్లు రామలింగయ్య 2004 జూలై 31 వ తేదీన తన 82 వ ఏట కన్ను మూశారు. మరణించే నాటికి తెలుగు చిత్రసీమలో అల్లు రామలింగయ్యది ప్రత్యేక స్థానం. రేలంగి, రమణారెడ్డి, కుటుంబ రావు, బాలకృష్ణ వంటివారి కాలంతో మొదలు ఈతరం హాస్యనటుల వరకూ కొనసాగిన ఏకైక హాస్యనటుడు అల్లునే. ఆమ్మ్యామ్యా... అప్పుం అప్పుం లాంటి ఊతపదాలు ఆయన సృష్టించినవే. అల్లు భౌతికంగా లేకపోయినా హాస్య రస ప్రధాన పాత్ర ధారిగా ప్రజల మనస్సుల్లో చిరంజీవిగా చిరస్థాయిగా నిలిచి పోయారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# అలనాటి మేటి గాయకుడు రఫీ

**నేడు ఆయన వర్ధంతి**



హిందీ సినిమా రంగం 1950 నుంచి 1970 కాలం మహమ్మద్ రఫీ యుగం అంటే అతిశయోక్తి గాదు. ఆయన ఉత్తర భారత ప్రముఖ నేపథ్య గాయకుడు. హిందీ సినీ చిత్ర సీమలో ఒకనాడు మకుటం లేని మహారాజుగా వెలిగాడు. కేవలం రఫీ పాటలతో వందల కొద్దీ చిత్రాలు విజయం పొందాయనేది నూటికి నూరుపాళ్లు నిజం.

తన గాన మాధుర్యంతో ప్రేక్షకులను అలరించిన మహ్మద్ రఫీ1924 డిసెంబర్ 24న పంజాబ్ లోని అమృత్‌సర్‌లో జన్మించాడు. బాల్యంలో తమ గ్రామానికి వచ్చే ఫకీర్ల గానాన్ని రఫీ అనుకరించే వాడు. అలా చిన్నప్పుడే సంగీతంతో మక్కువ ఏర్పడింది. ఆ క్రమంలోనే ఉస్తాద్ బడే గులామ్ అలీ ఖాన్ వద్ద రఫీ సంగీత శిక్షణలో రాటు దేలాడు. అలా సినిమాల్లో పాటలు పాడడానికి 1944లో బొంబాయి వెళ్లాడు.

'గావ్ కీ గోరి' అనే హిందీ చిత్రంలో జి.ఎం.దురానీ తో కలిసి రఫీకి మొదటిసారి పాడే అవకాశం వచ్చింది. రఫీ పాడిన తొలి హిందీ గీతమిది. ఆ తర్వాత 1948లో గాంధీజీ హత్య జరిగినపుడు రఫీ 'సునో సునో ఏ దునియావాలో బాపూజీకి అమర్ కహానీ' పాటతో పాపులర్ అయ్యాడు. ఈ పాటకు భారత ప్రధాని నెహ్రూ చేతుల మీదుగా సిల్వర్ మెడల్ అందుకున్నాడు.

హిందీ సినిమా గాన జగత్తులో 1950 నుండి 1970 కాలం నిజంగా మహమ్మద్ రఫీ యుగం. రఫీ హిందీ, ఉర్దూ, మరాఠీ, తెలుగు భాషలలో పాటలు పాడాడు. 17 భాషలలో తన గానంతో అందరినీ అబ్బుర పరచాడు. రఫీ, లతా మంగేష్కర్ ల గాయక జోడీ, హిందీ నేపథ్య గాన చరిత్రలో కొత్త ఒరవడిని, రికార్డును సృష్టించింది. మహ్మద్ రఫీని వరించిన అవార్డులకు లెక్కేలేదు. కేంద్ర ప్రభుత్వంచే పద్మశ్రీ పురస్కారం, జాతీయ స్థాయిలో ఉత్తమ గాయకుడిగా అవార్డుతో పాటు పలు ఫిల్మ్ ఫేర్ అవార్డులు ఆయన్ని వరించాయి. హిందీతో పాటు 17 భారతీయ భాషల్లో 20వేలకు పైగా పాటలు పాడాడు. తొలితరం భారతీయ సినీ సంగీత సాగర ప్రయాణానికి దిక్సూచి లాంటి వాడు రఫీ. పృథ్వీరాజ్ కపూర్, రాజ్ కపూర్, రిషీ కపూర్ వంటి మూడు తరాల బాలీవుడ్ నటులకు స్వరాలు అందించిన ఘనత రఫీ సొంతం. తెలుగు విషయానికొస్తే...తండ్రి ఎన్టీఆర్, కుమారుడు బాలకృష్ణకు ప్లేబ్యాక్ అందించారు రఫీ.

నౌషాద్ కోసం రఫీ మొత్తం 149 పాటలు, బర్మన్‌తో కలిసి 37 చిత్రాలలో పని చేశాడు, శంకర్ - జైకిషన్ కోసం రఫీ మొత్తం 341 సంఖ్యలను (216 సోలో) పాడారు. కల్యాంజీ ఆనంద్జీ రఫీ స్వరంలో సుమారు 170 పాటలు కంపోజ్ చేశారు. రవితో , మదన్ మోహన్‌తో , ఓ.పీ.నయ్యర్‌తో, లక్ష్మీకాంత్ - ప్యారేలాల్‌తో, రోషన్, జైదేవ్, ఖయ్యామ్, రాజేష్ రోషన్, రవీంద్ర జైన్, బాపి లాహిరి, సపన్ జగ్మోహన్ వంటి సంగీత దర్శకులందరికీ తరచూ పాడారు. ఉషా ఖన్నా , సోనిక్ ఒమి , చిత్రగుప్తా , ఎస్ఎన్ త్రిపాఠి , ఎన్. దత్తా , ఆర్.డి బర్మన్ లాంటి సంగీత దర్శకులతో పని చేశాడు.

అనేక ప్రైవేట్ ఆల్బమ్‌లను వివిధ శైలులు మరియు భాషలలో రికార్డ్ చేశాడు. గిన్నీస్ రికార్డు ప్రకారం భారతీయ భాషలలో 28,000 పాటలను రికార్డ్ చేసినట్లు పేర్కొన్నారు. రఫీ రెండు సినిమాల్లో నటించాడు. లైలా మజ్ను (1945) చిత్రంలో "తేరా జల్వా జిస్ నే దేఖాష , జుగ్ను (1947) చిత్రంలో "వో అప్నీ యాద్ దిలాన్ కో" పాటల కోసం తెరపై కనిపించాడు.

1948 లోస్వతంత్ర భారత మొదటి సాంవత్సరిక ఉత్సవాలలో రజత పతాకాన్ని జవహర్ లాల్ నెహ్రూ చేతుల ద్వారా స్వీకరించారు.. 1967 లో భారత ప్రభుత్వంచే పద్మశ్రీ బిరుదు ప్రదానం చేసింది. 2001లో హీరో హోండా, స్టార్ డస్ట్ మేగజైన్ లద్వారా "బెస్ట్ సింగర్ ఆఫ్ ద మిలీనియం గౌరవ ప్రదానం, 2013లో సి ఎన్ ఎన్.. ఐ బి ఎన్ పోల్ లో గ్రేటెస్ట్ వాయిస్ ఇన్ హిందీ సినిమాగా ఎన్నికయ్యాడు.

"చౌధవీఁ కా చాంద్ హో" , "తేరి ప్యారీ ప్యారీ సూరత్ కో", "చాహూంగా మై తుఝే సాంఝ్ సవేరే", "బహారో ఫూల్ బర్సావో", "మై గావూ తుమ్ సోజావో", "ఖిలోనా జాన్ కర్", "క్యా హువా తేరా వాదా", ఇలా ఒక్కటేమిటి, రఫీ పాడిన ఎన్నో పాటలు చిరస్థాయిగా నిలిచిపోయే జ్ఞాపకాలుగా మిగిలి పోయాయి.

తెలుగులో ఆయన పాడిన ప్రతి పాట ఆణిముత్యమే. 'భలే తమ్ముడు' చిత్రంలోని "ఎంతవారు కానీ వేదాంతులైనా కానీ", ఎన్టీఆర్ 'ఆరాధన'లో "నా మది నిన్ను పిలిచింది గానమై".. 'అక్బర్ సలీం అనార్కలి'లో ఆయన పాడిన "సిపాయి" పాట నేటికీ తెలుగు ప్రేక్షకుల్లో మనసుల్లో అలాగే నిలిచి ఉంది. 1980 జూలై 31న శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. ఆయన ఈ లోకాన్ని వదిలి వెళ్లి దాదాపు 40 ఏళ్లు దాటినా ఆయన స్వరం ప్రతిగుండెలో ప్రతిధ్వనిస్తూనే ఉంది. అందుకే భారతీయ సినీ సంగీత ప్రపంచంలో రఫీ అమర గాయకుడిగా నిలిచి పోయాడు.

# నేటి తరానికి స్ఫూర్తి పాఠం-దాశరథి యాత్రాస్మృతి

సామాజిక, సాహిత్య, కళా, వైజ్ఞానికాది రంగాలలో లబ్ధ ప్రతిష్ఠులైన వ్యక్తులు తమ జీవిత అనుభవాలను గురించి రాసుకునే రచనలు ఆత్మకథలు లేదా స్వీయ చరిత్రలు. ఇవి ఆయా వ్యక్తులకు సంబంధించినవే అయినా వారు జీవించిన కాలం నాటి సమాజాన్ని, సాంస్కృతిక జీవనాన్ని, నాటి సమకాలీన పరిస్థితులను ప్రతిబింబిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే వారు జీవించిన కాలాన్ని చరిత్రలో రికార్డు చేయడానికి ఎంతో ఉపయుక్తమవుతాయి. అటువంటి మహత్తర గ్రంథమే దాశరథి కృష్ణమాచార్య స్వీయ చరిత్ర 'యాత్రాస్మృతి'.


సాధారణంగా ఆత్మ కథలు తమ కుటుంబ నేపథ్యం, జననం విద్యాభ్యాసం మొదలు జీవిత చరమాంకంలోని అనుభవాల వరకు ఒక క్రమ పద్ధతిలో రాయబడిన రచనలుగా కనిపిస్తాయి కానీ దాశరథి అట్లా కాకుండా తమ జీవిత అనుభవాలను, ప్రధానంగా ఆనాటి కవులతో కలిసి చేసిన జీవిత ప్రయాణాన్ని వివిధ వ్యాసాలుగా ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికకు రాసిన రచన ఈ యాత్రా స్మృతి అని తెలుస్తున్నది. ఈ గ్రంథంలో మొత్తం 60 వ్యాసాలున్నాయి.

వాడ్రేవు చిన్న వీరభద్రుడు అభిప్రాయపడ్డట్లు దాశరథి లో సమర శంఖారావంతో పాటు కవి ప్రణయ వివశత్వము సున్నితమైన హాస్యము గమనించవచ్చు. ఉదాహరణకు తన వయస్సు యాభై ఐదు అని చెప్పుకునే క్రమంలో 'యాభై ఐదులో రెండు ఐదులు ఉన్నాయి కదా! ఐదు తో ఐదు ప్లస్ చేస్తే పది (బాల్యం ) ఐదు తో ఐదు ఇంటూ చేస్తే పాతిక (యవ్వనం ). ఐదు పక్కన ఐదు రాస్తే యాభై ఐదు (వార్ధక్య ద్వారం) అంటూ చమత్కరిస్తారు. ఇదే సమయంలో ఐదు లో ఉన్న తాత్వికత ఎరుక పరుస్తారు. మన్ను, మిన్ను, నీరు, గాలి, వెలుతురు - ఈ పంచభూతాల సమ్మేళనమే జననం. పంచభూతాలు చిన్నాభిన్నం కావడం మరణం అంటూ తాత్విక ధోరణిలో తెలియజేశారు.

దాశరథి అభిప్రాయ ప్రకటనలోనూ జీవితాచరణలోనూ నిర్భీతిని ప్రదర్శించారు. తన చిన్ననాటి అనుభవాలను గురించి చెబుతూ నా బాల్యంలో ఇంటా బయట తెలుగు మీద దండయాత్రలు జరిగాయి అని కుండబద్దలు కొట్టారు. ఇంట్లో నాన్నగారి సంస్కృత భాషాధిక్యము, మదరసా బడిలో రోజు చేయవలసిన ఉర్దూ ప్రార్థన ఈ రెండింటిని కూడా ఛాందసత్వంగానేఆయన ప్రకటించారు. దాశరథి విద్యార్థిగా ఉన్నకాలంలో హైదరాబాద్ వెళ్లారంటే సురవరం ప్రతాపరెడ్డి గారిని, మాడపాటి హనుమంతరావు గారిని అమ్జద్ హైదరాబాది గారిని కలిసి ఆశీర్వాదం పొందడం ఆనాటి విద్యార్థుల ఆచారంగా ఉండేది అని ఆనాటి ఉత్తమ విలువలను నేటితరం అందిపుచ్చుకోవలసిన అవసరాన్ని తెలియజేశారు.

1944లో ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రథమ మహాసభలు ఓరుగల్లులో జరిగినప్పుడు రజాకార్లు ఆ సభల పందిర్లను తగలబెట్టడం. ఆ మంటల్లోనే కవి సమ్మేళనం జరపడం. రజాకార్లు విసురుతున్న రాళ్లను పువ్వులుగా భావించాలని ప్రతాపరెడ్డి గారు పిలుపునివ్వడం, వంటి అనుభవాలను చదువుతున్నప్పుడు పాఠకుల రోమాలు నిక్కబొడుస్తాయి. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటానికి ప్రజలను సిద్ధం చేయడంలో భాగంగా గూడూరు వెళ్లిన దాశరథిని అరెస్టు చేసే క్రమంలో జరిగిన నాటకీయ పరిణామాలు పాఠకులలో ఆసక్తిని కలిగిస్తాయి. ఏడవ నిజాం రాజు ఉస్మాన్ అలీ ఖాన్ విచిత్ర ప్రవర్తన, గోలకొండ కవుల సంచిక ఆవిర్భావ నేపథ్యం, తెలంగాణమును జాగృతపరచడంలో గోలకొండ పత్రిక నిర్వర్తించిన పాత్ర తనదైన శైలిలో వివరించారు.

ఆనాటి కాలంలో జరిగే ముషాయిరాల ( ఉర్దూ కవి సమ్మేళనాలు ) గురించి చదివితే ఆశ్చర్యం కలగక మానదు. ఆ రోజుల్లోనే ముషాయిరాలు వినడానికి వచ్చే శ్రోతలు ఐదు రూపాయల నుండి నూరు రూపాయల వరకు టికెట్ కొనుక్కొని వచ్చేవారట. నేటి కవి సమ్మేళనాలు ఆ స్థితికి ఎప్పుడు చేరుతాయో కదా! ఒక ముషాయిరా అనుభవాన్ని దాశరథి చెపుతూ తనను




ముషాయిరా కు తీసుకువెళ్లిన రిక్షావాడు కూడా కవే. అతను వినిపించిన ముషాయిరా శ్రోతలను ఎంతో ఆకట్టుకుంది అంటూ అభినందించారు. ముఖి ముఖి సరస్వతి రిక్షావాడు కవి కాకూడదా అంటూ దాశరథి అభినందించడం వారి సమున్నత వ్యక్తిత్వానికి నిదర్శనం. గాలిబ్ గీతాలు ఆవిష్కరణ సభ అనుభవాలను, చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి మదరాసు రాష్ట్ర ప్రథమ ఆస్థాన కవిగా పదవి స్వీకార సభ అనుభవాలను చక్కగా వివరించారు.

ఏడవ ఆంధ్ర సారస్వత పరిషత్ మహాసభలకు సుమారు పాతికవేల మంది కవులు హాజరైనారట. హైదరాబాద్ నుండి అలంపూర్ కు వెయ్యి మంది సాహితీవేత్తలతో ప్రత్యేక రైలు వేశారు అంటే ఆనాటి సాహిత్య సభలు ఎంత వైభవోపేతంగా జరిగేవో దాశరథి మాటల ద్వారా తెలుస్తున్నది. ఆ సభల్లో కాళోజీ నా గొడవ గ్రంథావిష్కరణ విశేషాలను, ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆనాటి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి ఉపన్యాసాన్ని కళ్లకు కట్టినట్లు వివరించారు.

తుంగభద్ర నదికి ఆ పేరు ఎలా వచ్చిందో ఆసక్తికరమైన కథను వినిపించారు. తెలుగు ప్రయాణంలో రైలులో కలిసిన అందమైన అమ్మాయిని చూస్తూ తాను తుంగభద్ర నాటకం రాస్తే కథానాయకుడు తుంగడు తానైనట్లు, ఎదురుగా కూర్చున్న అమ్మాయి భద్ర పాత్రధారి అయినట్లు ఊహా లోకంలో తేలిపోతాడు. ఇది దాశరథి ప్రణయ మధురిమకు నిదర్శనం.


ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు భోజన ప్రియులు. ఒకసారి వరంగల్ వచ్చినప్పుడు అజం జాహి మిల్లు వారి గెస్ట్ హౌస్ లో ఒక జల్లి గంప నిండా ఇడ్లీలు తెచ్చారట. సుమారు రెండు వందలున్న ఇడ్లీలలో సగం అంటే వంద ఇడ్లీలు ఆంధ్రకేసరి గారు భోంచేసారట. ఆ తరువాత ఒక మర చెంబెడు కాఫీ తాగారట. నమ్మశక్యంగా లేదు కదా! ఇలాంటి విచిత్రమైన అనుభవాలు కూడా ఈ గ్రంథంలో కనిపిస్తాయి. తెలంగాణలో అణా గ్రంథమాల గ్రంథ ప్రచురణ రంగంలో తెచ్చిన విప్లవాన్ని సోదాహరణంగా వివరించారు.

నాజీ జైలును మించిన నైజాం జైళ్ల దుస్థితిని పాఠకుల కళ్ళ ముందు ఉంచారు దాశరథి. ఉడికి ఉడకని జొన్న రొట్టెలు, చిప్పనిండా పప్పు చారు, రొట్టెల్లో సిమెంటు సున్నం కలిపి వండి పెట్టే వారట. వారానికి ఒకసారి పెట్టే వరి అన్నంలో సగం వడ్ల గింజలే. ఏడు వందల మంది రాజకీయ ఖైదీలకు ఒకటే నల్లా. ఇట్లా చెప్పుకుంటూ వెళ్తే ఆనాటి జైళ్లు నరకానికి ప్రతిరూపాలుగా కనిపిస్తాయి. డిచ్ పల్లి ప్రాంతానికి చెందిన రజాకార్లు నిజామాబాద్ జైల్లోకి అక్రమంగా ప్రవేశించి దాశరథిని అతని సహచరులను ఎముకలు విరిగేలా కొట్టిన వైనం, ఆనాటి సంఘటనలు వివరించిన తీరుఒళ్ళు జలదరింప చేస్తుంది.జైల్లో ఖైదీల సత్యాగ్రహం నాటి ఉద్యమ స్ఫూర్తిని చాటుతున్నది. నిజామాబాద్ జైలు నుంచి ఖైదీలు తప్పించుకున్న సంఘటన సినిమా కథను మరిపించేలా ఉంద గాంధీజీ హత్య, తదనంతర సంఘటనలు, తెలంగాణలో కాశీం రజ్వి దురాగతాలు, నాటి చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తాయి. హైదరాబాద్ చంచల్ గూడ సెంట్రల్ జైల్లో రాజకీయ చర్చలు ఆనాటి నాయకుల స్వాతంత్ర్య కాంక్షలు చాటిచెప్పాయి. రంగనాయకులు అనే కార్యకర్త నల్లగొండ సూర్యాపేట జిల్లాలో జరుగుతున్న దారుణాలను వివరించిన తీరు నాటి పాలకుల రాక్షసత్వానికి పరాకాష్ట. స్త్రీలపై జరిగిన దారుణాలకు సహించలేక తిరగబడ్డ వైనం ప్రజల్లో రగులుతున్న అసంతృప్తికి నిదర్శనం.

ఉద్యమం పరాకాష్టకు చేరిన దశలో నిజాం నవాబు హైదరాబాదు రాజ్యాన్ని స్వతంత్ర భారతంలో విలీనం చేసే ఘట్టాలు, హైదరాబాద్ రాజ్యంపై భారత సైనిక దళాల దాడి మొదలైన సన్నివేశాలు నాటి చరిత్రకు ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలుస్తాయి. ఆపరేషన్ పోలో అనంతర సంస్కరణలు, జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ రాకడ తదితర సంఘటనలు నాడీ సామాజిక సంక్షుభిత స్థితిని ప్రతిఫలిస్తాయి. సైనిక పాలన ముగిసిన తరువాత దక్కన్ రేడియోలో నిజాం ప్రసంగం, దాశరథి ప్రసంగం, నిజాం నవాబు మీద బాంబు దాడి తదితర సంఘటనలు నాటి ఉద్యమకారుల మనోస్థితిని తెలియజేస్తాయి. ఆనాటి రచయితలు సంస్థల వివరాలు దాశరథి గారు ప్రత్యేక వ్యాసంగా చేర్చారు. తెలంగాణ రచయితల సంఘం ఆవిర్భావం, మంజీరా పత్రిక ప్రారంభం సంబంధించిన సమాచారం ఈ గ్రంథంలో ఉంది. ఆనాటి సమరకావ్యాలైనఆరుద్ర త్వమేవాహం, వట్టి కోట ఆల్వార్ స్వామి ప్రజల మనిషి, దాశరథి రంగాచార్యులు చిల్లర దేవుళ్ళు, దాశరథి కృష్ణమాచార్య మహాంధ్రోదయం మొదలైన గ్రంథాల ఔన్నత్యం ఈ వ్యాసాల్లో కనిపిస్తుంది . ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, వానమామలై వరదాచార్యులు మొదలైన కవుల ఘనత ఈ వ్యాసాల్లో కనిపిస్తున్నది.

గ్రంథం చివరలో దాశరథి మరణించిన మరుసటి రోజు గాంధీ క్షేత్రం పత్రికలో వచ్చిన సంపాదకీయం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్థాన కవిగా నియమితులైన సందర్భంగా దాశరథి కృష్ణమాచార్యతో మండలి బుద్ధ ప్రసాద్ చేసిన ఇంటర్వ్యూ చేర్చడంతో ఈ గ్రంథానికి మరింత పరిపూర్ణత చేకూరింది.

'నేను గన్ను చేపట్టాలనుకుంటాను కానీ పెన్నుతో కలలుగంటుంటాను ' అని ప్రకటించుకున్న దాశరథి జీవితాంతం తిమిరంతో సమరమే చేశారు. ఆయన ఆలోచనాలోచనలు నేటి తరానికి స్ఫూర్తి పాఠాలు. దాశరథి జీవన యాత్ర ముగిసిపోలేదు. అది ఎప్పటికీ తెలంగాణ ప్రజల మనసుల్లో సజీవమై భావితరాల వైపు పయనిస్తూనే ఉంటుంది.



-సాగర్ల సత్తయ్య
7989117415

### పాలస్తీనాకు సంఘీభావంగా
## రౌండ్ టేబుల్ సమావేశం



**విశ్వంభర, మహబూబ్‌నగర్ :** మహబూబ్ నగర్ టీ.ఎఫ్.టీ.యూ కార్యాలయంలో పాలస్తీనాకు సంఘీభావంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో టీ.ఎఫ్.టీ.యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం డి. ఖలీల్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం. రాఘవచారి, సామాజిక వేత్త హనీఫ్ అహమ్మద్, ఉర్దూ కవి బాబర్ షేక్, సలీం ముఖ్య వక్తలుగా పాల్గొని మాట్లాడీరు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇజ్రాయిల్ దేశం గతంలో ఉనికిలో లేదని పాలస్తీనా పౌరులు దయదల్చి యూదులకు నివాసానికి అవకాశం ఇస్తే పాలస్తీనను ఆక్రమించుకుని మూలవాసులైన పాలస్తీన పౌరులపై అమానుషమైన దాడులకు పూనుకుంటున్నారని తెలిపారు. ఇజ్రాయిల్ చేస్తున్న అమానవీయ దాడిని మానవజాతి గర్వించే విధంగా పాలస్తీనా వాసులు ఎదుర్కొంటున్నారని, ఎనలేని త్యాగాలు చేస్తున్నారని వారు తెలిపారు. వారి వీరోచిత పోరాటం శ్లాఘనీయమన్నారు. తల్లుల ముందు పిల్లలు, పిల్లల ముందు తల్లులు మరణిస్తున్నా వెనకంజ వేయడం లేదన్నారు. వారి పోరాటానికి మనుషులుగా జీవిస్తున్న ప్రతి ఒక్కరు సంఘీభావం తెలపాల్సిన అవసరం ఉందన్నారు. ఇది పోరాట స్ఫూర్తితో సామ్రాజ్య వాదానికి మల్టీనేషన్ కంపెనీల దురాగతానికి, మతోన్మాదానికి, ఫాసిజానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. భారత ప్రధానులు నెహ్రూ మొదలు కొని అటల్ బిహారీ వాజ్పేయి వరకు పాలస్తీల కు సంఘీభావంగా నిలబడ్డారని వారు గుర్తు చేశారు. ప్రస్తుతం దేశాన్ని పరిపాలిస్తున్న సంఘ పరివార్ ప్రేరేపిత ప్రభుత్వం పాలస్తీనా పోరాటాన్ని మత కోనంతో చూడడం విచారకరమన్నారు. ఈ పరిస్థితుల్లో పౌర సమాజమే మతాలకతీతంగా పాలస్తీనకు అండగా నిలబడటం వల్ల పాలకుల్లో మార్పు తీసుకొని రావాలని కోరారు. ఆయుధాల వ్యాపారంతో కోట్లకు పరిగెత్తుతున్న ఇజ్రాయిల్, అమెరికా లాంటి సామ్రాజ్యవాదులను కట్టడి చేయడం కొరకు వారు అమ్మే ఆయుధాలను కొనకుండా నిషేధించాలని తెలిపారు. సాధారణ ప్రజానీకం కూడా ఇజ్రాయిల్ ఉత్పత్తులను కొనరాదని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీ.ఎఫ్.టీ.యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పి. విజయకుమార్, టీపీఎఫ్ నాయకులు బుచ్చారెడ్డి, చైతన్య మహిళా సంఘం నాయకురాలు శ్రీదేవి, మైనార్టీ నాయకులు మౌలానా ఇస్మాయిల్, ఇమాన్ కమిటీ నాయకుడు సలీం, మెహబూబలి, ఫౌండేషన్ అధ్యక్షులు రహీమ్, మిర్జా సోయబ్ అలి, స్వీపర్ల సంఘం అధ్యక్షులు గట్టన్న, జలాల్ పాషా, అబ్దుల్ అజీజ్, బోయ కృష్ణ, సికందర్, ఎన్నారై అజీజ్, అబ్బాస్, మహమ్మద్ రఫీ, గులాం మొహమ్మద్, మున్తాజ్ ఇమామ్ పాల్గొన్నారు.

### సెప్టెంబర్ 22న కరీంనగర్
## మారథాన్ రెండవ ఎడిషన్




**విశ్వంభర, కరీంనగర్ :** కరీంనగర్ రన్నర్స్ అండ్ సైక్లిస్ట్ అసోసియేషన్, జిల్లా యంత్రాంగం సహకారంతో కరీంనగర్ మారథాన్ రెండవ ఎడిషన్ ను సెప్టెంబర్ 22న అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్నారు. ఈవెంట్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, డీ.ఆర్.ఓ పవన్ కుమార్, డీ.వై.ఎస్.ఓ శ్రీకాంత్ రెడ్డి, కరీంనగర్ రన్నర్స్, సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కే.ఆర్.సీ.ఏ ప్రెసిడెంట్ మహేష్ పసుల, సభ్యులు డీ.డీ మార్కెటింగ్ పద్మావతి, రవీందర్, అఖిల్ కూడా ప్రారంభ కార్యక్రమానికి హాజరయ్యారు. కే.ఆర్.సీ.ఏ ప్రెసిడెంట్ మహేష్ పసుల మాట్లాడుతూ గత సంవత్సరం మొదటి ఎడిషన్ గ్రాండ్ సక్సెస్ అయిన తర్వాత, మారథాన్ రెండవ ఎడిషన్‌ను ప్రకటించడం చాలా ఉత్సాహంగా ఉందని అన్నారు. రన్‌లో 4 కేటగిరీలు 3కే, 5కే, 10కే, 21కే ఉంటాయి. కింది లింక్ https://knr24.iq301.com/ని ఉపయోగించి మాత్రమే నమోదు ద్వారా పాల్గొనడం అనుమతించ బడుతుందని తెలిపారు. పాల్గొనేవారు టీ-షర్టు, మెడల్, డిజిటల్ సర్టిఫికేట్ పొందుతారు. అల్పాహారం, హైడ్రేషన్ మద్దతు అందించబడుతుంది. అదనపు సమాచారం కోసం 72592 65758, 81436 58008 లేదా 96764 99949 సంప్రదించాలని తెలియజేశారు.

## పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల విరాళం

**విశ్వంభర, మెట్పల్లి :** సరస్వతి విద్యా మందిర్ పాఠశాలకు 2005-06 పదవ తరగతి చదివిన విద్యార్థినీ విద్యార్థులు పాఠశాల అభివృద్ధి కొరకు వివిధ బోధన ఉపకనాలకై 51,000 వేలరూపాయలను పాఠశాల అధ్యక్షులు గుంటుక గౌతమ్ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గౌరవ అధ్యక్షులు పోహార్ తుకారాం, జిల్లా సహా కార్యదర్శి గుంటుక గంగాధర్, పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు రవితేజ, పూర్వ విద్యార్థులు ముక్క నరేష్, పెండెంవినోద్, మధుకర్, నవీన్, కుర్ర రాజేందర్, శ్రీకాంత్ గుజ్జేటి, గంగుల రాజ్ కుమార్, గంగ ప్రసాద్, గుంటుక నిరోషా, అరిగెల శ్రీలత, కోటగిరి సౌమ్య, తాటికొండ అనూష, ప్రత్యూష, నిరోష, తదితర 41 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు రామగిరి లావణ్య, ఆచార్యులు పూజ, రచన, శ్రీజ, మానస, పాల్గొన్నారు.



## స్థానిక ఎన్నికల్లో కుటుంబ సభ్యుల ఓట్లన్ని ఒకే వార్డులో ఉండాలి



**విశ్వంభర చివ్వేంల :** ఒకే కుటుంబంలోని ఓట్లన్ని ఇంటి నెంబర్ ఆధారంగా ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకోని, ఓట్లర జాబితా సవరణ చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్ లతకు తెలంగాణ యువజన సంఘము ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు మాట్లాడుతూ గత స్థానిక ఎన్నికల సందర్భంగా ఒకే కుటుంబంలోని ఓటర్ల ఓట్లు, ఒకే వార్డ్ లలో ఉండకుండా వేరొక వార్డులకు జంప్ అయిన ఓటర్ లిస్ట్ విడుదల చేసి ఎన్నికలు నిర్వహించారని అన్నారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీలో ఒక కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే వార్డ్ లో వచ్చేల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ ఎన్నికల సందర్భంగా వివిధ వార్డ్ లలో పోటీ చేసే అభ్యర్థుల ప్రచారం సులభం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యువజన సంఘం నాయకులు ఏనిగ సంతోష్ రెడ్డి, దరావత్ వెంకటేష్ నాయక్, భాషిపంగు సునిల్, చెరుకు నగేష్, మధుసూదన్, స్టాలిన్ పాల్గొన్నారు.

### అసెంబ్లీ ముట్టడికి వెళ్ళకుండా
## కార్మికుల ముందస్తు అరెస్టు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** ఉద్యోగులు అందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస జీతం 26,000లు చేయాలని ప్రభుత్వా న్ని డిమాండ్ చేస్తూ, కార్మికుల సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. హైదరాబాదు అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో పనిచేస్తున్న వివిధ రంగాలలోని కార్మికులను ఆత్మకూరు(ఎం) పోలీసులు ముందస్తుగా అక్రమంగా అరెస్టు చేవారు. అరెస్టు అయిన వారిలో సీపీఎం జిల్లా నాయకులు రచ్చ గోవర్ధన్, ఎంఈఓ ఆఫీసు కంప్యూటర్ ఆపరేటర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



## ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి

### ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే

**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మంగళవారం డయల్ 100, 112 కాల్స్‌పై స్పందన, జిల్లా అధికారులు, సిబ్బంది పనితీరుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా నిర్వహించారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బందికి ఈ సందర్భంగా సూచనలు చేశారు. ఫోన్ కాల్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోకార్ నిరంతరం గస్తీ నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని, స్కూల్స్, కాలేజీలు, బస్టాండ్, రద్దీ ప్రాంతాల్లో విజుబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ నిర్వహించాలని చెప్పారు. సమస్యాత్మక, లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తే, నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను ఎస్‌హెచ్‌ఓలు తప్పనిసరిగా సందర్శించాలని ఎస్పీ ఆదేశించారు. కాల్స్ వచ్చిన తర్వాత బాధితులను చేరుకునే సమయం తగ్గేలా సమర్థవంతంగా పనిచేయాలని, తొందరగా సంఘటనా స్థలాన్ని చేరుకుంటే పోలీసులపై ప్రజల్లో మరింత నమ్మకం ఏర్పడుతుందని ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు.

## రెండవ విడత రుణమాఫీ సంబరాలు



**విశ్వంభర, షాద్ నగర్ :** ఫరూక్ నగర్ మండల పరిధి వెలిజర్ల గ్రామమలో రైతు వేదిక వద్ద మంగళవారం జరిగిన రైతుల రెండవ విడత రుణమాఫీ సంబరాలలో ఫరూక్ నగర్ మండల మాజీ జడ్పీటీసీ సభ్యులు వెంకట్ రాంరెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏక కాలంలో రుణమాఫీ చేస్తున్నందుకు రైతుల తరుపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రైతులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి రుణమఫీ కార్యక్రమాన్ని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ప్రసంగాన్ని విన్నారు. అలాగే రైతులు ఆయిల్ పామ్ పంటలను సాగు చేసి అధిక దిగుబడి పొందాలి అని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు వాడ్యాల నర్సింహ్మా రెడ్డి, వెలిజర్ల కాంగ్రెస్ పార్టీ నేతలు గణేష్ గౌడ్, జాంగారి రవి, ఇరమోని రాజు, మధుసూదన్ రెడ్డి, మంద రాజు, కొండన్న గూడా గ్రామ నేతలు మాజీ సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు యాదయ్య గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగిసాయిలు, సక్రు నాయక్, హన్మంతు యాదవ్, విష్ణు, నర్సింహులు, భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.



### జిల్లా అధ్యక్షునికి ఆర్యవైశ్య
## మహిళా సభ్యుల సన్మానం

**విశ్వంభర, మెట్పల్లి :** జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ సంఘానికి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మైలారపు లింబాద్రిని ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు, స్నేహాలయ కిట్టీ పార్టీ మహిళా సభ్యులు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో పుల్లూరి మధుమిత, కోట ధనలక్ష్మి, దేవరశెట్టి, మంజుల బండారి, హరీష, పావని, రేవతి, ఎలగందుల సంధ్య, అనంతుల స్మిత పాల్గొని మైలారపు లింబాద్రి దంపతులను సన్మానించిన వారిలో ఉన్నారు.

### ముఖ్యమంత్రి ఇచ్చారు..
## ఎమ్మెల్యే మీరూ ఇవ్వండి



**విశ్వంభర, తలకొండపల్లి :** మాజీ కేంద్రమంత్రి జైపాల్ రెడ్డి విగ్రహావిష్కరణ సభలో ముఖ్యమంత్రి తను పుట్టిన కల్వకుర్తి నియోజకవర్గానికి 300 కోట్ల వరకు వరాల జల్లు కురిపించారని మరి ఎమ్మెల్యే సొంత గ్రామమైన తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామానికి కూడ నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని స్థానిక బీజేపీ నాయకులు పేరుమళ్ల గణేష్ స్థానికులతో కలిసి పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. తలకొండపల్లి మండలం నుండి ఖానాపూర్ గ్రామం మీదుగా ఆమనగలు వరకు డబల్ రోడ్డు మంజూరు చేయాలని, గ్రామంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి మురుగు కాలువలను ఊరి బయట వరకు పొడిగించాలని, ప్రాథ మిక పాఠశాలకు కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేసి విద్యా ర్థుల సమస్యలను తీర్చి గ్రామానికి ప్రత్యేక నిధులు మం జూరు చేసి అభివృద్ధి చేయాలని కోరారు.

## విద్యార్థులకు పౌష్టికాహారం అందించిన కోటేశ్వరరావు



**విశ్వంభర, జూలూరుపాడు :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాఠశాలలో బాలబాలికలకు పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని అందులో భాగంగా ప్రజలను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సంకల్పంతో చేపట్టిన కార్యక్రమంలో మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం పాపకొల్లు ఉన్నత పాఠశాలలో పాప కొల్లు గ్రామానికి చెందిన శివాలయం కమిటీ ఛైర్మన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జనరల్ సెక్రటరీ, జిల్లా ఆర్యవైశ్య పొలిటికల్ కమిటీ ఛైర్మన్ కొదుమూరి కోటేశ్వరరావు స్పందించి పాఠశాలలోని సుమారు 250 మంది విద్యార్థినీ విద్యార్థులకు పౌష్టికాహారంగా అరటి పండ్లను అందించి వితరణ చాటుకున్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మీరా సాహెబ్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, జిల్లాసోషల్ మీడియా కోఆర్డినేటర్ బానోతు నవీన్ రాథోడ్ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



**విశ్వంభర, కల్వకుర్తి :** కల్వకుర్తి మండలం తాండ్ర ఉన్నత పాఠశాలకు ఐదు కోట్లు ప్రకటించినందుకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాయితి ఆశాదీప్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తను చదువుకున్న పాఠశాల గుర్తుపెట్టుకుని కల్వకుర్తి బహిరంగ సభలో పాఠశాలను ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌గా అభివృద్ధి పరచడానికి ఐదు కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. అందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశామని త్వరలో గ్రామస్తులంతా కలిసి బస్సుల్లో బయల్దేరి ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతామని అందుకు సీఎం అనుమతి ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

విశ్వంభర V3 NEWS



# రైతుల మేలు కోసం రైతు రుణమాఫీ పథకం

**కలెక్టర్ హనుమంత్ కే జడంగే**

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చి రైతుల మేలు కోసం ప్రత్యేకంగా రుణమాఫీ పథకం తెచ్చిందని జిల్లా కలెక్టరు హనుమంత్ కే.జెండగే తెలిపారు. మంగళవారం రైతు రుణ మాఫీ రెండవ విడుత నిధుల విడుదల కార్యక్రమం పురస్కరించుకొని జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ, కోఆపరేటివ్, బ్యాంకర్ల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర శాసనసభా ప్రాంగణం నుండి గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రెండవ విడుత ఋణ మాఫీ నిధుల విడుదల ప్రకటన ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. అనంతరం జిరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ. రెండవ విడుత రైతు రుణ మాఫీ నిధుల విడుదల పట్ల రైతులందరికీ శుభాకాంక్షలు తెలియచేస్తున్నానని అన్నారు. మంగళవారం జిల్లాలో 17 రైతు వేదికలలో రైతు నేస్తం కార్యక్రమం క్రింద రైతులు ముఖ్యమంత్రి సందేశాన్ని చూశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి రైతుల మేలు కోసం రైతు రుణ మాఫీ పథకం తెచ్చిందని, తేదీ.2018 డిశంబర్12 నుండి తేది. 2023 డిశంబర్ 09 వరకు రైతుల రుణాలకు సంబంధించి రెండు లక్షల వరకు రుణ మాఫీ చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఈనెల 18 న మొదటి రుణ మాఫీ క్రింద ఒక లక్ష రూపాయల వరకు జిల్లాలో 36,483 మంది రైతులకు 199 కోట్ల 87 లక్షలు రుణ మాఫీ చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం రెండవ విడుత రైతు రుణ మాఫీ క్రింద ఈరోజు జిల్లాలో 16,143 మంది రైతు కుటుంబాలకు 165 కోట్ల, 87 లక్షల 29 వేల 511 రూపాయలు రుణ మాఫీ చేయడం జరిగిందని తెలిపారు. రైతులకు సకాలంలో రుణం అందిస్తే విత్తనాలు, పెట్టుబడికి ఉపయోగం అవుతుందని, రైతులకు రుణం భారంగా మారినందున రుణ మాఫీ చేపట్టడం జరిగిందని తెలిపారు. జిల్లా స్థాయిలో రైతులకు రుణమాఫీపై ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కరించడానికి 08685- 293312 టోల్ ఫ్రీ నెంబరులో సంప్రదించాలని, ప్రతి క్లస్టర్ రైతు వేదికలలో రైతులు తమ ఆధార్ వివరాలతో వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదిస్తే వారు అన్ని విషయాలపై కావలసిన చర్యలు తీసుకుంటారని సూచించారు. బ్యాంకర్లు రుణమాఫీ ప్రక్రియలో కీలకపాత్ర పోషించాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణ మాఫీని రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలని, రెన్యువల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు శీశైలం, మంగమ్మ, మల్లేశం, శ్రీహరి, సావిత్రి తమకు రుణమాఫీ కావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ తిరిగి వ్యవసాయానికి పెట్టుబడిగా వాడతామని తెలిపారు. చివరగా రైతులకు రుణ మాఫీ చెక్కులను జిల్లా కలెక్టరు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ, ఏరువాక శాస్త్రవేత్త అనిల్ కుమార్, జిల్లా లీడ్ మేనేజరు శివరామకృష్ణ, జిల్లా సహకార అధికారి నాగమణి, అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కి బీసీలు గుణపాఠం చెప్పాలి

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం**



**విశ్వంభర, కరీంనగర్ :** రాష్ట్ర జనాభాలో 50 శాతం పైగా ఉన్న బీసీ వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, ఇటీవల ప్రకటించిన బడ్జెట్ లో బీసీలకు కేవలం 9,200 కోట్లు కేటాయించి తీవ్ర అన్యాయం చేసిందని, బీసీలకు ఇచ్చిన హామీలు, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ను అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి నెట్టు శ్రీశైలం అన్నారు. బీసీల సమస్యలు పరిష్కరించాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ను అమలు చేయాలని, బడ్జెట్లో బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తీవ్ర అన్యాయం నిరసిస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా కరీంనగర్ జిల్లా శాఖ మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల మానిఫెస్టోలో బీసీ కులగనన చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి విద్యా ఉద్యోగ రంగాలలో 20 శాతం నుండి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చి నేడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్లు పెంచకుండానే వెళ్దామని చూస్తుందని, బీసీ సమాజం అంతా ఈ విషయాన్ని గ్రహించి కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి జిల్లాలో బీసీ డిక్లరేషన్ ను పూర్తిగా అటకెక్కిచ్చిందన్నారు. బీసీల సమస్యల పట్ల, కామారెడ్డి డిక్లరేషన్ పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో బీసీల సమస్యలను పరిష్కరించాలని గత కొన్ని రోజులుగా కార్యక్రమాలు చేపడుతున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా లేదన్నారు. ప్రధానంగా కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ కు 50వేల కోట్లు అవసరమైతే 9,200 కోట్లు మాత్రమే కేటాయించి, రాష్ట్ర జనాభాలో 50% ఉన్న బీసీ వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలు, డిక్లరేషన్ ను వెంటనే అమలు చేయాలని, హామీలు డిక్లరేషన్ కు అవసరమైన 50వేల కోట్ల నిధులు కేటాయించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశా రు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం బీసీల కు 42 శాతం రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులకు వినపత్రం సమర్పించారు.

### కాంగ్రెస్ పార్టీ విస్మరించిన హామీలు..

ప్రభుత్వంలోకి వచ్చిన ఆరు నెలల లోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని, స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లు 23 శాతం నుండి 42 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ప్రభుత్వ సివిల్ కన్స్ట్రక్షన్స్, మెయింటెనెన్స్ కాంట్రాక్టులలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పింది. గొల్ల కురుమలకు అధికారంలో వచ్చిన 100 రోజుల్లోనే రెండవ దశ గొర్రెల పంపిణీకి సంబంధించి రెండు లక్షల రూపాయలు లబ్ధిదారుని ఎకౌంట్లో వేస్తామన్న హామీ మరిచి గొల్ల కురుమలను మోసం చేసింది.,బీసీ సబ్ ప్లాన్ కు తగిన నిధులు మంజూరు చేసేందుకు మొదటి అసెంబ్లీ సెషన్ లోనే చట్టబద్ధమైన హొదాతో జ్యోతిరావు పూలే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి ఏడాదికి 20 వేల కోట్ల రూపాయల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి 8 నెలలు గడుస్తున్న నిధుల విషయం పైన ఎటువంటి చర్యలు తీసుకోలేదు., ఎంబీసీ కులాలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయలేదు., అన్ని బీసీ కులాల సమగ్ర అభివృద్ధికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీ యువతకు చిరు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు, ఉన్నత విద్య కోసం వడ్డీ లేకుండా, పూచికత్తు లేకుండా పది లక్షల రుణాలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది., బీసీ కుటుంబాల యువతకు ర్యాంకుతో సంబంధం లేకుండా మొత్తం ఫీజు రియంబర్స్మెంట్ ఆరు నెలల్లోగా ఇస్తామని ఇవ్వకుండా బీసీ యువతను ఉద్యోగాలకు అర్హత లేకుండా చేసింది. సమయం గడుస్తున్నప్పటికీ రాష్ట్రంలో ఉన్నటువంటి మత్స్య సంఘాలకు చేప పిల్లల పంపిణీ చేయకుండా, బిడ్లు ఆహ్వానించి 100 కోట్ల రూపాయల వరకు అవినీతికి తెర లేపింది., ముదిరాజ్, గంగపుత్ర, గౌడ్, మున్నూరు కాపు, పద్మశాలి, విశ్వకర్మ, రజక సామాజిక వర్గాలకు ఇచ్చిన హామీలన్నీ కూడా నెరవేర్చేందుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు, కనీసం క్యాబినెట్లో నిర్ణయాలు గాని తీసుకోలేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట కార్యదర్శి భోగ విజయభాస్కర్, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, ఓడీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిచెర్ల రాజు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, రాంగోపాల్ రెడ్డి, కార్పొరేటర్లు కొలగాని శ్రీనివాస్, కాసర్ల ఆనంద్, వంగల పవన్ కుమార్ పెద్దపల్లి జితేందర్, కొలిపాక శ్రీనివాస్, వెంకటరమణారెడ్డి, నాంపల్లి శ్రీనివాస్, వాసాల రమేష్, వేముల చంద్రశేఖర్, కళ్లెం వాసుదేవ రెడ్డి, బొంతల కళ్యాణ్ చంద్ర, కటకం లోకేష్, అలివేలు, సమ్మిరెడ్డి, పుప్పాల రఘు, రంగు భాస్కరాచారి, వాసాల రమేష్, బండి మల్లయ్య యాదవ్, గుంజేటీ శివకుమార్, శివరాజ్, గర్దాస్ సతీష్, కలికోట మోహన్, మల్లికార్జున్, నడిగూడ కుమార్, మహేష్ ఎర్రోజ్ లక్ష్మణ్, గంట సంపత్, రాగి సత్యనారాయణ, హరిప్రసాద్, గణేష్, సత్యనారాయణ రెడ్డి, గొడుగు వినోద్, రవియాదవ్, నవీన్ పాల్గొన్నారు.

# వనమహొత్సవం పనులను పరిశీలించిన ఎంపీడీఓ



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని కొరటికల్, రహీంఖాన్ పేట, ఉప్పలపహాడ్, పోతిరెడ్డి పల్లి గ్రామాలలో మంగళవారం రోజు వన మహొత్సవ పనులను పరిశీలించి అక్కడ ఉన్న కూలీలకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని ఎంపీడీఓ ఎండీ నిరంజన్ వలీ అన్నారు. ఈ సందర్భంగా నిరంజన్ వలీ మాట్లాడుతూ చెట్లు లేకపోతే భవిష్యత్తులో దుర్భర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోందని ప్రకృతిని పరిరక్షించుకునేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. చెట్లు ఉంటే వర్షాలు పుష్కలంగా కురుస్తాయన్న విషయాన్ని గ్రహిస్తే భవిష్యత్తు తరాలకు మనం మంచి చేసిన వాళ్లమవుతామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ విషయం గుర్తు పెట్టుకోవాలని కూలీలకు సూచించారు. చెట్లు లేకపోతే వర్షాలు పడక, పంటలు పండక చాలా దుర్భర పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తుందని వివరించారు. నాటిన ప్రతి మొక్కను తల్లితో సమానంగా కాపాడుకోవాలని అన్నారు. ప్రకృతిని పరిరక్షించుకునేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ బొడిగె రమేష్, టీఏ లు దంతూరి శ్రీశైలం, జెమాండ్ల యాదిరెడ్డి, పంచాయితీ కార్యదర్శులు నరేందర్, శ్రీనివాస్, హరీష్, స్వాతి, ఫీల్డ్ అసిస్టెంట్ లు స్వామి, నర్సిరెడ్డి, రాధిక, లోడి సుమలత, కూలీలు యాదయ్య, నరసయ్య పాల్గొన్నారు.

# ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల పరిధిలోని కూరేళ్ల గ్రామంలో మండల కాంగ్రెస్ నాయకులు, అనుభవ గ్రామీణ వైద్యులు, సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు సూదగాని లక్ష్మయ్య గౌడ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఒక్కరికి ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డులను ఇస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక్కటే విన్నపం నిత్యం మేము గ్రామీణ ప్రాంతాల్లో పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యుల కుటుంబ సభ్యులకు అన్ని రోగాలకు మాములు జ్వరం నుంచి ఆపరేషన్ల వరకు అన్ని కార్పోరేట్ ఆసుపత్రిలో కార్డు పనిచేసే విదంగా సుమారు 20 లక్షల రూపాయల వరకు వాడుకునే విదంగా ఆరోగ్య శ్రీ పథకంలో మమ్ములను చేర్చి ప్రత్యేక హెల్త్ కార్డులను ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, మంత్రులు దామోదర రాజనర్సింహని, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని, ఉత్తమ్ కుమార్ రెడ్డిని, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యాలకు విజ్ఞప్తి చేశారు.

# 7లక్షల మందికి లక్షన్నర రుణమాఫీ



**విశ్వంభర, కరీంనగర్ :** వరంగల్ రైతు డిక్లరేషన్ వేదికగా రెండు లక్షల రుణమాఫీపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు నేడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లక్షన్నర లోపు రుణాలు మాఫీ ప్రారంభించిన సందర్భంగా నగరంలోని 30వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతి గోపి ఆధ్వర్యంలో మారుతి నగర్ చౌరస్తా వద్ద రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ పాలాభి షేకం చేశారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఆరెపెల్లి మోహన్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, జోనల్ ఇన్చార్జి మాచర్ల ప్రసాద్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ మల్యాల సుజిత్ కుమార్‌లు హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేయడంతో పాటు, టపాసులు కాల్చి, సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆరెపెల్లి మోహన్ మాట్లాడుతూ దాదాపు 7వేల కోట్ల రూపాయలు కేటాయించి నేడు రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రారంభించిన లక్షన్నర రుణాల మాఫీతో 7లక్షల మంది రైతులు లబ్ది పొందనున్నారని, ఆగస్టు 15 లోపు 2 లక్షల రూపాయల రుణమాఫీ చేసి కాంగ్రెస్ పార్టీ చరిత్ర సృషించనుందని అన్నారు. గత ప్రభుత్వ పాలకులు అభివృద్ధి పేరుతో రాష్ట్రాన్ని దివాలా తీసి వారు మాత్రం లాభ పడ్డారని దుయ్యబట్టారు. ఒకవైపు కుదేలైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బరువును మోస్తూ మరోవైపు ఆ భారాన్ని ప్రజలపై పడకుండా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో ప్రచారం చేయాలనే ఆలోచనతో డివిజన్ లో కార్యక్రమాన్ని చేపట్టిన అధ్యక్షుడు దొంతి గోపిని నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, కరీంనగర్ పట్టణ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగంపల్లి బాబు, నాయకులు మహమ్మద్ అమీర్, వంగల విద్యాసాగర్, కీర్తి కుమార్, శ్రీనివాస్, రాజశేఖర్ పాల్గొన్నారు.



ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యని కలసి వీఆర్ఏల సమస్యలు, పెండింగ్ జీతాల గురించి మాట్లాడిన కాంగ్రెస్ జిల్లా నాయకులు కానుకుంట్ల యాదగిరి, వీఆర్ఏల జిల్లా అధ్యక్షులు వీరన్న, మచ్చగిరి, కుమారు, పులేందర్

– విశ్వంభర, ఆత్మకూరు(ఎం)

## రుణమాఫీ చరిత్రలో నిలిచిపోతుంది



**విశ్వంభర, కొత్తూరు :** ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ దేశ చరిత్రలో నిలిచిపోతోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గూడూరు మాజీ ఉపసర్పంచ్ దయానంద్ గుప్తా అన్నారు. ఈ సందర్భంగా దయానంద్ గుప్తా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతుల పక్షపాతి అని అన్నారు. రైతులు పంటసాయం కోసం తీసుకున్న రుణమాఫీకి క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి, మండలి సభ్యులు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుని రుణమాఫీ చేయడానికి ఆమోదం తెలపడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తామని, రాష్ట్ర ప్రజల, రైతుల, ఉద్యోగుల, నిరుద్యోగుల, కార్మికుల, కర్షకుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. రుణమాఫీతోనే కాకుండా రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు.

## బోనాల పండుగ

**విశ్వంభర, నందిగామ :** తెలంగాణ సంస్కృతికి నిదర్శనంగా బోనాల పండుగ నిలిచింది. తెలుగు వారి సంస్కృతి సాంప్రదాయాలతో బోనం పండుగ ఎంతో సుప్రసిద్ధమైనంది. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం, మోత్కూల గూడ గ్రామంలో బోనాల పండుగ సందర్భంగా పోచమ్మ, ఎల్లమ్మ ఆలయాన్ని పూలు, తోరణాలతో అలంకరించి బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పోతురాజులు చేస్తున్న విన్యాసాలు అందరిని అలరించాయి. మోత్కూల గూడ గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, ప్రజలు అందరూ పాల్గొని బోనాల పండుగని అంగరంగ వైభవంగా నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు.





# రెండో విడత రుణమాఫీపై రైతుల సంబరాలు

**విశ్వంభర, జయశంకర్ భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో రెండో విడత రుణమాఫీపై రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విని సంబరాలు జరుపుకున్నారు. మొదటి విడతలో లక్ష రూపాయల రుణమాఫీ కాగా రెండో విడతలో 1,50,000 వేల రూపాయల వరకు రుణమాఫీ కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. మహదేవపూర్ వ్యవసాయ విస్తీర్ణ అధికారి ధర్మేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి, కాళేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వామన్ రావుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



## సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి

**విశ్వంభర, హైదరాబాద్ :** పీసీసీ అధ్యక్షుడు గా రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను పోలీసులు ఎక్కడికి అక్కడ అరెస్టు చేశారు. తక్కువ జీతాలతో పని చేస్తున్న ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి అంటూ పెద్ద ఎత్తున ఉద్యోగులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. కేజీబీవీ లో ఎక్కువ మంది టీచర్లుగా మహిళలు పని చేస్తున్నారని, రాత్రి వేళల్లో హాస్టల్ లో అమ్మాయిలతో నిద్రిస్తున్న మాకు కనీస వేతనం అందడం లేదని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.



## వంజరి రిజర్వేషన్ల పునరుద్ధరణకు జేఏసీ ఏర్పాటు

**విశ్వంభర, హైదరాబాద్ :** వంజరి కులస్థులు కోల్పోయిన రిజర్వేషన్ లను పునరుద్ధించాలని వంజరి కుల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం తార్నకాలో జరిగిన వంజరి రిజర్వేషన్స్ -భవిష్యత్తు కార్యాచరణపై రాష్ట్రములో అన్ని రిజిస్టర్ వంజరి సంఘాలతో కలిసి సమావేశం నిర్వహించారు. శంకరన్ కమీషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా వంజరి కులస్తులను ఎస్.టీ జాబితాలో చేరిస్తే వ్యకిగత కక్ష్యలతో చెన్నారెడ్డి రాత్రికి రాత్రి ఒక చీకటి జీ.ఓ ద్వారా వంజరులను ఎస్.టీ జాబితా నుండి బీసీ (డీ)జాబితా లోచేర్చి వంజరుల పట్ల మరణశాసనం లిఖించారని సమావేశం ఆవేదన వ్యక్తం చేసింది. చెన్నారెడ్డి ప్రభుత్వం ఇచ్చిన జీ.ఓను రద్దు చేసి వంజర్లను ఎస్టీలలో పునరుద్ధరించాలని సమావేశం డిమాండ్ చేసింది. వంజరులను ఎస్టీలో చేర్చాలన్నడిమాండ్ కొత్తదేమి కాదని నిజమైన సంచార జాతి అయిన వంజర్లను ఎస్టీలుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల సాధనకు అన్ని రిజిస్టర్ సంఘాల ప్రతినిధులతో ఐక్య కార్యాచరణ సమితిని ఏర్పాటు చేశారు. వంజరి రిజర్వేషన్ల సాధనకు ఏకకాలంలో బహుముఖ వ్యూహం, దీర్ఘకాలిక లక్ష్యం స్వల్పకాలిక వ్యూహాలు అన్న విధానంతో ముందుకెళ్లాలని సమావేశంలో తీర్మానించారు. వంజరి కులస్తులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి తెలంగాణ వంజరి సంఘం మాజీ అధ్యక్షులు కాలేరు విశ్వనాథం ముఖ్యఅతిథిగా హాజరైన ఈ కార్యక్రమానికి వంజరి రిజర్వేషన్ కమిటీ ప్రతినిధులు ముజకరి రవీందర్, పోతనకార్ లక్ష్మీనారాయణ మహాదేవ్ ముండే, కాలేరు రూప సురేష్, తెలంగాణ వంజరి సేవా సంఘం ప్రతినిధులు దాత్రిక ధర్మరాజు, ఎదుగాని హరినాథ్, పిట్టల అంజయ్య, తెలంగాణ వంజరి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాత్రికా కాశీనాథ్, కాలేరు యుగంధర్, అనంతుల అనిల్, కాలేరు శ్రీనివాస్, విటల్, శ్రీనివాసరావు, నిజామాబాద్ జిల్లా వంజరి సంఘం ప్రతినిధులు బోనకర్ భూమయ్య కరిపే సత్యం, మాస్టర్ శంకర్, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, కరిపే రవీందర్, రత్నం కోటాజీ, జగిత్యాల పట్టణం నుండి కృష్ణ నగర్, గంజ్ వంజరి సంఘాల అధ్యక్షులు పోతునుక మహేష్, నవాతు ఆంజనేయులు సంఘం కార్యదర్శులు లవంగ శ్రీనివాస్, నవాతు రాజేందర్, బానుక బుచ్చిలింగం, ఆముద లింగారెడ్డి ఉద్యోగ ఉపాధ్యాయులు అడ్వకేట్లు జర్నలిస్టులు వివిధ రిజిస్టర్ సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం పిడమర్తి రవికి సముచిత స్థానం కల్పించాలి


**విశ్వంభర, ఎల్బీనగర్ :** తెలంగాణ ఉద్యమకారుడు రాష్ట్ర ఏర్పాట్ లో క్రియాశీలక పాత్ర పోషించిన పిడమర్తి రవికి రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని తెలంగాణ జన జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కోటగిరి ఉషారాణి అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం మాదిగ సామాజిక వర్గానికి 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. అనునిత్యం కుల సంఘాల్లోనూ, ప్రజాసంఘాలలోనూ వివిధ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని అనునిత్యం ఉద్యమాలు చేసినటువంటి ఉద్యమకారుడు పిడమర్తి రవికి మంచి స్థానం కల్పిస్తే సామాజిక వర్గానికి లబ్ధి చేకూరుతుంధి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నక్క మహేష్, ఎల్బీనగర్ మాజీ ఎస్సీ సెల్ చైర్మన్ జోగు రాములు, దిలీప్, మనోహర్, రమేష్, శ్రీకాంత్, అనిల్, రాజు, వివిధ సంఘ నాయకులు పాల్గొన్నారు.



## విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

### ఎస్ఐ బి.యాదయ్య

**విశ్వంభర, చింతపల్లి :** నల్లగొండ చింతపల్లి సబ్ ఇన్స్పెక్టర్ భీమనమోని యాదయ్య ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా విధ్యార్థులు మాదక ద్రవ్యాలు గంజాయి తీసుకోవడం వలన జరిగే నష్టాలు, వాటి దుష్పరిణామాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లితండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారు. ఎక్కడ తిరుగుతున్నారనే విషయాలపై శ్రద్ధ చూపాలని, పిల్లలు మత్తుకు బానిస కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా గంజాయి తీసుకున్నట్లు పోలీసులకు సమాచారం తెలిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



## మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ చైర్మన్‌గా ఆది శ్రీనివాస్

**విశ్వంభర, హైదరాబాద్ :** బడుగు బలహీన వర్గాల సంక్షేమం, సముద్ధరణకు తన వంతు కృషి సల్పుతానని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పటేల్ చెప్పారు. మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ ఛైర్మన్ గా నియమితులైన ఆయన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మాట్లాడారు. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అధ్యక్షతన ఈనెల 14, 29వ తేదీలలో సమావేశమైన అపెక్స్ కౌన్సిల్ ఆది శ్రీనివాస్ పటేల్ ఛైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాన్ని కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తమ రావు, సభ్యులు వీరమల్ల ప్రకాష్, పూల రవీందర్, రౌతు కనకయ్య, సీ.విఠల్, మీసాల చంద్రయ్య, ఆకుల రజిత్ తదితర ప్రముఖులు అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, తన ను కౌన్సిల్ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకో వడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ సంఘం ప్రముఖులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మున్నూరుకాపులతో పాటు బడుగు బలహీన వర్గాలు, పేద ప్రజల సంక్షేమం, ఉన్నతికి ప్రభుత్వపరంగా, వ్యక్తిగతంగా చేయూతనందిస్తానన్నారు. ఈ విధంగా తనను ఎన్నుకుని కులానికి మరింత సేవ చేసే అవకాశం కల్పించడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని వివరించారు. అపెక్స్ కౌన్సిల్ వచ్చే నెల 10వ తేదీన స్వర్గీయ కేంద్ర మాజీ మంత్రి, ఓబీసీలకు రాష్ట్రంలో, అటు జాతీయ స్థాయిలో రిజర్వేషన్ల కల్పనకు పాటుపడిన స్వర్గీయ పుంజాల శివశంకర్ పటేల్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తీర్మానించింది. అదేవిధంగా శివశంకర్ విగ్రహాల ను వీలైన చోట ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కౌన్సిల్ సభ్యులు తీర్మానిం చారు. కార్యక్రమంలో ఛైర్మన్ ఆది శ్రీనివాస్ ను సభ్యులు పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో సత్కరించారు. కౌన్సిల్ సమావేశానికి సభ్యులు మంగళారపు లక్ష్మణ్, బత్తినీడు ఆది విష్ణు మూర్తి, సత్తు మల్లేష్, ఎర్రా నాగేందర్, ఊసా రఘు, లవంగాల అనిల్, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఆవుల రామారావు, పీ యల్ యన్ పటేల్ తదితర ప్రముఖులు హాజరయ్యారు.






## మలబార్‌లో 'మైన్' డైమండ్ షో

**విశ్వంభరా, ఎల్బీనగర్ :** వనస్థలిపురం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో 29 జూలై నుండి 4 ఆగస్టు వరకు "మైన్ డైమండ్స్" షోని బీ.ఎన్.రెడ్డి మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ మహిళలకు బంగారం పట్ల ఎంతో మక్కువ ఉంటుందని అన్నారు. అనంతరం స్టోర్ హెడ్ ఇషాక్ మాట్లాడుతూ ఈ డైమండ్ షోలో రోజూ ధరించే నగలు, వివాహ ఆభరణాలు, లైట్ వెయిట్ ఆభరణాలు, పురుషుల ఆభరణాలు ప్లాటినం ఆభరణాల సముదాయాన్ని అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. మీకు నచ్చి సొంతం చేసుకొనే విధంగా కేవలం మలబార్ గోల్డ్, డైమండ్స్ వనస్థలిపురం షోరూంలో ఉంటుందని తెలిపారు. ఈ డైమండ్ షో లో వజ్రాభరణాలు, వజ్రాల విలువపై 25 శాతం వరకు తగ్గింపు లభిస్తుంది అని అన్నారు. వినియోగదారులు కొనుగోలు చేయాలనుకున్న బంగారం విలువలో 5 శాతం ముందుగా చెల్లించి అడ్వాన్స్ బుకింగ్ సదుపాయాన్ని పొందవచ్చు అని తద్వారా భవిష్యత్తులో పెరిగే బంగారం ధరల నుండి లబ్ది పొందవచ్చు అని తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ నాగరాజు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య ప్రభుత్వంలో నియంత ప్రధానమంత్రి మోదీ

**విశ్వంభర, హైదరాబాద్ :** దేశంలోని ప్రతిపక్ష పార్టీలను అణిచివేసేందుకు అధికార బీజేపీ చట్టవిరుద్ధంగా కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తుందని, ఈడీ, సీబీఐ లను ప్రధాన సాధనాలుగా వాడుతూ నిరాధారమైన కారణాలతో విపక్ష నేతలను టార్గెట్ చేసి జైళ్లలో మోదీ ప్రభుత్వం బందిస్తుందని 'ఇండియా' కూటమి నేతలు మండిపడ్డారు. బూటకపు కేసులు పెట్టి జైల్లో బంధించిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ను తక్షణమే విడుదల చేయాలనీ వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఆప్ జాతీయ కమిటీ పిలుపుమేరకు "ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్ట్" ను నిరసిస్తూ దేశవ్యాప్త ధర్నాలలో భాగంగా ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ కమిటీ హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ లో మంగళవారం భారీ ధర్నా నిర్వహించింది. ఈ ధర్నాకు ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షత వహించగా 'ఇండియా' కూటమి నేతలు ఏం.ఆర్.జి. వినోద్ రెడ్డి, కాల్వ సుజాత (కాంగ్రెస్), ఎన్. బాలమల్లేష్ (సీపీఐ), డీ.జీ. నరసింహరావు (సీపీఎం), జానకి రామ్ (ఆర్.ఎస్.పీ), ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, డా. సాల్మన్ రాజు, ఎస్.కె. అన్సారీ, ఏం.ఏ. మజీద్ వేదికపై ఆసీనులైయ్యారు. ఈ సందర్భంగా ఏం.ఆర్.జీ. వినోద్ రెడ్డి మాట్లాడుతూ నియంతలు నిర్వహించే ఆపరేషన్ల తరహాలో ఈడీ, సీబీఐ లను అక్రమంగా వినియోగించి ప్రతిపక్ష నేతలను అంతం చేయడానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. గత కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఏనాడూ ఈడీ, సీబీఐ లను దుర్వినియోగపరచలేదని, ప్రతిపక్ష నేతలను వేదించలేదని, జైళ్లలో బందించలేదని, అవసరమైనప్పుడు వారి సలహాలు, సూచనలు తీసుకునేదని గుర్తు చేసారు. ఏ ఆధారాలు లేని ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులు పెట్టి అరవింద్ కేజ్రీవాల్, ఇతర ఆప్ నేతలను అరెస్ట్ చేయడం చట్టవిరుద్ధం అని, ఆప్ నేతలను వెంటనే విడుదల చేయాలనీ ఏం.ఆర్.జీ. వినోద్ రెడ్డి డిమాండ్ చేసారు. కాల్వ సుజాత మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య సిద్ధాంతాలపై కఠోరమైన దాడులు చేస్తూ ప్రతిపక్ష నేతలను ఏకపక్షంగా, చట్ట విరుద్ధంగా అరెస్టులు చేయడం, బంధించడం చేస్తుందని ఆరోపించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల లక్ష్యం ప్రతిపక్షం అని, అధికార బీజేపీ పార్టీని ముట్టుకునే సాహసం చేయరని ఆమె అన్నారు. ఎన్. బాలమల్లేష్ మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం బీజేపీ కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. 'ఇండియా' కూటమి పార్టీలను అధికార బీజేపీ అణిచివేసే ప్రయత్నాలు కొనసాగిస్తే దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రజా తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. డీ.జీ. నరసింహ రావు మాట్లాడుతూ కేంద్ర బీజేపీ పాలనలో ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన జరుగుతుందని, ప్రధాని మోదీ హానికరమైన పోకడలతో ప్రజాస్వామ్యం పెను ప్రమాదంలో పడిందని తెలిపారు. జానకి రామ్ మాట్లాడుతూ కరడుగట్టిన నియంతలందరూ నిర్వహించే చర్యల్లో భాగంగానే మోదీ ప్రతిపక్ష నేతలను అణిచివేస్తున్నాడని, ఇందుకు ఉదాహరణ అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ అని పేర్కొన్నారు. డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తన అతిపెద్ద రాజకీయ ప్రత్యర్థి 'ఆప్'ను అణిచివేసేందుకు ఈడీ, సీబీఐ లను, ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ ని దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు గత పదేళ్లలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులపై 230 కేసులు నమోదు చేశాయని, అయితే కోర్టుల్లో ఒక్క కేసును నిరూపించడానికి తగిన సాక్ష్యాలు ప్రవేశపెట్టలేదని అన్నారు. తగిన సాక్ష్యాలు లేనందున అరవింద్ కేజ్రీవాల్ తోసహా అప్ నేతలు నిరపరాధులుగా బయటకు వస్తారని డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. ఈ ధర్నాలో ఆప్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి నర్సింగ్ యమునా గౌడ్, యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ ముల్లంగి, నాయకులూ కొడంగల్ శ్రీనివాస్, డాక్టర్స్ విభాగం అధ్యక్షులు డా. లక్ష్య నాయుడు, దివ్యంగా విభాగం అధ్యక్షులు దర్శనం రమేష్, అధికారప్రతినిది జావీద్ షరీఫ్ పాల్గొన్నారు.






## రాష్ట్ర న్యాయవాద సంక్షేమ సభ్యత్వ వయోపరిమితి సడలించాలి

**విశ్వంభర, ఎల్బీనగర్ :** తెలంగాణ రాష్ట్ర న్యాయవాద సంక్షేమ సభ్యత్వ వయోపరిమితి సడలిస్తు 2024వ సంవత్సరం వరకు నమోదు కాబడిన 65 ఎండ్లు లోబడిన న్యాయవాధులందరికి అవకాశం ఇవ్వాలని ఈ రోజు రంగారెడ్డి జిల్లా న్యాయ వాద సభ్యులు రాష్ట్ర న్యాయవాద సంఘం అధ్యక్షులు, రంగారెడ్డి జిల్లాకోర్టు న్యాయవాధ సంఘం అధ్యక్షులు కొండల్ రెడ్డికి వినతి పత్రం అందజేసారు. కొండల్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఇట్టి అంశాన్ని తీసుకు వెలతామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు జిల్లా రమణ, రంగా ప్రవీణ్ కుమార్, పీఆర్వీ ప్రసాద్, వనం శ్రీకాంత్, పైల్ల అరవిందా రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఇతర బార్ సంబందించిన న్యాయవాద సభ్యులు పాల్గొన్నారు.



## షాద్ నగర్ డివిజన్ వైద్య సిబ్బంది సమీక్ష

**విశ్వంభర, షాద్ నగర్ :** షాద్ నగర్ డివిజన్ లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులకు, సూపర్వైజర్లకు, డీఈఓ లకు, ఏఎన్ఎం లకు డాక్టర్ వి.విజయలక్ష్మి నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో నెలలో సాధించవలసిన ప్రగతి గురించి ప్రతి ప్రాథమిక వైద్య అధికారి, వారి స్టాఫ్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజనల్ లోని ఏఎన్ఎం లకు వారి వారి ఏరియాలో ఉన్న గర్భవతులను తొందరగా రిజిస్ట్రేషన్ చేసి, ఆన్లైన్లో వెంటనే అప్డేట్ చేస్తే, పేద ప్రజలకు తెలంగాణ ప్రభుత్వము ఇచ్చే డబ్బులు వస్తాయని చెప్పారు. అలాగే రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే వారికి టీ.టీ వాక్సినేషన్ ఇచ్చి, నెలకు సరిపోయే ఐరన్ ఫోలిక్ మాత్రలు ఇవ్వాలని చెప్పారు. ప్రతి బుధవారం, శనివారం సంవత్సరంలోపు పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. అలాగే గ్రామాలలో ఉన్న షుగర్ వ్యాధిగ్రస్తులను హైపర్ టెన్షన్ వ్యాధిగ్రస్తులను వెంటనే గుర్తించి, వారికి బీ.పీ, షుగర్ టాబ్లెట్లను నెల నెల ఇచ్చి, వారి ఆరోగ్యాన్ని కాపాడాలని తెలియజేశారు. హైపర్ టెన్షన్ తో బాధపడుతున్న వ్యక్తి రెగ్యులర్గా బీ.పీ టాబ్లెట్లు వేసుకోకపోయినట్లయితే గుండెపోటుకు గురికావలసి వస్తుంది అని, అందువలన వారికి తప్పకుండా నెల నెల బీ.పీ టాబ్లెట్లను అందజేయాలని ఏఎన్ఎంలను హెచ్చరించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. వర్షాకాలంలో దోమల వలన మలేరియా, డెంగు, చికెన్ గునియా ప్రాణాంతకమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, దోమల నివారణ చర్యలు గురించి ప్రజలలో అవగాహన కలిగించి, దోమలు అభివృద్ధి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు తెలియజేయాలని డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జే శ్రీనివాసులు, డివిజన్ వైద్యాధికారులు, హెల్త్ సూపర్వైజర్లు, డీఈవోలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో
# మెగా హెల్త్ క్యాంప్



**విశ్వంభర, కల్వకుర్తి :** కల్వకుర్తి మునిసిపాలిటీ పరిధిలోని తిమ్మరాశిపల్లి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ శిబిరాన్ని లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులు పసుల లక్ష్మా రెడ్డి, జోన్ చైర్మన్ సంపత్ జనార్ధన్ రెడ్డిలతో కలిసి రీజియన్ చైర్మన్ తెప్ప శ్రీను ప్రారంభించారు. శిబిరంలో ఆరు వందల మందికి సాధారణ పరీక్షలు, మూడు వందల ఇరవై ఐదు మందికి మధుమేహ పరీక్షలు నిర్వహించారు. నూటా పది మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఇరవై ఏడు మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి, ఇరవై ఆరు మందికి కంటి అద్దాలను ఇచ్చామని కంటి వైద్య నిపుణులు లయన్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ క్లబ్ సభ్యుల సహకారంతో లయన్స్ సేవలను విస్తృత పరుస్తామని చెప్పారు. ఈ శిబిరంలో ఆరు వందల మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగిందన్నారు. హెల్త్ క్యాంప్ చైర్మన్ దామోదర్ రెడ్డి, డా. ఇ కృష్ణ, డా. సి వెంకట్ రెడ్డి, డా. మహేశ్వర్ రెడ్డి, మాజీ గవర్నర్లు చెన్నకిషన్ రెడ్డి, జూలూరి రమేష్ బాబు, కార్యదర్శి దోనాదుల మహేష్, కోశాధికారి గుజ్జరి నర్సింహ్మా, జిల్లా చైర్మన్ కండె ఓంకారం, చేగూరి వెంకటేష్, పిఆర్వో పాష మెడికల్ రిప్రజెంటేటీవ్ బృందం పాల్గొన్నారు.



## అర్హులైన రైతులకు
# రుణమాఫీ చేయాలి

**విశ్వంభర, ఆమనగల్లు :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత రైతు రుణమాఫీ చేసిన సందర్భంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శశాంక ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డైరెక్టర్, కడ్తాల్, ఆమనగల్లు ఉమ్మడి మండలాల పీఎసీఎస్ చైర్మన్ వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం రైతుల కుటుంబ సభ్యులలో ఎవరైనా గ్రూప్ 4 ఉద్యోగస్తులు ఉంటే ఆ రైతులకు రుణమాఫీ కావడం లేదు కనుక కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తక్షణమే రుణమాఫీ చేయాలని తెలిపారు. డీసీసీబీ జిల్లా బ్యాంకు ఇంటరాక్ట్ కంప్యూటర్ సర్వర్ గతంలో పూర్తిస్థాయిలో సహకరించకపోవడం వలన, కంప్యూటర్ ఆపరేటర్ కొరత వలన కొందరి రైతుల వివరాలు ఆన్లైన్లో పొందుపరచలే కపోయారు. అలాంటి రైతులకు కూడా రుణమాఫీ చేయాలని వారికి సంబంధించిన వివరాలు ఆఫ్లైన్ ద్వారా డీసీసీబీ కార్యాలయాలకు పంపించామని ఈ సమాచారాన్ని ప్రభుత్వం తీసుకొని వారికి కూడా రుణమాఫీ వర్తింపజేయాలని చైర్మన్ వెంకటేష్ గుప్తా అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఓ ధాత్రి దేవి, డీఈవో గీతారెడ్డి, ఎంబీఎన్ఆర్ డీసీసీబీ డైరెక్టర్స్ మంజుల, బక్కన్న యాదవ్, డీసీఎంఎస్ డైరెక్టర్ పాండు, రంగారెడ్డి జిల్లా పీఎసీఎస్ చైర్మన్లు, మహబూబ్నగర్ జిల్లా పీఎసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్



**విశ్వంభర, షాద్‌నగర్ :** షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ 5.లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, స్థానిక కౌన్సిలర్ పిల్లి శారద శేఖర్ తో కలిసి నిర్మాణ పనులను కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్, వార్డు అధ్యక్షులు పర్వతపురం బిక్షపతి, ఎన్. మహేష్, ప్రశాంత్, అంతరం రాంచందర్, అలీ, సాదిక్, వీరేశం అప్ప, కృష్ణ, అంజి, నర్సింహా, శివ, అభి, మహిళలు నిర్మల, నవనీత, జాహెద బేగం, లలిత పాల్గొన్నారు.

## అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలి




**విశ్వంభర, డిండి :** డిండి మండలం లోని బ్రాహ్మణపల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఐ గ్రామ శాఖ నిర్మాణ సమావేశానికి ముఖ్యఅతిథిగా సీపీఐ డిండి మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనొద్దీన్, సభాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గ్రామ శాఖలో పార్టీ బలోపేతం దిశగా అడుగులు వేయాలని రానున్న స్థానిక ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉండాలని సమస్యలు ఏమన్నా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వార్డు నుండి మొదలు పెడితే సర్పంచిగా పోటీ చేసే విధంగా అందరూ సిద్ధం కావాలని తెలిపారు. నూతనంగా గ్రామశాఖ సీపీఐ కార్యదర్శిగా ఏటెల్లి వెంకటయ్యను ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటినుండి 2023 డిశంబర్ 09 వరకు వ్యవసాయ రుణాలు తీసుకున్న అర్హులైన ప్రతి రైతుకు రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల పూర్తి రుణమాఫీని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి బొల్లె శైలేష్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం



**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని భోగారం, సిరిపురం, వెల్లంకి, మునుగోడు, పోచంపల్లిలో చేనేత కార్మికుల జీవన స్థితిగతుల విషయంలో నకిరేకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే వేముల వీరేశం అసెంబ్లీలో ప్రసంగించడం హర్షణీయం అని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కూనూరు సాయి కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం నాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే వేముల వీరేశం ఈ నెలలో మొహరం( పీర్ల) పండుగకి భోగారం గ్రామానికి వచ్చిన సందర్భంగా వేడుకలలో భోగారం గ్రామంతో పాటు పలు గ్రామాలలో చేనేత కార్మికుల జీవన స్థితిగతుల, జీవన విధానం, ఎదుర్కొంటున్న సమస్యల గురించి వినతి పత్రం అందజేయడం జరిగిందని, ఇక్కడి పరిస్థితుల విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే మంగళవారం ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించి, పరిష్కారం చేయాలని మాట్లాడటం హర్షణీయమని, ప్రత్యేక చోరువ తీసుకోవడం పట్ల ఎమ్మెల్యే వేముల వీరేశంకి సాయి కుమార్ గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## గత ప్రభుత్వ పాలనలో తండాల అభివృద్ధి శూన్యం



**విశ్వంభర, షాద్ నగర్ :** నియోజకవర్గంలోనీ బీఆర్ఎస్ నేతలు గత 10 సంవత్సరాల పాలనలో తండాల్లో జరిగిన పనులు గురించి వాస్తవాలు తీసుకొని విమర్శలు చేయాలని నందిగామ ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రీను నాయక్ అన్నారు. గత పాలనలో జరిగిన అభివృద్ధిపై తండాలను పర్యటించి తండాల్లో ఉన్న పెద్ద మనుషుల సమక్షంలో చర్చిద్దామని సవాలు విసిరారు. గత పాలనలో జాతీయ రహదారికి 200 మీటర్ల దూరంలో ఉన్న నందిగామ మండలానికి చెందిన ఎం.ఎస్.ఎన్ తండాలో కనీస అభివృద్ధి జరగలేదని, తండాలో ఉన్న రోడ్లను ఒకసారి పరిశీలిస్తే మీకు వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. గత పదేండ్లలలో నందిగామ మండలంలో చెగూర్ నుంచి తుక్యా తండా, రెడ్డి పాలెం నుంచి మల్లాపూర్ తండా, చాకలి దాన్ని గుట్ట తండాలకు ఉన్న రోడ్డు సమస్యను పరిష్కరించనందున ఈరోజు ఆ తండాల ప్రజలు సతమతం అవుతున్నారు. తండాల్లో మౌలిక సౌకర్యాల కల్పనలో నిధులు కేటాయించనందున ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత పాలనలో ప్రతి తండాల్లో రోడ్డు సమస్య, డ్రైనేజీ సమస్యలపై శ్రద్ధ వహించనందున నేడు ఆ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత మాపై పడ్డాయని శ్రీను నాయక్ తెలిపారు. రాజకీయాల్లో నాయకులు పార్టీలకు అతీతంగా హుందాగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, పరస్పర విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పి.రూప్ సింగ్ డైరెక్టర్, పి చందర్, రవీందర్ నాయక్, తార్య నాయక్ పాల్గొన్నారు.

## కరువు భత్యం, డీఏ బకాయిలు విడుదల చేయాలి



**విశ్వంభర, ముషీరాబాద్ :** కరువు భత్యం డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఈహెచ్ఎస్ స్కీమ్ ద్వారా అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స వర్తింప చేయాలి అని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ దారుల సంయుక్త కార్యచరణ సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద మౌన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్న రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ పెన్షనర్లకు బకాయి ఉన్న నాలుగు కారుణ్య పద్యముల వాయిదాలు డీఆర్ వెంటనే విడుదల చేయాలన్నారు. ఈహెచ్ఎస్ స్కీమ్ ద్వారా అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో పెన్షనర్లకు నగదు రహిత చికిత్స వర్తింపచేయాలని కోరారు. ఈహెచ్ఎస్ స్కీంను యూనివర్సిటీ, రిటైర్డ్ కాలేజీ టీచర్స్, జీహెచ్ఎంసీ, ఎయిడేడు పాఠశాలల సిబ్బందికి, మార్కెటింగ్ శాఖల పెన్షనర్లకు కూడా వర్తింపచేయాలని కోరారు. మెడికల్ రియంబర్స్మెంట్ బిల్లులు మూడు నెలల్లో చెల్లించే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన ఐఆర్ ఐదు శాతంను కనీసం 20 శాతం కు పెంచాలని పీఆర్సీ రిపోర్టును వెంటనే తెప్పించుకొని అమలు చేయాలన్నారు. తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ ల ఫ్రెండ్లీ ప్రభుత్వమని కొన్ని అత్యవసర సమస్యల వలన పెన్షనర్లను ఇబ్బందులు పరిష్కరించడం ఆలస్యమైందన్నారు. ఓ పక్షం రోజుల్లో ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్ల సమస్యను పరిష్కారం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్న రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి, కార్పొరేషన్ జాతీయ చైర్మన్ కృష్ణమోహన్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు జంగయ్య, సదయ్య, సోమయ్య, అశోక్ కుమార్, నాగిరెడ్డి, నిర్మల, జేఏసీ నాయకులు శుభాకర్ రావు, కృష్ణమూర్తి, రాజేంద్రబాబు, భరత్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, తులసి సత్యనారాయణ, నర్సింగ్గారావు, సీతారాం, ఓంప్రకాష్, రామారావు, సాయిరెడ్డి, నరసింహస్వామి, శివశరణప్ప పాల్గొన్నారు.

## స్వేచ్ఛను బ్రతికించటం కోసం ప్రాణాలు పణంగా పెడుతున్న పాలస్తీనా..



**విశ్వంభర, మహబూబ్‌నగర్ :** స్థానిక టీఎఫ్‌టీయూ కార్యలయంలో పాలస్తీనకు సంఘీభావంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ఖలీల్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం. రాఘవచారి, సామాజిక వేత్త హనీఫ్ అహమ్మద్, ఉర్దూ కవి బాబర్ షేక్, సలీం ముఖ్యవక్తలుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇజ్రాయిల్ దేశం గతంలో ఉనికిలో లేదని పాలస్తీనా పౌరులు దయదల్చి యూదులకు నివాసం ఇస్తే పాలస్తీనను ఆక్రమించుకుని మూలవాసులైన పాలస్తీన పౌరులపై అమానుసమైన దాడులకు పూనుకుంటున్నారని అన్నారు. ఇజ్రాయిల్ చేస్తున్న అమానవీయ దాడిని మానవజాతి గర్వించే విధంగా పాలస్తీనా వాసులు ఎదుర్కొంటున్న తీరు, విరోచిత పోరాటం శ్లాగనీయమన్నారు. తల్లుల ముందు పిల్లలు, పిల్లల ముందు తల్లులు మరణిస్తున్నా.. వెనకంజ వేయడం లేదన్నారు. భారత ప్రధానులు నెహ్రూ మొదలుకొని అటల్ బిహారీ వాజ్‌పేయి వరకు పాలస్తీలకు సంఘీభావంగా నిలబడ్డారని వారు గుర్తు చేశారు. ప్రస్తుతం దేశాన్ని పరిపాలిస్తున్న సంఘ పరివార్ ప్రేరేపిత ప్రభుత్వం పాలస్తీనా పోరాటాన్ని మత కోనం తోటి చూడడం విచారకరమన్నారు. ప్రజలు ఇజ్రాయిల్ ఉత్పత్తులను కొనరాదని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పీ విజయకుమార్, టీపీఎఫ్ నాయకులు బుచ్చారెడ్డి, చైతన్య మహిళా సంఘం నాయకురాలు శ్రీదేవి, మైనార్టీ నాయకులు మౌలానా ఇస్మాయిల్, ఇమాన్ కమిటీ నాయకుడు సలీం, మెహబూబలి ఫౌండేషన్ అధ్యక్షులు రహీమ్, మిర్జా సోయబ్ అలి, స్వీపర్ల సంఘం అధ్యక్షులు గట్టన్న, జలాల్ పాషా, అబ్దుల్ అజీజ్, బోయ కృష్ణ, సికందర్, ఎన్నారై అజీజ్, అబ్బాస్, మహమ్మద్ రఫీ, గులాం మొహమ్మద్, ముస్తాజ్ ఇమామ్, అబ్దుల్ రెహమాన్ బాడీ బిల్డర్ తదితరులు పాల్గొన్నారు.



## నూతన తహసిల్దార్ భవన నిర్మాణ పనులు పరిశీలన

**విశ్వంభర, కడ్తాల్ :** కడ్తాల్ మండల కేంద్రంలోని నూతనంగా నిర్మాణమవుతున్న ఎమ్మార్వో కార్యాలయ భవనం తుది దశకు చేరుకోవడంతో పెండింగ్ లో ఉన్న పనులను డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మార్వో ముంతాజ్ బేగం కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కర్తాల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మితమవుతున్న ఎమ్మార్వో భవనం పనులు తుది దేశ కు చేరుకున్నాయని త్వరలోనే పెండింగ్ లో ఉన్న పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే ధరణిలో పెండింగ్ ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్వో ను కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, మండల్ పార్టీ అధ్యక్షులు బీచ్యా నాయక్, జాంగిర్ అలీ, రాజేష్ పాల్గొన్నారు.



## ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో గ్రామపంచాయతీ ట్రాక్టర్

**విశ్వంభర, చింతపల్లి :** గ్రామీణ పల్లెలు పరిశుభ్రంగా ఉంచాలని ప్రభుత్వ సంకల్పానికి కొందరు గ్రామ పంచాయతీ సెక్రటరీలు నీరు కారుస్తున్నారు. గ్రామాల్లో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడం తోపాటు, హరితహారం, పల్లె ప్రకృతి వనం లాంటి మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాక్టర్లు నేడు ప్రైవేట్ పనులలో బిజీగా ఉన్నాయి. గ్రామ పంచాయతీ నిధులతో కొన్న ట్రాక్టరే కదా అని కొందరు తమ సొంత ట్రాక్టర్‌లా భావిస్తున్నట్లుంది. మేము ఏమి చేసినా నడుస్తుంది అనే కొందరు గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ప్రభుత్వ వనరులను ఉపయోగించి సొమ్ము చేసుకునే ప్రయత్నం, కొంత బంధు ప్రీతి చూపిస్తున్న సంఘటన మంగళవారం చింతపల్లి మండలంలో చోటుచేసుకుంది. నల్లగొండ జిల్లా చింతపల్లి మండల పరిధిలోని వర్కాల గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ప్రైవేట్ వ్యక్తుల పనులకు ఇష్టారాజ్యంగా మారింది. వర్కాల గ్రామ పరిధిలో వున్న ఓ కోళ్ల ఫారానికి అదే గ్రామానికి చెందిన వ్యక్తికి పంచాయతీ కార్యదర్శి పద్మ రెడ్డి గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంక్ తో నీళ్లను సరఫరా చేస్తుంది. మండల పరిషత్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఈ తంతు జరుగుతున్నా అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామ పంచాయతీ నిధుల నుంచి నెలవారీగా ఈఎమ్ఐ రూపంలో లోన్ చెల్లించింది. వర్కాల గ్రామ పంచాయతీ ట్రాక్టర్ మాత్రం బయట ప్రైవేట్ కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నా పట్టించుకునే నాథుడే లేకపోయారు. ఖర్చు ఏమో గ్రామపంచాయతీది లబ్ధి మాత్రం ప్రైవేట్ వ్యక్తులది. ఈ విషయంలో ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




# కేరళకు తమిళనాడు ఆపన్న హస్తం

**విశ్వంభర, చెన్నయ్ :** కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి 80 మందికిపైగా మృతి చెందారు. వందలాది మంది గాయాల పాలయ్యారు. ప్రకృతి ప్రకోపానికి గురైన కేరళ రాష్ట్రానికి తమిళనాడు ప్రభుత్వం ఆపన్నహస్తం అందించింది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ కేరళ రాష్ట్రానికి ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. సిఎం నిధుల కింద రూ. 5 కోట్లు విడుదల చేయాలని అధికారులను స్టాలిన్ ఆదేశించారు. కాగా, ఈ ఘటనపై స్టాలిన్, కేరళ సిఎం పినరయి విజయన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా మృతులకు ఆయన సంతాపం ప్రకటించారు. ఈ కష్టకాలంలో తమిళనాడు ప్రభుత్వం తరఫున అన్నివిధాలుగా సాయం చేస్తామని స్టాలిన్ హామీ ఇచ్చారు. అలాగే ఇద్దరు ఐఏఎస్ కేడర్ల నేతృత్వంలో రెస్క్యూటీమ్‌ను ఏర్పాటు చేశామని, ఆ టీమ్‌ను కేరళకు పంపిస్తున్నట్లు తెలిపారు. పది మంది వైద్యులు, నర్సులతో కూడిన ఓ వైద్య బృందాన్ని కూడా కేరళ రాష్ట్రానికి పంపిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు కర్ణాటక ప్రభుత్వం కూడా స్పందించింది. ఈ ఘటనపై కర్ణాటక సిఎం సిద్ధరామయ్య దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో కేరళ రాష్ట్రానికి అన్నివిధాలా సాయమందిస్తామని హామీ ఇచ్చారు.

## అమెరికాలో అభిమాని ఇంటి ముందు
# అమితాబ్ విగ్రహం

**పర్యాటక ఆకర్షణగా గుర్తించిన గూగుల్**



**విశ్వంభర, వాషింగ్టన్:** అమెరికా న్యూజెర్సీలోని ఎడిసన్ సిటీలోని ఇంటర్నెట్ సెక్యూరిటీ ఇంజనీర్ గోపి సేథ్ అనే భారతీయ వ్యక్తి నివాసముంటున్నాడు. తనతో పాటు అతడి కుటుంబానికి కూడా బిగ్‌బీ అంటే విపరీతమైన అభిమానం. అందుకే అతడు బిగ్‌బీ స్టైల్‌గా కూర్చున్న రూపంలో ఓ విగ్రహాన్ని తన ఇంటి ముందు ఆవిష్కరించాడు. ఆ విగ్రహాన్ని ఓ పెద్ద గ్లాస్ బాక్స్‌లో ఉంచారు. గ్రాండ్‌గా జరిగిన ఈ వేడుకకు దాదాపు 600 మంది హాజరై సందడి చేశారు. బాణాసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. డ్యాన్స్‌లు వేస్తూ సరదాగా గడిపారు. దీనికి సంబంధించిన ఫొటోలను గోపిసేత్ తన సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. "1991 న్యూ జెర్సీలోని నవరాత్రి ఉత్సవాల సమయంలో తొలిసారి బిగ్‌బీని కలిశాను. అప్పటి నుంచి ఆయనకు వీరాభిమానిని అయ్యాను. నాకు నా భార్యకు ఆయన దేవుడు లాంటి వారు. రీల్‌లైఫ్‌లోనే కాదు రియల్ లైఫ్‌లోనూ ఆయన మాట్లాడే విధానం, ఉండే విధానం నాలో ఎంతో స్ఫూర్తిని నింపింది. ఆయన ఉన్నత స్థాయికి ఎదిగిన ఒదిగి ఉండే మనిషి. తన అభిమానుల సంక్షేమాలు చూసుకుంటారు. మిగతా స్టార్స్‌లా కాదు ఆయన. ఎంతో ప్రత్యేకం. అందుకే నా ఇంటిముందు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశాం" అని గోపీ సేథ్ అన్నారు. కాగా ఎంతో మంది పర్యాటకులు ఆ విగ్రహాన్ని సందర్శించేందుకు అక్కడికి వెళుతున్నారు. ఆ విగ్రహం పక్కన నిలబడి ఫోటోలు తీయించుకుంటున్నారు. అమితాబ్ విగ్రహానికి పెరిగిన ఆదరణ కారణంగా గూగుల్ దాన్ని పర్యాటక ఆకర్షణ జాబితాలో చేర్చింది. గూగుల్ సెర్చ్ ద్వారా ప్రతిరోజూ ఎంతో మంది సందర్శకులు అక్కడికి వెళుతున్నారట. తమ ఇల్లు అమితాబ్‌కి ప్రపంచవ్యాప్తంగా ఎంత మంది అభిమానులు ఉన్నారో తెలియజేస్తోందంటున్నాడు. ఇక్కడికి వచ్చిన వారు తీసుకున్న ఫోటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చెయ్యడం వల్ల పర్యాటకుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందట.

# ప్రతి వారం రైలు ప్రమాదాలు

**పాలనంటే ఇదేనా : బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ**



**విశ్వంభర, కోల్‌కతా :** హౌరా నుంచి ముంబయి వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం తెల్లవారుజామున జార్ఖండ్‌లో పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మరణించగా.. మరో 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ప్రమాద ఘటనపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తనదైన శైలిలో ఎక్స్ వేదికగా స్పందించారు. ఆ క్రమంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఆమె తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. ఇదేనా పాలనా? ప్రతి వారం ఈ పీడ కలల పరంపర కొనసాగుతుంది. రైల్వే ట్రాక్ మీద చోటు చేసుకుంటున్న ఈ మరణాలు, ఈ గాయాల ఘటనలకు ముగింపు లేదా?.. దీనిని మనం ఎంత కాలం సహించాలి. భారత ప్రభుత్వ నిర్లక్ష్యానికి అంతం లేదా?.. ఇదేనా పాలనా అంటూ మోదీ ప్రభుత్వానికి ఆమె చురకలంటించారు. ఈ ప్రమాదంలో మృతుల కుటుంబాలను ఆమె తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే గాయాలపాలైన వారు వెంటనే కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు. దేశవ్యాప్తంగా ఇటీవల వరుసగా రైలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంటే నెలకి లేదా వారానికి ఒకటి చొప్పున దేశంలోని వివిధ ప్రాంతాల్లో రైళ్లు ఢీకొనడం కానీ.. రైలు పట్టాలు తప్పడం కానీ.. చోటు చేసుకుంటున్నాయి. ఆ యా ప్రమాదాల్లో భారీగా ప్రయాణికులు మరణిస్తున్నారు. పదుల సంఖ్యలో గాయాల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో మోదీ ప్రభుత్వంపై ప్రతిపక్షం ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు తీవ్రంగా మండిపడుతున్నారు.

# ఇంకా పెళ్లి చేసుకోలేదు

**• నాకు 100 మంది పిల్లలు • టెలిగ్రామ్ సీఈఓ పావెల్ దురోవ్**



**విశ్వంభర, వాషింగ్టన్:** పెళ్లి కాకుండానే తాను వంద మందికిపైగా పిల్లలకు తండ్రిని అయినట్లు టెలిగ్రామ్ సీఈఓ పావెల్ దురోవ్ సంచలన విషయాన్ని బయటపెట్టాడు. ప్రపంచవ్యాప్తంగా తన సంతానం విస్తరించి ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచంలోని 12 దేశాల్లో తనకు 100 మంది కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నారని పావెల్ దురోవ్ చేసిన వ్యాఖ్యలపై ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ చర్చ జరుగుతోంది. అయితే తాను అంత మంది పిల్లలకు ఎలా తండ్రిని అయ్యానో కూడా ఆయన పూర్తి వివరాలు వెల్లడించారు. తన టెలిగ్రామ్ ఛానెల్‌లో సుదీర్ఘ పోస్ట్ చేసిన పావెల్ దురోవ్.. తాను బయోలాజికల్‌గా అంత మంది పిల్లలకు తండ్రిని అయినట్లు చెప్పారు. 39 ఏళ్ల వయసు ఉన్న పావెల్ దురోవ్ ఇంకా పెళ్లి చేసుకోలేదు. కానీ తన వీర్యం ద్వారా ఇప్పటివరకే ప్రపంచంలోని ఎన్నో దేశాల్లో 100 మందికి పైగా పిల్లలకు తండ్రి అయ్యారు. అయితే 15 ఏళ్ల క్రితం తాను 24 ఏళ్ల వయసులో ఉన్నపుడు.. తన ఫ్రెండ్ చెప్పిన ఒక విషయంతో తాను ఈ వీర్య దానం చేయడం ప్రారంభించినట్లు పావెల్ దురోవ్ చెప్పారు. అయితే తన ఫ్రెండ్‌కు, అతని భార్యకు పిల్లలు పుట్టే అవకాశం లేదని ఆ సమయంలో డాక్టర్లు తేల్చి చెప్పారని, అయితే అదే విషయాన్ని తన ముందు ఉంచిన తన మిత్రుడు తనను వీర్య దానం చేయమని కోరినట్లు తెలిపారు. అయితే మొదట తన ఫ్రెండ్ చెప్పింది విని తాను ఆశ్చర్యపోయానని, సంతానం కోసం తనను వీర్య దానం చేయాలని కోరడంతో బాగా నవ్వుకున్నట్లు పావెల్ దురోవ్ వెల్లడించారు. ఆ తర్వాతే తనకు మెల్లమెల్లగా సంతానలేమి అనేది ఎంత పెద్ద సమస్య అనేది అర్థం అయిందని చెప్పారు. దీంతో తాను అప్పటి నుంచి వీర్యదానం చేయడం మొదలు పెట్టినట్లు ఆయన పోస్ట్‌లో తెలిపారు. ఆరోగ్యకరమైన వీర్యకణాలు దానం చేసేవారు చాలా తక్కువమంది ఉన్నారని తనకు ఓ డాక్టర్ చెప్పారని, అదే సమయంలో సంతానలేమితో బాధపడే భార్యా భర్తలు ఎంతో మంది ఉన్నారని తాను తెలుసుకున్నట్లు పావెల్ దురోవ్ పేర్కొన్నారు. దీంతో వీర్యాన్ని దానం చేసి సంతానం లేని దంపతులకు సాయం చేయడం మన సామాజిక బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. వెంటనే తాను స్పెర్మ్ డొనేషన్‌లో రిజిస్టర్ చేసుకున్నానని.. అలా అప్పటి నుంచి ఇప్పటివరకు 12 దేశాల్లో 100 మందికి పైగా దంపతులకు తన వీర్యంతో పిల్లలు కలిగేలా చేసినట్లు ఆయన వెల్లడించారు. అయితే తాను వీర్య దానం చేయడం ఆపేసి చాలా సంవత్సరాలు అవుతోందని.. కానీ అప్పుడు ఫ్రీజ్ చేసిన తన వీర్య కణాల ద్వారా ఎన్నో కుటుంబాలకు సంతానం కలిగిస్తున్నారని తెలుసుకుని తాను సంతోషపడినట్లు పావెల్ దురోవ్ చెప్పారు. అయితే ఇన్నేళ్ల తర్వాత ఈ విషయాన్ని బయటపెట్టడంతో వల్ల కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ.. ఇలా వీర్య దానంపై సమాజంలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని.. అందుకే దీన్ని బహిర్గత పరిచినట్లు పావెల్ దురోవ్ చెప్పారు. స్పెర్మ్ డోనర్ అయినందుకు తానం పశ్చత్తాపపడట్లేదని.. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచవ్యాప్తంగా సంతానలేమి సమస్య తీవ్రంగా వేధిస్తోందని ఆయన వెల్లడించారు. సంతానం లేక కుమిలిపోతున్న జంటలకు.. పిల్లలను అందించి వారికి సంతోషాలు కలిగించినందుకు తాను గర్వపడు తున్నట్లు చెప్పారు. మరింత ఎక్కువమంది వీర్యం దా నం చేసేందుకు ముందుకురావాలని తాను కోరుతున్నట్లు పావెల్ దురోవ్ తన టెలిగ్రామ్ ఛానెల్‌లో పేర్కొన్నారు.

## యాంటి లవ్ జిహాద్ బిల్లుకు
# యోగి సర్కార్ ఆమోదం


**దోషులకు ఇక యావజ్జీవం**



**విశ్వంభర, లక్నో:** ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర అసెంబ్లీ యాంటీ లవ్ జిహాద్, బలవంతపు, మోసపూరిత మత మార్పిడుల వ్యతిరేక బిల్లుకు ఆమోదం తెలిపింది. యూపీ మంత్రి సురేశ్ కన్నా ఈ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. 'లవ్ జిహాద్' పేరుతో కుట్ర పన్ని బలవంతంగా మత మార్పిడికి యత్నిస్తే 20 ఏళ్ల జైలు శిక్ష లేదా యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తామని యోగి ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటి వరకు లవ్ జిహాద్‌కు పాల్పడితే రూ. 50 వేల జరిమానాతోపాటు పదేళ్ల జైలు శిక్ష ఉండేది. కానీ, ఇకపై మరింత కఠినంగా వ్యవహరించాలని యోగి సర్కారు నిర్ణయించింది. ఈ క్రమంలోనే యాంటీ లవ్ జిహాద్ (మత మార్పిడి వ్యతిరేక) బిల్లులో శిక్ష కాలం పెంచుతూ సవరణలు చేసి అసెంబ్లీలో ఆమోదింపచేసింది. అంతేగాక, లవ్ జిహాద్ కు పాల్పడినట్లు ఇప్పటి వరకు నేరుగా బాధితులు గానీ, బాధిత కుటుంబం కానీ ఫిర్యాదు చేస్తేనే చర్యలు తీసుకునేవారు. ఇకపై ఈ నిబంధనలో కూడా సవరణ చేశారు. బలవంతపు మత మార్పిడులపై ఎవరు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకునేలా చట్టంలో మార్పులు చేశారు. పోలీసులకు లిఖితపూర్వకంగా కన్వర్షన్లపై ఫిర్యాదు చేయవచ్చు. లవ్ జిహాద్ కేసులను నాన్ బెయిలబుల్ కేసులుగా పరిగణించాలని యోగి ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, యాంటీ లవ్ జిహాద్ బిల్లుకు సంబంధించిన ఆర్డినెన్స్ నవంబర్ 2020న విడుదల చేశారు. ఇప్పుడు అసెంబ్లీ ఆమోదంతో యాంటీ లవ్ జిహాద్ చట్టం 2021ని తక్షణమే అమల్లోకి తీసుకురానుంది. హిందూ యువతులే లక్ష్యంగా ప్రేమ ముసుగులో వివాహం చేసుకుని ముస్లిం మతంలోకి మార్చే కుట్ర (లవ్ జిహాద్) దేశంలో జరుగుతోందని బీజేపీ గత కొంతకాలంగా పేర్కొంటున్నది.

# పట్టాలు తప్పిన ముంబయి హావ్‌డా ఎక్స్‌ప్రెస్

**• 18 బోగీలు బోల్తా • ఇద్దరు మృతి.. 20 మందికి గాయాలు**



**విశ్వంభర, జార్ఖండ్ :** జార్ఖండ్‌లోని చక్రధర్‌పూర్‌లో మంగళవారం తెల్లవారుజామున 3:45గంటల ప్రాంతంలో హావ్‌డా-ముంబయి ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. రైలుకు చెందిన 18 బోగీలు చెల్లాచెదురయ్యాయి. ఈ ఘటనలో ఇద్దరు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. హూటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న సహాయక బృందాలు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. మిగతా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఈ దుర్ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు, స్వల్ప గాయాలైన వారికి లక్ష రూపాయల చొప్పున పరిహారాన్ని రైల్వే అధికారులు ప్రకటించారు. ప్రమాదం నేపథ్యంలో హావ్‌డా-టిట్లాగఢ్-కాంటాబాంజీ ఇస్పత్ ఎక్స్‌ప్రెస్, హావ్‌డా-బార్బిల్ జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మరికొన్ని రైళ్లను దారి మళ్లించినట్లు వెల్లడించారు. ఘటనా స్థలానికి కొంతదూరంలో మరో గూడ్స్ రైలు కూడా పట్టాలు తప్పినట్లు అధికారులు తెలిపారు. ఈ రెండు ప్రమాదాలూ ఒకేసారి జరిగాయా అనే విషయంలో ఇంకా స్పష్టత లేదని చెప్పారు. గూడ్స్ రైలు పట్టాలు తప్పిన చోట ప్రమాద తీవ్రతను అంచనా వేయాల్సి ఉందన్నారు.

## ప్రచారంలో
# కమలా హారిస్ దూకుడు

**3.60 లక్షల మంది వాలంటీర్ల మద్దతు**

**విశ్వంభర, వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష పోటీకి సిద్ధమవుతున్న ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. మాజీ అధ్యక్షుడు ట్రంప్‌ను ఎదుర్కొనేందుకు డెమోక్రాట్ల నుంచి విశేషణ ఆదరణ లభిస్తోంది. ఇప్పటికే భారీ మొత్తంలో విరాళాలు వెల్లువెత్తుతుండగా, ప్రచార పర్వంలో తాజాగా 3.60 లక్షల మంది వాలంటీర్లు చేరడం విశేషం. కమలా హారిస్ ప్రచారంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. రోజురోజుకు విశేష ఆదరణ లభిస్తోంది. ఒక వారంలోనే 200 మిలియన్ల డాలర్ల విరాళాలు సేకరించాం. అయితే ఇందులో మూడిరట రెండు వంతుల విరాళాలు కొత్త మద్దతుదారుల నుంచే అందాయి. ప్రచార పర్వంలో తాజాగా 3.60 లక్షల మంది భాగమయ్యారు అని హారిస్ ఫర్ ప్రెసిడెంట్ బాటిల్‌గ్రౌండ్ స్టేట్స్ డైరెక్టర్ డాన్ కన్నీఎన్ వెల్లడించారు.




## 12 మంది విద్యార్థుల ఆచూకీ తెలియడం లేదు..

**ఎంపీ సంచలన వ్యాఖ్య**

**విశ్వంభర, న్యూఢిల్లీ:** ఓల్డ్ రాజేంద్ర నగర్‌లోని ఐఏఎస్ కోటింగ్ సెంటర్‌లోని సెల్లార్‌ను వరద నీరు ముంచెత్తి ముగ్గురు విద్యార్థుల మృతి చెందిన ఘటన తీవ్ర సంచలనం సృష్టించిన నేపథ్యంలో లోక్‌సభ ఎంపీ పప్పు యాదవ్ మంగళవారంనాడు కీలక వ్యాఖ్య చేశారు. కోచింగ్ సెంటర్‌లోని 10 నుంచి 12 మంది విద్యార్థుల జాడ ఇప్పటికీ తెలియకుండా ఉందని అన్నారు. "కోచింగ్ సెంటర్‌లో మృతి చెందిన విద్యార్థులు ముగ్గురు మాత్రమే కాదు. ఆరుగురు మిస్సింగ్ విద్యార్థుల లిస్ట్ కూడా ఉంది. అయితే కనీసం 10 నుంచి 12 మంది ఆచూకీ గల్లంతయినట్టు నేను అనుకుంటున్నాను. వాస్తవాలను దాచిపెట్టేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి" అని యాదవ్ పేర్కొన్నారు. దేశంలో కోచింగ్ సంస్థల విషయంలో ఎలాంటి దూరదృష్టి లేదని, ఎలాంటి గైడ్‌లైన్స్ లేవని పప్పు యాదవ్ అన్నారు. కోచింగ్ సంస్థలను నియంత్రించేందుకు ప్రభుత్వం చట్టం తేవాలని సూచించారు. విద్యార్థులకు ఎక్కడా భద్రత లేదని, వంచనకు గురవుతున్నారని ఆయన తెలిపారు. కోటలో 900 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని, బీహార్ నుంచే అత్యధికంగా 60 శాతం విద్యార్థులు చదువుల కోసం బెంగళూరు, కోట, ఢిల్లీ వెళ్తున్నారని, యూపీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే వారిలో ఎక్కువ మంది బీహార్ విద్యార్థులే ఉంటున్నారని చెప్పారు. బీహార్ ప్రజలు ఇతర రాష్ట్రాల్లో తమ పిల్లల చదువులకు రూ.40,000 కోట్లు ఖర్చు చేస్తున్నారని, ప్రభుత్వం మాత్రం వారి భద్రతపై ఎలాంటి దృష్టి పెట్టడం లేదని విమర్శించారు.



# ఏపీలో అమలవబోతున్న మరో కొత్త పథకం



- మహాశక్తి పథకంలో సంవత్సరానికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు
- త్వరలో అమలు తేదీ ప్రకటన

**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబునాయుడు సారథ్యంలో జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీల్లో ఇచ్చిన విధంగా సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ప్రయత్నం చేస్తోంది. దీనిలో భాగంగా పెంచిన పింఛన్లతోపాటు అన్న క్యాంటిన్లు ప్రారంభమయ్యాయి. వచ్చేనెల 15వ తేదీ నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించే అవకాశం ఉంది. స్త్రీలకు నెలకు రూ.1500 అందించే పథకంపై కసరత్తు జరుగుతోంది. మహాశక్తి పథకంలో భాగంగా సంవత్సరానికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను అందిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రకటించారు. దీన్ని త్వరలోనే అమలు చేయబోతున్నారు. ఈ పథకానికి ఎవరు అర్హులు, ఏ పత్రాలు కావాలి అనే విషయాలను తెలుసుకుందాం.

### దారిద్ర్యరేఖకు దిగువన ఉండాలి..

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు దీపం యోజన పథకం కింద నెలకు మూడు ఉచిత సిలిండర్లు అందజేయాలని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని పొందాలనుకునేవారు రాష్ట్రవాసులై ఉండాలి. ఇంటికి ఒక గ్యాస్ కనెక్షన్ మాత్రమే ఉండాలి. ఒకటి కంటే ఎక్కువ ఉంటే ఈ పథకానికి అనర్హులు. ఆధార్ కార్డుతో లింకైన ఫోన్ నెంబరు, విద్యుత్తు బిల్లు, ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ పత్రాలు, ఫొటో ప్రూఫ్, చిరునామా ధ్రువీకరణ పత్రాలు అవసరమవుతాయి. త్వరలోనే దీనికి సంబంధించిన దరఖాస్తులు స్వీకరించబోతున్నారు. ఏ తేదీ నుంచి అనే విషయమై ప్రభుత్వం త్వరలోనే ప్రకటన చేయబోతోంది.

### ఇంటింటికీ స్క్రీనింగ్ పరీక్షలు..

వచ్చేనెల 15వ తేదీ నుంచి మరో పథకాన్ని ఏపీ ప్రభుత్వం ప్రారంభించబోతోంది. రాష్ట్రంలో క్యాన్సర్ రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతో రాష్ట్ర బడ్జెట్ లో దీనికోసం ప్రత్యేకంగా దాదాపు 800 కోట్ల రూపాయలకు పైగా కేటాయించారు. 15వ తేదీ నుంచి ఇంటింటికీ తిరిగి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. దీనిద్వారా క్యాన్సర్ మొదటిదశలోనే గుర్తించి వెంటనే చికిత్స అందించవచ్చు. క్యాన్సర్ స్టేజ్ పెరుగుతుంటే వీరిని గుంటూరు, కర్నూలు, విశాఖపట్నం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యాన్సర్ కేంద్రాలకు పంపిస్తారు.

# శ్రీశైలం జలాశయానికి భారీగా వరద..

## ఏడుగేట్లు ఎత్తివేత..

**విశ్వంభర, శ్రీశైలం:** ఎగువ నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద ప్రవాహం కొనసాగుతున్నది. దాంతో అధికారులు ఏడుగేట్లు ఎత్తి 1.86లక్షల క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యామ్‌కు 4.02లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా.. అవుట్ ఫ్లో 2.50లక్షల క్యూసెక్కులుగా ఉన్నది. డ్యామ్ గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం నీటిమట్టం 883.50 అడుగులు ఉన్నది. జలాశయం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 215.8 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం నిల్వ 207.41 టీఎంసీలు ఉన్నది.కుడి, ఎడమగట్లలోని జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. ఎగువ నుంచి మరింత వరద కొనసాగితే మరిన్ని గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు డ్యామ్‌కు వస్తున్న వరదను పరిశీలిస్తున్నారు. మరో వైపు శ్రీశైలం జలాశయం డ్యామ్ గేట్లు ఎత్తివేయడంతో శ్రీశైలం రహదారులన్నీ పర్యాటకులతో సందడిగా మారాయి. హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు శ్రీశైలం బాటపడుతున్నారు.



# యూటర్న్ సీఎంగా గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కుతారు

- చంద్రబాబు డాంభికాలు పలికారు.. అవి అప్పులని తేలింది
- ఇచ్చిన హామీలను అమలు చేయని మోసగాడు
- భూముల సర్వేపై కనీస జ్ఞానం కూడా లేదు
- చంద్రబాబుపై అంబటి రాంబాబు సెటైర్లు



**విశ్వంభర, తాడేపల్లి :** యూటర్న్ సీఎంగా చంద్రబాబు గిన్నిస్ బుక్ రికార్డుల్లోకి ఎక్కుతారని మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే చంద్రబాబు అనేక విషయాల్లో యూటర్న్ తీసుకున్నారని ఆరోపించారు. తాడేపల్లిలోని వైసీపీ ప్రధాన కార్యాలయంలో అంబటి రాంబాబు మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు అబద్ధంలోనే పుట్టాడని.. అబద్ధంలోనే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధి కోసం కేంద్ర బడ్జెట్‌లో రూ.15వేల కోట్లు కేటాయించింది మొత్తం అప్పు మాత్రమేనని బీజేపీ నేత జీవీఎల్ నరసింహారావు చేసిన వ్యాఖ్యలపై అంబటి రాంబాబు ప్రస్తావించారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి రూ.15వేల కోట్ల గ్రాంట్ వచ్చిందని చంద్రబాబు డాంభీకాలు పలికారని.. తీరాచూస్తే అవి అప్పులని తేలిందని విమర్శించారు. రూ.4వేల పెన్షన్ మొదటి నెల ఇచ్చారు కానీ ఇక నుంచి అనర్హుల పేరుతో ఎగ్గొట్టబోతున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ తలచుకుంటే భయమేస్తోందని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయని మోసగాడు చంద్రబాబు అని అంబటి రాంబాబు విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేసిన మొనగాడు జగన్ అని తెలిపారు.చంద్రబాబుకు భూముల సర్వేపై కనీస జ్ఞానం కూడా లేదని అంబటి రాంబాబు విమర్శించారు. బ్రిటీష్ కాలం నుంచి భూముల సర్వే జరగలేదని.. అందుకే భూ సమస్యలు ఉండకూదని కేంద్రం భూసర్వే చేయిస్తోందని చెప్పారు. హక్కుదారులకే భూమి ఉండాలని తమ ప్రభుత్వం భావించిందన్నారు. 14,630 మంది సర్వేయర్లతో సర్వే చేయించామని స్పష్టం చేశారు.వైసీపీలో నంబర్ టూ అంటూ జరుగుతున్న ప్రచారంపై అంబటి రాంబాబు మండిపడ్డారు. వైసీపీలో నంబర్ టూ ఉండదని.. పార్టీలో ఏకైక నాయకుడు జగన్ మాత్రమే అని అన్నారు. తామంతా జగన్ వెంటే ఉంటామని.. జగన్ చెప్పింది చేయడమే తమ పని స్పష్టం చేశారు. గతంలో వైసీపీపై అనేక కుట్రలు చేసినా జగన్ ఛేదించి గెలిచారని గుర్తుచేశారు. తమ పార్టీపై ఎన్ని కుట్రలు చేసినా బెదిరేది లేదని స్పష్టం చేశారు. తమ కార్యకర్తలు, నాయకులపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఫలితం ఉండదని అన్నారు.




# తిరుమల హొటళ్లలో డస్ట్ బిన్ల వ్యవస్థ తప్పనిసరి

- తడి, పొడి చెత్త సేకరించాలి
- లైసెన్ పొందినవారు సబ్ లీజుకు ఇవ్వొద్దు
- ఏపీటీడీసీ హొటళ్లపై ఈవో సమీక్షా

**విశ్వంభర, తిరుమల :** తిరుమలకు వచ్చే భక్తులకు హొటళ్లలో పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారం అందించాలని టీటీడీ ఈవో జె. శ్యామలరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. తిరుపతి పద్మావతి విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో పెద్ద, జనతా క్యాంటీన్లు, ఏపీటీడీసీ హొటళ్లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. హొటళ్లతో సహా అన్ని తినుబండారాల విక్రయ ప్రాంతాలలో వ్యర్థాలను తొలగించేందుకు రెండు డస్ట్ బిన్ల వ్యవస్థను నిర్వహించాలని తెలిపారు. భక్తుల నుంచి అభిప్రాయాన్ని పొందడానికి ఫిర్యాదులు, సూచనల పెట్టెను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని హొటళ్లలో చెత్తను తడిచెత్త, పొడి చెత్తగా సేకరించాలన్నారు. హొటళ్ళు ఆహార పదార్థాల ధరలతో ప్రదర్శన బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హొటల్ లైసెన్స్ పొందిన వారు వాటిని ఎటువంటి సబ్ లీజుకు ఇవ్వరాదని, సవరించిన ధరలను రెవెన్యూ విభాగానికి అందజేయాలని సూచించారు. వాటర్ బాటిళ్లను రూ.20కి మించి అమ్మకూడదని, తనిఖీ సమయంలో నిర్దేశించిన మార్గదర్శకాలను ఉల్లంఘించినట్లు తేలితే, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవోలు , జేఈవోలు, తదితరులు పాల్గొన్నారు.



# పవన్ కళ్యాణ్‌కు హైకోర్టులో బిగ్ రిలీఫ్..!

- వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యల కేసు విచారణ నాలుగు వారాల వాయిదా
- కేసును పోలీసులు కొనసాగిస్తేనే తదుపరి చర్యలుంటాయన్న హైకోర్టు

**విశ్వంభర, హైదరాబాద్ :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు హైర్టులో మంగళవారం పెద్ద ఊరట లభించింది. గత ప్రభుత్వంలో పవన్ పై నమోదైన ఓ కేసులో హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పవన్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పై హైకోర్టు తన నిర్ణయం వెలువరించింది. గతంలో పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై వాలంటీర్ల ఫిర్యాదు మేరకు వైసీపీ ప్రభుత్వం ఈ కేసు నమోదు చేసింది. దీనిపై హైకోర్టు మంగళవారం ఊరట కల్పించింది. గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో వాలంటీర్లపై పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో 30 వేల మంది యువతులు అదృశ్యమయ్యారని, వాలంటీర్లు వైసీపీ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సేకరించిన డేటాయే ఇందుకు కారణమని పవన్ ఆరోపించారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం వాలంటీర్లతో ఫిర్యాదులు చేయించింది. దీంతో వాలంటీర్ల ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు పవన్ కళ్యాణ్‌పై కేసు నమోదు చేశారు. దీనిపై గుంటూరు కోర్టులో విచారణ జరుగుతోంది. దీంతో ఈ కేసును క్వాష్ చేయాలని కోరుతూ పవన్ కళ్యాణ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుపై విచారణ జరిపిన హైకోర్టు.. గుంటూరు కోర్డులో విచారణపై స్టే విధించింది. ఈ కేసు తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేస్తూ హైకోర్టు ఆదేశాలు ఉత్తర్వులు ఇచ్చింది. మరోవైపు పవన్ కళ్యాణ్ అప్పట్లో చేసిన వ్యాఖ్యలపై నమోదు చేసిన కేసును పోలీసులు కొనసాగిస్తేనే హైకోర్టు తదుపరి చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది. కానీ గత ప్రభుత్వం ఈ మేరకు కేసుల నమోదుకు ఇచ్చిన జీవోను కూటమి సర్కార్ వెనక్కి తీసుకుంటుందని లాయర్లు కోర్టుకు తెలిపారు.

# విజయవాడ వాసులకు శుభవార్త

- త్వరలో కెనాల్ బోటింగ్ ప్రారంభించనున్న నగరపాలక సంస్థ
- పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రణాళికలు



**విశ్వంభర, విజయవాడ :** ఏపీలో విజయవాడ వాసులకు ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. నగరంలో పర్యాటక ప్రాంతాలు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో వాటిని అభివృద్ధి చేయకపోవడం, స్థానికంగా ప్రజలు సేదతీరేందుకు అనువైన ప్రదేశాలు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో నగరంలో పర్యాటకులతో పాటు స్థానికులనూ ఆకట్టుకునేందుకు నగరపాలక సంస్థ త్వరలో కెనాల్ బోటింగ్ ప్రారంభించనుంది. పర్యాటకులను ఆకర్షించేందుకు కెనాల్ బోటింగ్ కోసం ప్రణాళిక రూపొందించాలని కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం అధికారుల్ని ఆదేశించారు. పర్యాటకులను ఆకట్టుకునేలా కెనాల్ బోటింగ్ ప్లాన్ ఉండాలని సూచించారు. బందర్, ఏలూరు, రైవస్ కాలువలను సుందరీకరించడం, విజయవాడ సందర్శకులను మరింత ఆకట్టుకునేలా చేయడం ఈ కార్యక్రమం లక్ష్యం. ఈ మేరకు కాలువల్ని సుందరీకరించి బోటింగ్ కు అవకాశం కల్పిస్తారు. మంగళవారం వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర కాలువలను సందర్శించి పర్యాటకులను ఆకట్టుకునేలా బోటింగ్ ప్రణాళికను అంచనా వేసి రూపకల్పన చేశారు. కాలువలకు ఇరువైపులా పచ్చదనాన్ని పెంపొందించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పాలని ఆయన సూచించారు. కాల్వల్లో వ్యర్థాలను పారవేయడాన్ని పర్యవేక్షించడానికి, నిరోధించడానికి డ్రోన్‌లను ఉపయోగించాలని, ఉల్లంఘించినవారికి జరిమానాలు విధించాలని ఆయన ఆదేశించారు. నగరంలో కృష్ణా కాలువల నీరు సమీప గ్రామాలకు తాగునీరుగా ఉపయోగపడుతుందని, కాబట్టి ప్లాస్టిక్ వ్యర్థాలు నీటిలోకి చేరకుండా తేలే పైపులను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే కాలువల నుండి వ్యర్థాలను సేకరించి తొలగించడానికి నెట్‌లు, కన్వేయర్ బెల్ట్‌లను వాడాలన్నారు.

# కోల్పోయినా చోటే తిరిగి సంపాదించాడు

ఆ ఒక్క సంఘటనతో ఒలింపిక్ విజేతగా నిలిచి మనుభాకర్‌తో కలిసి షూటింగ్ లో కాంస్య పతకం సాధించిన సరబ్ జోత్ సింగ్

**విశ్వంభర(స్పోర్ట్స్):** పడి లేచిన కెరటం అతడు. కోల్పోయినా చోటే తిరిగి సంపాదించుకున్నాడు. 3 రోజుల క్రితమే ఒలింపిక్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్ తుది పోరులో బెర్త్‌ను త్రుటిలో కోల్పోయాడు. కానీ పోరాటాన్ని వదల్లేదు. అవకాశం ఉన్న మిక్స్‌డ్ విభాగంపై పూర్తిగా దృష్టి సారించాడు. చివరికి తాను అనుకున్నది సాధించి ఔరా అనిపించాడు. అతడే సరబజ్యోత్ సింగ్. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో మను బాకర్–సరబ్ జోత్ సింగ్ జోడీ దక్షిణ కొరియా జట్టును 16–10 తేడాతో ఓడించి భారత్‌కు రెండో పతకాన్ని అందించింది. ఈ నేపథ్యంలో సరబ్‌జోత్ సింగ్ వ్యక్తిగత, క్రీడా విషయాల గురించి ఈ స్టోరీలో తెలుసుకుందాం. మూడో షూటర్‌గా రికార్డు - 10మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగంలో దక్షిణ కొరియా జట్టును మట్టికరించడం వల్ల అరుదైన ఘనతను సరబజ్యోత్ సింగ్ సాధించాడు. ఎయిర్ పిస్టర్ ఈవెంట్‌లో గగన్ నారంగ్, విజయ్ కుమార్ తర్వాత పతకం సాధించిన మూడో భారత షూటర్‌గా నిలిచాడు. గగన్ నారంగ్ కాంస్య పతకం గెలిచిన 2012 జులై 30 నాటి నుంచి కచ్చితంగా 12 ఏళ్ల తర్వాత అదే తేదీన సరబ్ జోత్ సింగ్ విజయం సాధించడం గమనార్హం.



### రైతు కుటుంబంలో పుట్టి- ఎయిర్ పిస్టల్‌పై ఆసక్తి..

సరబ్‌జోత్ సింగ్ హరియాణలోని అంబాలా సమీపంలోని ధేన్ గ్రామంలో 2001లో పుట్టాడు. సరబ్ తల్లిదండ్రులు జతీందర్ సింగ్, హర్దీప్ కౌర్. అతడి తండ్రి వ్యవసాయం చేసేవాడు. చిన్ననాటి నుంచి ఫుట్ బాలర్ కావాలని సరబ్ కలలు కనేవాడు. వయసు పెరుగుతున్న కొద్ది అతడి లక్ష్యాలు క్రమంగా మారాయి. 13 ఏళ్ల వయసులో ఓసారి సమ్మర్ క్యాంప్‌లో పిల్లలు పేపర్ టార్గెట్లను గురిపెట్టడం చూసి పిస్టల్ షూటింగ్ పై ఆసక్తి పెంచుకొన్నాడు. ఆ తర్వాత పిస్టల్ షూటింగ్‌పై దృష్టి పెట్టాడు. పిస్టల్ షూటింగ్ ఖరీదైన ఆట కావడం వల్ల సరబ్‌ను ప్రోత్సహించేందుకు అతడి తల్లిదండ్రులు ఆలోచించారు. కానీ, సరబ్ జోత్ వారికి నచ్చజెప్పాడు. దీంతో వారు కుమారుడి కోరికను, ఆసక్తిని వద్దనలేకపోయారు. తొలుత జిల్లా స్థాయిలో రజత పతకం సాధించడం వల్ల కుమారుడిలో ప్రతిభ ఉందని గుర్తించారు. ఈ విజయం సరబ్ జోత్ జీవితాన్ని మలుపు తిప్పింది. అభిషేక్ రాణా పర్యవేక్షణలో ప్రొఫెషనల్ కోచింగ్‌లో చేరాడు. చండీగఢ్ డీఏవీ కళాశాలలో సరబ్ జోత్ చదివాడు. అంబాలాలోని ఏఆర్ షూటింగ్ అకాడమీలో సరబజ్యోత్ శిక్షణ జరిగింది.

### సరబ్ జ్యోత్ రికార్డులు..

2019 జూనియర్ వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో స్వర్ణ పతకం సాధించాడు. అలాగే సీనియర్ ర్యాంకింగ్స్‌లోకి సరబ్ జోత్ అడుగుపెట్టాడు. ఇది సరబజ్యోత్ కెరీర్‌లో చాలా కీలకమైన అడుగు. అంతేకాకుండా వ్యక్తిగత విభాగం, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రజత పతకాలను సాధించాడు. అదే ఏడాది దోహాలో జరిగిన ఆసియా ఛాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్‌ను సాధించాడు. 2022లో జరిగిన 65వ జాతీయ షూటింగ్ ఛాంపియన్ షిప్‌లో రెండు స్వర్ణాలను సాధించాడు.%వూ%2023 ఆసియా ఛాంపియన్ షిప్స్‌లో కాంస్య పతకం సాధించి ఒలింపిక్స్ లో బెర్త్ ఖరారు చేసుకున్నాడు. తాజాగా మను బాకర్‌తో కలిసి దక్షిణ కొరియా జట్టును 16–10 తేడాతో ఓడించి భారత్‌కు పతకాన్ని అందించాడు.



# సూపర్ ఓవర్లో విజయం..

## సిరీస్ క్లీన్ స్వీప్ చేసిన భారత్

**విశ్వంభర, పల్లెకెలె:** సూపర్ ఓవర్ దారి తీసిన మూడో టీ20 మ్యాచ్లో భారత్ విజయం సాధించి సిరీస్ ను క్లీన్ స్వీప్ చేసింది. సూపర్ ఓవర్లో తొలుత బ్యాటింగ్ చేసిన లంక మూడు బంతుల్లో కేవలం రెండు పరుగులే చేసి 2 వికెట్లు కోల్పోయింది. వాషింగ్టన్ సుందర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అనంతరం బ్యాటింగుకు దిగిన భారత్.. సూర్య తొలి బంతికే ఫోర్ కొట్టడంతో విజయం సాధించింది. సూపర్ ఓవర్ కు ముందు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. శ్రీలంక 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 137 పరుగులు చేయడంతో మ్యాచ్ టై అయ్యింది.

# ఆదుకోండి.. బతికించండి

## గాయని సాయి పావని



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలుగు శ్రోతలను తన గాన మాధుర్యంతో రెండున్నర దశాబ్దాలుగా అలరిస్తున్న సాయి పావని భర్త ఎల్లోరా సురేశ్ గుండెపోటుతో కోమాలోకి వెళ్లారు. కొన్ని నెలలుగా ఖైరతాబాద్లోని వాసవీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన పూర్తిగా కోలుకోవడానికి రూ. 10 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. మానవతా దృక్పథంతో దాతలు సహాయం చేయాలని గాయనీ సాయి పావని కోరుతున్నారు.

# నిలకడగా లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

### లాభాల్లో ఆటో, ఎనర్జీ రంగాల షేర్లు




**విశ్వంభర (బిజినెస్) :** దేశీయ స్టాక్ మార్కెట్లు ఒడిదొడుకులు ఉన్నప్పటికీ చివరికి లాభాల్లో ప్రయాణాన్ని ముగిం చాయి. ఈ క్రమంలో ఆటో, ఎనర్జీ రంగాలకు చెందిన షేర్లు లాభపడ గా, ఎఫ్ఎంసీజీ స్టాక్స్ మాత్రం మార్కెట్లను నష్టాల్లోకి లాగాయి. మార్కెట్ల ముగింపు సమయంలో బెంచ్ మార్క్ సూచీ సెన్సెక్స్ 100 పాయింట్లు లాభపడగా మరో కీలక సూచీ నిఫ్టీ 21 పాయింట్ల మేర పెరుగుదల ను చూసింది. ఇదే క్రమంలో నిఫ్టీ బ్యాంక్ సూచీ 93 పాయింట్లు పెరగగా, నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీ 261 పాయింట్ల పెరుగుదలను నమోదు చేసింది. ఈ క్రమంలో మిడ్ క్యాప్ సూచీ 0.3 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 0.9 శాతం పెరుగుదలను నమోదు చేసింది. హెల్త్ కేర్, ఎఫ్ఎంసీజీ రంగాలు మినహా మంగళవారం అన్ని రంగాలు లాభాల్లో ముగింపును చూశాయి. ఎన్ఎస్ఈలో టాటా మోటార్స్, ఎన్టీపీసీ, బీపీసీఎల్, పవర్ గ్రిడ్, టైటాన్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫిన్ సర్వ్, అదానీ ఎంటర్ ప్రైజెస్, కోల్ ఇండియా, ఇండస్ఇండ్ బ్యాంక్, మారుతీ, టాటా స్టీల్, హెచ్డీఎఫ్సీ బ్యాంక్, టెక్ మహీం ద్రా, జేఎస్డబ్ల్యూ స్టీల్, ఇన్ఫోసిస్, హీరో మోటార్స్, ఎల్ టి, అల్ట్రాటెక్ సిమెంట్స్, అదానీ పోర్ట్స్ కంపెనీల షేర్లు లాభాలతో టాప్ గెయినర్లుగా నిలిచాయి. ఇదే క్రమంలో ఎల్ టిఐఎమ్, ఎస్బీఐ లైఫ్, సిప్లా, గ్రాసిమ్, సన్ ఫార్మా, ఐటీసీ, శ్రీరామ్ ఫైనాన్స్, బ్రిటానియా, హిందాల్కో, ఎయిర్ టెల్, హిందుస్థాన్ యూనీలివర్, టీసీఎస్, డాక్టర్ రెడ్డీస్, రిలయన్స్, టాటా కన్జూమర్, అపోలో హాస్పిటల్స్, విప్రో, కోటక్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, నెస్లే కంపెనీల షేర్లు నష్టాలతో టాప్ లూజర్లుగా మంగళవారం తమ ప్రయాణాన్ని ముగించాయి.

# వయనాడ్‌లో విలయం..

**వయనాడ్:** ప్రకృతి ప్రకోపానికి కేరళలోని వయనాడ్ జిల్లా అతలాకుతలమైంది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని మెప్పడి సమీపంలో మంగళవారం తెల్లవారుజామున కొండ చరియలు విరిగిపడి.. సుమారు 125 మంది సమాధి అయ్యారు. ఈ ప్రకృతి విలయంలో మృతు ల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఆ ప్రాంతం లోని గ్రామాలకు గ్రామాలే వరద ప్రవాహానికి తుడిచిపెట్టుకుపోయాయి. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న వందలాది మంది వలస కార్మికులు గల్లంతైనట్లు తెలుస్తోంది. ముండకై , చూరల్ మాలా , అత్తమాల, నూల్‌పుజా గ్రామాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముండకై ప్రాం తంలోని విస్తారమైన టీ, కాఫీ, యాలకుల తోటల్లో పనిచేసేందుకు పలు రాష్ట్రాల నుంచి కార్మికులు తరలివస్తుంటారు. ఇలా పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాల నుంచి 600 మంది కార్మికులు ముందక్కా యి ప్రాంతానికి వచ్చి అక్కడే నివాసం ఉంటు న్నారు. వీరంతా హారిసన్స్ మలయాళం ప్లాంటేషన్ లిమిటెడ్‌లో పనిచేస్తున్నారు. అయితే, కొండచరియలు విరిగిపడిన అనంతరం వారందరి ఆచూకీ కనిపించకుండా పోయింది.

### మొబైల్ ఫోన్ నెట్‌వర్క్ దెబ్బతినడంతో మరింత సమస్య

రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడానికి తోడు మొబైల్ నెట్‌వర్క్ కూడా పనిచేయకపోవడంతో కార్మికుల ను చేరుకోలేకపోతున్నట్లు కంపెనీ అధికారి ఒకరు తెలిపారు. హెచ్ఎమ్ఎల్ జనరల్ మేనేజర్ బెనిల్ జాన్ మాట్లాడుతూ.. 'మా కార్మికులతో ఇప్పటి వరకూ సంప్రదించలేకపోయాం. దీనికి తోడు మొబైల్ ఫోన్ నెట్‌వర్క్‌లు కూడా పనిచేయడం లేదు' అని తెలిపారు. మరోవైపు ఆ ప్రాంతంలో 65 కుటుంబాలు నివసించే నాలుగు లైన్ ఇళ్లు విపత్తులో కొట్టుకుపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ కంపెనీకి చెందిన ఐదుగురు సిబ్బంది మృతదేహాలను రెస్క్యూ టీమ్ వెలికితీసింది. ఆ మృతదేహాలు కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ గిరీష్, ఆయన భార్య, మరో ముగ్గురు కార్మికులవిగా హారిసన్స్ మలయాళం లిమిటెడ్ జనరల్ మేనేజర్ బెనిల్ జోన్స్ తెలిపారు. హెచ్ఎంఎల్ గ్రూపు ఆధ్వర్యంలోని సెంటినెల్ రాక్ ఎస్టేట్‌లోని తొమ్మిది మంది కొట్టుకుపోయాయినట్లు ఆయన వెల్లడించారు.

### కొనసాగుతున్న సహాయ చర్యలు

ఘటనా స్థలంలో కేరళ రాష్ట్ర విపత్తు స్పందన దళం–కెఎస్డీఎంఎ, అగ్నిమాపక బృందం, జాతీయ విపత్తు స్పందన దళం ఎన్‌ఆర్డీఎఫ్ బృందాలు, నేవీ కలిసి రెస్క్యూ ఆపరేషన్‌ను కొనసాగిసున్నాయి. తాళ్ల సాయంతో వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. భారీ వర్షాలు కురు- స్తుండటం వల్ల సహాయక చర్యలకు అంతరాయం కలుగుతోంది. కొండచరియల కింద చాలా మంది ప్రజలు చిక్కుకుపోయి ఉంటారని స్థానికులు భయాందోళన వ్యక్తం చేశారు. వయనాడ్లో సహాయక చర్యలు ముందుకుసాగే కొద్దీ ఆందోళనకర విషయాలు వెల్లడవుతున్నాయి. తాజాగా 600మంది వలస కార్మికుల ఆచూకీ గల్లంతైంది. దీనికితోడు స్థానికంగా మొబైల్ ఫోన్ నెట్వర్క్ కూడా దెబ్బతినడం సమస్యను మరింత తీవ్రంగా మార్చింది.. తాజాగా కంపెనీ జనరల్ మేనేజర్ బెనిల్ జోన్స్ మాట్లాడుతూ మా కార్మికులతో ఇప్పటివరకు సంప్రదించలేకపోయాం. మొబైల్ నెట్వర్క్ కూడా పనిచేయడంలేదు అని తీవ్ర ఆందో ళన వ్యక్తం చేశారు.


### చరియార్ నదిలో తేలియాడుతున్న మృతదేహాలు..

మరోవైపు వయనాడ్ లో కొండచరియలు విరిగిపడిన ఘటనకు సంబంధించి చాలా మృతదేహాలు మల్లపురం చలియార్ నదిలో తేలియాడుతున్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఘటనా స్థలానికి కిలోమీటర్ల దూరంలో దాదాపు 11 మృతదేహం స్థానికులను కలచివేసింది. అటవీ ప్రాంతంలోకి ఐదు మృతదేహాలు కొట్టుకు వచ్చినట్లు స్థానిక ఆదివాసీలు తెలిపారు. ఎమ్మెల్యే ఐసీ బాలకృష్ణన్ కూడా నదిలో అనేక శవాలు తేలుతున్నట్లు ధృవీకరించారు. కాల్పెట్టా ఎమ్మెల్యే టి సిద్ధిఖీ మాట్లాడుతూ ముండకై గ్రామంలో పరిస్థితి ఊహించిన దానికన్నా భయానకంగా ఉండొచ్చని ఫేర్కొన్నారు. బాధితులకు సాయం చేయడానికి నౌకాదళానికి చెందిన 30మంది గజ ఈతగాళ్లను రప్పించారు. మరోవైపు రెండు ఎయిర్ ఫోర్స్ హెలికాప్టర్లను రంగంలోకి దించారు. 200మంది సైనిక సిబ్బంది కూడా పనిచేస్తున్నారు.

# ఛాయ్ వాలా ప్రధాని కావడమే కాంగ్రెస్ పార్టీకి కష్టం

### ఇండియా బ్లాక్ పై నిర్మలమ్మ నిప్పులు..!

**విశ్వంభర (బిజినెస్) :** కాంగ్రెస్ పార్టీ సారథ్యంలోని విపక్ష 'ఇండియా కూటమి'పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నిప్పులు చెరిగారు. 'సాధారణ ఓబీసీ చాయ్‌వాలా మంచిగా దేశాన్ని నడిపించడం' ఇండియా కూటమికి సమస్యగా ఉందని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర (2024–25) బడ్జెట్‌పై లోక్‌సభలో సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తూ ఆమె పై వ్యాఖ్యలు చేశారు. 2004–05 నుంచి కేంద్ర బడ్జెట్లలో రాష్ట్రాల పేర్లు ప్రస్తావించలేదని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. అంత మాత్రానా అన్ని రాష్ట్రాలకు కేంద్రం నిధులు సమకూర్చలేదని అర్థమా? అని ప్రశ్నించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు మాత్రమే నిధులు కేటాయించారన్న విపక్ష సభ్యుల విమర్శలను నిర్మలా సీతారామన్ తప్పుబట్టారు. '2004–05 బడ్జెట్ ప్రసంగంలో 17 రాష్ట్రాలు, 2005–06లో 18, 2006–07లో 16, 2009–10లో 26 రాష్ట్రాల పేర్లు ప్రస్తావించలేదు. అంత మాత్రాన ఆయా రాష్ట్రాలకు నిధులు కేటాయించనట్లా? విపక్షాల ప్రచారం తప్పుదోవ పట్టించేలా ఉంది' అని వ్యాఖ్యానించారు.



# ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు గడువును ఆగస్టు 31 వరకు పెంచండి..

### సీబీడీటీకి ఏఐఎఫ్‌టీపీ వినతి

**విశ్వంభర(బిజినెస్) :** 2024–25 అసెస్‌మెంట్ సంవత్సరానికి ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేయడానికి గడువును ఆగస్టు 31 వరకు పొడిగించాలని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ ని కోరింది. పలు రాష్ట్రాల్లో వరదలు రిటర్న్ ఫైలింగ్ ప్రక్రియపై తీవ్ర ప్రభావం చూపాయని ఏఐఎఫ్‌టీపీ జాతీయ అధ్యక్షుడు నారాయణ జైన్, నారాయణ్ జైన్, డైరెక్ట్ ట్యాక్స్ రిప్రజెంటేషన్ కమిటీ చైర్మన్ ఎస్ఎం సురానా పేర్కొన్నారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌లో కొండచరియలు విరిగిపడడంతో ఈ కష్టాలు మరింతగా పెరిగాయన్నారు. ఆదాయపు పన్ను పోర్టల్, సాఫ్ట్‌వేర్‌లో సమస్యలు ఉన్నాయని, వివిధ ఫారమ్‌లను డౌన్‌లోడ్ చేయడం, ధ్రువీకరణలో ఇబ్బందులు ఉన్నాయని ఓ మెమోరాండంలో పేర్కొన్నారు. అదే సమయంలో బ్యాంకుల ద్వారా సెల్ఫ్ అసెస్‌మెంట్ పన్ను చెల్లింపు, చలాన్‌లను డౌన్‌లోడ్ చేసే ప్రక్రియకు సైతం సమయం పడుతుందని తెలిపారు. ఇదిలా ఉండగా వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు 2024–25 అసెస్‌మెంట్ ఇయర్‌కు సంబంధించిన ఐటీఆర్ దాఖలు చేసేందుకు ఈ నెల 31తో గడువు ముగియనున్నది. గడువులోగా ఐటీఆర్ దాఖలు చేయకపోతే జరిమానా విధించే అవకాశం ఉన్నది. గడువులోగా ఐటీఆర్ దాఖలు చేయలేక పోతే ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 234ఎ జరిమానా, వడ్డీ సైతం చెల్లించాల్సి రానున్నది. అదనంగా సెక్షన్ 234ఎఫ్ లేట్ ఫీజును సైతం విధిస్తుంది. ఆదాయాన్ని బట్టి రూ. 1,000 నుంచి రూ. 5వేల జరిమానా విధించే ఛాన్స్ ఉంది. అంతే కాకుండా పలు తగ్గింపులు, మినహాయింపులను క్లెయిమ్ కోల్పోయే ప్రమాదం ఉంటుంది.



# రవితేజ మిస్టర్ బచ్చన్ టీజర్ అదిరింది



విశ్వంభర, సినిమా : మాస్ మహారాజా రవితేజ కొత్త సినిమాను మిస్టర్ బచ్చన్ టీజర్ ఇవాళ విడుదలైంది. ఈ సినిమాలో జగపతిబాబు, భాగ్యశ్రీ బోర్సే, సచిన్ ఖేడేకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను వచ్చే నెల 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విడుదల చేస్తున్నారు. ఈ సినిమాలోని యాక్షన్ సీన్లను ఈ టీజర్‌లో చూపించారు. రవితేజ ఫైటింగ్ అదుర్స్ అనిపిస్తోంది. ‘‘సక్సెస్, ఫెయిల్యూర్స్ ఇంటికి వచ్చే చుట్టాలు లాంటివి.. వస్తుంటాయి, పోతుంటాయి.. యాటిట్యూడ్ ఇంటి పేరు లాంటిది.. పోయేదాకా మనతోనే ఉంటుంది’’ అంటూ రవితేజ చెప్పిన డైలాగ్ ఫ్యాన్స్ ను అలరిస్తోంది. ఈ సినిమాలో రవితేజ యాక్షన్‌తో పాటు కామెడీని కూడా ఇరగదీసినట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. టీజర్ లో మొదట హీరో, హీరోయిన్ మధ్య ఉండే లవ్ సీన్స్ చూపించారు. చుట్ట కాల్చుతూ, చదరంగం ఆడుతూ జగపతి బాబు కనపడిన తీరు ఫ్యాన్స్ తో విజిల్స్ కొట్టిస్తోంది. హరీశ్ శంకర్ దర్శకత్వంలో యాక్షన్ ఎంటర్‌టైనర్ ఈ సినిమా రూపుదిద్దుకుంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకుంది. నాలుగు రోజుల క్రితం ఈ సినిమా నుంచి విడుదలైన రెప్పల్.. డప్పుల్ పాట అందరినీ అలరించింది. ఈ సినిమాకు మిక్కీ జే మేయర్ సంగీతం అందించాడు.

# కన్నప్పలో మధుబాల లుక్ రిలీజ్



విశ్వంభర, సినిమా: హీరో విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ ‘కన్నప్ప’లో దిగ్గజ నటులు భాగస్వామ్యం అవుతున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌లో మోహన్ బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, ప్రభాస్, అక్షయ్ కుమార్, బ్రహ్మానందం, మధుబాల వంటి వారు నటిస్తున్నారు. ఈ సినిమా నుంచి బయటకొస్తున్న ఒక్కో అప్ డేట్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ క్రమంలోనే తాజాగా 'కన్నప్ప' సినిమా నుంచి మధుబాల లుక్ రిలీజ్ చేశారు మేకర్స్. చెంచుల వీరత్వాన్ని తెలిపేలా ఉన్న ఈ లుక్ ఆకట్టుకుంటోంది. ఈ మేరకు పోస్టర్ పై రాసిన పదాలు వీరనారి తెగువను తెలుపుతున్నాయి. తాజాగా వదిలిన ఈ పోస్టర్ సినిమాపై ఉన్న ఆసక్తిని రెట్టింపు చేసింది. అనేక మంది పాన్ ఇండియా స్టార్స్ ఉండటం వల్ల అందరి దృష్టి ఈ ప్రాజెక్ట్ మీద పడింది. 'కన్నప్ప' సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చే విజువల్ వండర్‌గా రాబోతోంది. ధైర్యవంతుడైన యోధుడు శివుని భక్తుడైన కన్నప్ప కథను అద్భుతంగా మలుస్తున్నారు. కన్నప్ప అచంచలమైన విశ్వాసం తరతరాలుగా అందరికీ స్ఫూర్తినిస్తూ ఉంది. ఎంతో అంకితభావంతో విష్ణు మంచు ఈ పాత్రను పోషిస్తున్నారు. మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ముఖేష్ కుమార్ సింగ్ డైరెక్ట్ చేస్తున్నారు. ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ షూటింగ్ చివరిదశకు చేరుకుంది.

# మతిపోగొడుతున్న బంగారు బొమ్మ



విశ్వంభర, సినిమా : తెలుగు చలన చిత్ర రంగంలో వరుస భారీ సినిమాలతో దూసుకుపోతోంది అచ్చ తెలుగు సోయగం శ్రీలీల. ఈ యేడు గుంటూరు కారం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ ముద్దగుమ్మ ఈమధ్య సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చి తన ఎడ్యుకేషన్ పూర్తి చేసే పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో సెలవు లభించినప్పుడల్లా విహార యాత్రలు చేస్తోంది. ప్రైవేట్ కార్యక్రమాలలో ఎక్కువగా పాల్గొంటోంది. తాజాగా శ్రీలీల ఓ మ్యాగ్జిన్ కోసం బంగారు వర్ణం డ్రెస్‌లో దర్శనమిచ్చి అహుతులను షాక్‌కు గురి చేసింది. ఇంతకుముందు కన్నా కాస్త గ్లామర్‌ను జత చేసి హోయలు పోతూ సోషల్ మిడియా వేదికగా తన అభిమానులకు సరికొత్త ట్రీట్ ఇచ్చింది. ఇప్పుడు ఈ ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

# విడుదలకు సిద్ధమైన శివం భజే

**విశ్వంభర, సినిమా:** యువ హీరో అశ్విన్ ప్రధాన పాత్రలో అప్సర్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం శివం భజే. గంగా ఎంటర్టయిన్ మెంట్స్ బ్యానర్ పై నిర్మాణం జరుపుకున్న ఈ చిత్రం తాజాగా సెన్సార్ పనులు పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి U/A సర్టిఫికెట్ మంజూరు చేసింది. ఈ సినిమా రన్ టైమ్ 2 గంటల 6 నిమిషాలు. న్యూ ఏజ్ కథ, కథనాలతో రూపుదిద్దుకున్న శివం భజే చిత్రం ఆగస్టు 1న వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఇప్పటికే ఈ సినిమా పాటలు, ట్రైలర్ కు ఆడియన్స్ నుంచి విశేష స్పందన లభించింది. శివం భజే చిత్రానికి వికాస్ బడిస నేపథ్య సంగీతం అందించారు. ఇందులో అర్బాజ్ ఖాన్, దిగంగనా సూర్యవంశీ, హైపర్ ఆది, మురళీ శర్మ, సాయి ధీన, బ్రహ్మాజీ, తులసి, దేవి ప్రసాద్, అయ్యప్ప శర్మ, షకలక శంకర్, కాశీవిశ్వనా, ఇనాయా సుల్తానా తదితరులు ఇతర పాత్రలు పోషించారు.






# గద్దర్ అవార్డ్స్ పై మెగాస్టార్ రియాక్సన్

**విశ్వంభర, సినిమా :** తెలుగు సినిమా రంగానికి గద్దర్ అవార్డులు ఇస్తామని తాము చేసిన ప్రతిపాదన పట్ల టాలీవుడ్ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం తీవ్ర విచారకరమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం డాక్టర్ సి.నారాయణరెడ్డి జాతీయ సాహిత్య పురస్కారం ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. గద్దర్ అవార్డులపై సినీ పరిశ్రమ మౌనంగా ఉండడం విచారకరమని, దీనిపై సినీ పరిశ్రమ పెద్దల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం చాలా బాధాకరమని సీఎం రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. దీంతో సీఎం వ్యాఖ్యలు టాలీవుడ్ లో చర్చనీయాంశంగా మారాయి. దీనిపై సినీ ప్రముఖులు ఒక్కొక్కరుగా స్పందిస్తున్నారు. తాజాగా మెగాస్టార్ చిరంజీవి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై స్పందించారు. గతంలో గద్దర్ అవార్డుల ప్రదానోత్సవానికి మద్దతుగా తాను మాట్లాడిన వీడియోను ట్విట్టర్ లో షేర్ చేసిన చిరంజీవి.. ‘తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చొరవ తీసుకుని, సినిమా అవార్డులను పునరుద్ధరిస్తూ , సినీపరిశ్రమలోని ప్రతిభావంతులకు, ప్రజా కళాకారుడు గద్దర్ గారి పేరు మీదుగా ప్రతియేటా ‘గద్దర్ అవార్డ్స్’ ప్రకటించడం హర్షణీయం. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన తర్వాత తెలుగు పరిశ్రమ తరపున, ఫిలిం ఛాంబర్, ప్రొడ్యూసర్ కౌన్సిల్ ఈ ప్రతిపాదనను ప్రతిష్టాత్మకంగా ముందుకు తీసుకువెళ్లేలా బాధ్యత తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను’ అని రాసుకొచ్చారు. చిరంజీవి తన పోస్టుకు తెలంగాణ సీఎంవోను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలుగు ఫిల్మ్ ఛాంబర్, తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ లను ట్యాగ్ చేశారు.

# వాల్‌నట్స్‌తో లాభాలు ఎన్నో..

**విశ్వంభర, ఫిచర్ :** బాదంను రాత్రంతా నానబెట్టి తింటే శరీరానికి ఎన్నో పోషకాలు లభిస్తాయని నిపుణులు చెబుతుంటారు. అయితే కేవలం నానబెట్టిన బాదంతో మాత్రమే కాదని, నానబెట్టిన వాల్‌నట్‌తోనూ ఎన్నో లాభాలు ఉంటాయని మీకు తెలుసా.? అవును ప్రతీ రోజూ ఉదయం నానబెట్టిన వాల్‌నట్స్‌ను తీసుకోవడం ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని చెబుతున్నారు. డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి ఎంతలా మేలు చేస్తాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ముఖ్యంగా బాదంను రాత్రంతా నానబెట్టి తింటే శరీరానికి ఎన్నో పోషకాలు లభిస్తాయని నిపుణులు చెబుతుంటారు. అయితే కేవలం నానబెట్టిన బాదంతో మాత్రమే కాదని, నానబెట్టిన వాల్‌నట్‌తోనూ ఎన్నో లాభాలు ఉంటాయని మీకు తెలుసా.? అవును ప్రతీ రోజూ ఉదయం నానబెట్టిన వాల్‌నట్స్‌ను తీసుకోవడం ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని చెబుతున్నారు.



- వాల్‌నట్స్‌లో ఉండే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఇందులో లభించే ఆరోగ్యకరమైన కొవ్వు.. గుండె సంబంధిత వ్యాధులను నివారించడంలో ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.
- వాల్‌నట్స్‌లో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో, గుండె ఆరోగ్యంగా ఉంచడంలో ఎంతగానో సహకరిస్తాయి. యాంటీ-ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్ డ్యామేజ్‌ను నివారించడంలో సహాయపడతాయి, తద్వారా సెల్ డ్యామేజ్‌ను నివారించి, ఇన్ఫ్లమేషన్‌ను తగ్గుతుంది.
- వాల్‌నట్స్‌లో ఎక్కువ క్యాలరీలు ఉంటాయి. దీంతో వీటిని తినగానే శరీరానికి ఇన్‌స్టాంట్ శక్తి లభిస్తుంది. కాబట్టి ఉదయాన్నే తినడం వల్ల మీ రోజువారీ పని చేయడానికి తగినంత శక్తి లభిస్తుంది.
- వాల్‌నట్స్ ఫైబర్‌కు పెట్టింది పేరు. ఇది జీర్ణక్రియతో పాటు బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఫైబర్ కారణంగా, పొట్ట ఎక్కువసేపు నిండుగా ఉంటుంది, తరచుగా ఆకలిగా అనిపించదు. దీని వల్ల బరువు అదుపులో ఉంటుంది. ఇది కాకుండా, ఫైబర్ కారణంగా రక్తంలో చక్కెర స్థాయిలు పెరగవు. ఇది మధుమేహాన్ని నివారించడంలో సహాయపడుతుంది.
- వాల్‌నట్స్‌లో విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది. ఇది చర్మానికి చాలా మేలు చేస్తుంది. విటమిన్ ఇ ముడతలు, చర్మం కుంగిపోవడం వంటి అనేక వృద్ధాప్య సమస్యలను నివారిస్తుంది.

# సంతాన సాఫల్య చికిత్సలకు పెరుగుతున్న డిమాండ్

**విశ్వంభర, ఫిచర్ :** ప్రస్తుత రోజుల్లో సంతాన సాఫల్య చికిత్సలకు ఫుల్ డిమాండ్ పెరుగుతోంది. గత దశాబ్దంలో పురుషులలో సంతానరాహిత్య సమస్యలో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. తెలంగాణలో పురుషులు, మహిళల్లో సంతానరాహిత్యం ఎక్కువగా కనిపిస్తోంది. సంతానసాఫల్య రేటు రాష్ట్రంలో క్రమంగా తగ్గుతోంది. పెళ్లి ఆలస్యం, జీవనశైలిలో మార్పులు సంతానలేమి సమస్యకు ముఖ్య కారణమని ఫెర్టిలిటీ నిపుణులు చెబుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో సంతానోత్పత్తి చికిత్సకు 35 ఏళ్లు పైబడిన మహిళలే ఎక్కువగా వస్తున్నారు. అదే, గ్రామీణ ప్రాంతాల్లో మహిళల సగటు వయస్సు 22ఏళ్ల నుంచి 23 ఏళ్లు ఉండటం ఆందోళనకరం. ఒక్కో మహిళకు సగటున 2.1 మంది పిల్లలు ఉండాలి.. కానీ, 1.8 మంది ఉంటున్నారు. గత పదేళ్లలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందింది. ప్రీఇంప్లాంటేషన్ జెనెటిక్ టెస్టింగ్ (పీజీటీఏ) వంటి పరీక్షలతో ఇప్పుడు జన్యుపరమైన సమస్యలను పరీక్షించవచ్చు. పిండం ఎంపికలో డీఎన్ఏ ఫ్రాగ్మెంటేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటివి ఐవీఎఫ్ సక్సెస్ రేట్‌కు దోహదపడతాయి. పిల్లలు పుట్టని జంటలకు కొత్త ఆశ, మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. క్రియోప్రిజర్వేషన్ కారణంగా వీర్యం, అండాలు, పిండాలను కూడా సమర్థంగా స్టోర్ చేసే పరిస్థితి ఉంది. వయసు పైబడిన తర్వాత కూడా పిల్లలు కావాలనుకున్నా సులభమే అవుతుందని నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీలో ఫెర్టిలిటీ నిపుణురాలు డాక్టర్ లక్ష్మీ చిరుమామిళ్ల పేర్కొన్నారు.

**పురుషుల సంతానరాహిత్యంలో మార్పు**

సంతానరాహిత్య సమస్యలకు పరీక్షలకు పురుషులు ముందుకు వస్తున్నారని సంతానసాఫల్య నిపుణులు అంటున్నారు. దశాబ్దం క్రితం పురుషులు వీర్యం విశ్లేషణకు ముందుకు వచ్చేవారు కాదని చెబుతున్నారు. పురుషుల కారణంగా సంతానరాహిత్య సమస్యలు ఉంటాయంటే పెద్దగా పట్టించుకోనేవారు కాదు. కానీ, ఇప్పుడు వీర్యం విశ్లేషణ విషయంలో పురుషులు ధైర్యంగా ముందుకొస్తున్నారు.

రిపోర్టర్స్ కావలెను
V3 NEWS
తెలుగు దినపత్రిక విశ్వంభర అక్షరం సాక్షిగా...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com